
బదిలీల హైరానా

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో కీలక శాఖల్లో పనిచేస్తున్న వారు అనుకూలమైన స్థానాల కోసం వేట ప్రారంభించారు. పోస్టింగ్‌లలో అధికారపార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ప్రాధాన్యం ఉండటంతో అత్యధిక శాతం మంది ఉద్యోగులు.. టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నేతల ఆశీస్సుల కోసం ఆరాటపడుతున్నారు. కూటమి పార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నేతల ద్వారా వారిపై ఒత్తిళ్లు పెంచుతున్నారు. సిఫార్సు లేఖలు పొందేందుకు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు గతంలో తమకు పరిచయం ఉన్న టీడీపీ నేతలు, పైస్థాయి అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. మరికొందరు స్థానిక నాయకులను వివిధ రూపాలలో ఆకర్షించి పైరవీలు కూడా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేసమయంలో ఐదేళ్లుగా వైసీపీ నేతలతో అంటకాగిన ఉద్యోగులు హైరానా పడుతున్నారు. ఎలాగోలా టీడీపీ ఎమ్మెల్యేలను కలిసేందుకు మార్గాలను వెతుక్కుంటున్నారు.



- కీలక శాఖల్లో మార్పులకు ప్రభుత్వ ఆదేశం
- ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం ఉద్యోగుల ఆరాటం
- కూటమి నేతల ద్వారా సిఫార్సు లేఖలకు ఒత్తిళ్లు
- కోరుకున్న స్థానాల కోసం కొందరు పైరవీలు
- వైసీపీతో అంటకాగిన వారిలో ఆందోళన
- నెలాఖరుకు ముగియనున్న ప్రక్రియ



ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల తర్వాత ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 31లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. అభ్యర్థన విధానంలో స్థానచలనానికి అవకాశం ఇచ్చింది. మండల స్థాయిలో కీలకమైన రెవెన్యూలోని డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, అలాగే ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఈలతోపాటు గ్రామస్థాయిలోని వీఆర్వో, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది బదిలీలపై వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ ముఖ్య నేతలు దృష్టిసారించారు. అలాంటి వారు జిల్లాలో వందల సంఖ్యలోనే ఉన్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులు వారికి నచ్చినచోట పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

15 కీలక శాఖల్లో బదిలీలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పాలనను గాడిలో పెట్టడంపై దృష్టిసారించింది. తొలుత కీలకమైన ఐఏఎస్, ఐపీఎస్ తర్వాత డీఎస్పీల బదిలీలు చేపట్టింది. ప్రస్తుతం మండల, గ్రామ, పట్టణ స్థాయిలోని వివిధ శాఖల ఉద్యోగుల బదిలీలపై దృష్టి సారించింది. ఇప్పటికే తహసీల్దార్లు, సీఐ, ఎస్ఐల నియామకాలు దాదాపు ఒక కొలిక్కి వచ్చాయి. తాజాగా 15 కీలక శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామ, వార్డు సచివాలయాలు, రిజిస్ట్రేషన్, దేవదాయ, పరిశ్రమలు, పౌరసరఫరాల వంటి శాఖలతోపాటు అన్ని ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగులు బదిలీలు కానున్నారు. ఈనెల 19 నుంచి 31 లోపు ప్రక్రియ పూర్తికి ఆదేశాలు ఇచ్చింది. ఒకే పట్టణం లేదా గ్రామంలో ఐదేళ్లు పనిచేసిన వారు విధిగా బదిలీ కావాల్సి ఉంది. మిగిలిన వారు జీరో సర్వీసుతోనూ కావాలనుకొంటే బదిలీ కోరుకోవచ్చు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇంచుమించు ఆయాశాఖల్లో అందరూ బదిలీ అయ్యే అవకాశం ఉంది.

కొందరు ముందస్తుగానే లేఖలు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రస్తుతం జిల్లాలో ఏప్రాంతంలో పనిచేస్తున్న వారు అక్కడే లేదా పొరుగు నియోజకవర్గాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందు కోసం అధికారపార్టీ నేతలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. బదిలీలలో అధికారపార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యం ఉంటుందన్నది బహిరంగ సత్యం. దీంతో వారిని ప్రసన్నం చేసుకొని సిఫార్సు లేఖలు పొందేందుకు పోటీపడుతున్నారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో జిల్లావ్యాప్తంగా సిఫార్సుల లేఖల కోసం వచ్చిన ఉద్యోగులతో జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధుల గృహాలు, కార్యాలయాల వద్ద రద్దీ నెలకొంది. బదిలీలు ఉంటాయని గ్రహించి నెలక్రితమే కొందరు ఉద్యోగులు కీలక నేతల వద్ద హామీలు, తదనుగుణంగా లేఖలు కూడా తీసుకొన్నారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ పూర్తికి గడువు సమీపిస్తుండటంతో అధికారపార్టీ ప్రజాప్రతినిధులపై ఒత్తిడి మరింత పెరిగింది. తమకు అనుకూలంగా వ్యవహరించే ఉద్యోగుల పోస్టింగుల కోసం కూటమి పార్టీలకు చెందిన మండల, గ్రామస్థాయి నేతలు కూడా వారి అధినాయకులపై ఒత్తిళ్లు పెంచారు.

కుదరని ఏకాభిప్రాయం

- నలుగురు జిల్లా అధికారుల పోస్టులపై తర్జనభర్జన
- అధికారపార్టీ నేతల తీరుపై ఆరా తీస్తున్న అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో అధికారుల బదిలీల వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ప్రధానంగా మూడు, నాలుగు శాఖల జిల్లా అధికారుల నియామకం విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. రాష్ట్రంలో అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ వేగవంతమైన విషయం విదితమే. కిందిస్థాయిలో ముఖ్యమైన అధికారుల బదిలీలు జరిగి వివిధ శాఖల ఉద్యోగుల మార్పు వ్యవహారం ప్రస్తుతం నడుస్తోంది. కిందిస్థాయిలో పోలీసు, రెవెన్యూ ముఖ్య అధికారుల నియామకంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక పంథాను అనుసరిస్తోంది. పోలీసు శాఖలో డీఎస్పీల నియామకాన్ని పైనుంచే నిర్వహించారు. సీఐల నియామకంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు సూచించిన వారిపై కూడా ప్రత్యేక పరిశీలన చేసి సరైన వారు కాకపోతే వేరేవారిని నియమించారు. ఆర్డీవోలు, డీఎస్పీల విషయంలో ఎమ్మెల్యేలు చెప్పినవి విన్నారే తప్ప అధిష్ఠానం అనుకున్న వారికే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక కలెక్టర్, ఎస్పీలను అయితే అధిష్ఠానమే ఎంపిక చేసింది. కొన్ని గంటల ముందు ఆ విషయాన్ని జిల్లాకు చెందిన మంత్రికి మాత్రమే సమాచారం ఇచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు సమావేశమై నియోజకవర్గ స్థాయిలో ఎవరికి వారు పర్యవేక్షించుకోవాలని, జిల్లాస్థాయి అధికారుల బదిలీలపై ఉమ్మడిగా మాట్లాడుకొని ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.


నాలుగైదు శాఖలపై సమస్య

జిల్లాస్థాయిలోని ఆయా శాఖల అధికారుల నియామకానికి సంబంధించి వచ్చేసరికి టీడీపీ నేతలు పూర్తిస్థాయిలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ప్రధానంగా జడ్పీ సీఈవో, డీపీవో, విద్యుత్‌శాఖ ఎస్ఈ, మైనింగ్ డీడీ, ఏడీ, డ్వామా పీడీ తదితర అధికారుల నియామకం విషయంలో నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. తొలుత జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల సంతకాలతో కొన్ని పోస్టులకు సిఫార్సు లేఖలను తయారు చేశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న ఒక ఎమ్మెల్యే సదరు సిఫార్సు లేఖలపై సంతకం పెట్టి మిగిలిన వారి వద్దకు పంపగా వారు వాటిపై సంతకాలు చేశారు. అయితే అందులో మంత్రి స్వామి సంతకం లేకపోవడం గమనార్హం. అయితే ఆరంభంలో ఒకట్రెండు శాఖల అధికారుల విషయంలో సీనియర్ నాయకుడు ఫోన్ చేయడంతో మంత్రి స్వామి ప్రత్యేకంగా సిఫార్సు లేఖలు ఇచ్చారు. అయితే చివరకు వచ్చేసరికి జిల్లా సిఫార్సు లేకుండానే ఆయా శాఖల అధికారులను నియమించాలని ఆయా మంత్రులకు లేఖలు పంపారు. మంత్రి సంతకం లేకపోవడంతో కొన్ని శాఖల వారు ఆ సిఫార్సులను పక్కనపెట్టారు. తదనంతరం మంత్రి వైపు నుంచి సీఈవో, డీపీవో, మైనింగ్ శాఖ అధికారుల నియామకానికి సంబంధించి వేరే అధికారుల పేర్లు సూచిస్తూ లేఖలు వెళ్లాయి. ఉదాహరణకు డీపీవోగా పశ్చిమప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే సిఫార్సుతో ఒక అధికారి పేరును తొలుత సూచించారు. అయితే మంత్రి స్వామి కొండపి నియోజకవర్గం నుంచి సింగయ్య అనే అధికారి పేరును ప్రతిపాదించారు. ఉన్నతాధికారులు తొలుత ఎమ్మెల్యే సూచించిన అధికారి పేరును తిరస్కరించినట్లు తెలిసింది. తాజాగా కలెక్టర్ జోక్యం చేసుకొని ముఖ్యమైన శాఖ అయినందున తమకు సమర్థవంతమైన అధికారి కావాలని డీపీవో విషయాన్ని వదిలేయాలని మంత్రితోపాటు కొందరు సీనియర్ నాయకులను కోరినట్లు తెలిసింది. అయితే సీనియర్ ఎమ్మెల్యే ఆ ప్రతిపాదన అంగీకరించకపోవడంతో సమస్య ఎదురైంది.

జడ్పీ సీఈవో విషయంలోనూ అంతే

జడ్పీ సీఈవోగా మంత్రి సిఫార్సు లేకుండా ఒక పేరు ఎమ్మెల్యేలు సూచించగా మంత్రి ఉన్నతస్థాయిలో నాయకుల సిఫార్సుతో మరోపేరు సూచించారు. దీంతో సమస్య ఉత్పన్నమైంది. డ్వామా పీడీ విషయంలో ఒక ఎమ్మెల్యే ఒకరిని సూచించగా అత్యధికులు ఆ అధికారిని తీవ్రంగా వ్యతిరేకించారు. మైనింగ్ అధికారుల విషయంలోనూ జిల్లా ఎమ్మెల్యేల నుంచి ఒకటి, రెండు పేర్లు అధిష్ఠానంకు చేరాయి. విద్యుత్ శాఖకు కట్టా వెంకటేశ్వర్లు అనే అధికారి నియామకానికి అందరూ సిఫార్సు చేశారు. అయితే ఆయనకు పదోన్నతి లేకుండా ఇన్‌చార్జి ఇవ్వాలా? వద్దా? అన్న విషయంలో సీఎం సూచన ప్రకారం నడుస్తానని మంత్రి రవికుమార్ చెప్పినట్లు తెలిసింది. ఈలోపు ఒకరిద్దరు నాయకులు ప్రస్తుత ఎస్ఈనే కొనసాగించాలని సూచించటంతో మిగిలిన వారు వారి నిర్ణయాన్ని వ్యతిరేకించినట్లు సమాచారం.

ఆరా తీస్తున్న అధిష్ఠానం

జిల్లాస్థాయి అధికారుల బదిలీల విషయంలో నేతల మధ్య ఏకాభిప్రాయం ఎందుకు లభించలేదన్న విషయంపై టీడీపీ అధిష్ఠానంతో పాటు సీఎంవో అధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లా నేతలు సూచించిన ప్రతి అధికారి పనితీరుపై పరిశీలన చేస్తున్నారు. కొన్ని శాఖల మంత్రులు అయితే మీరందరూ ఏకాభిప్రాయంతో ఒకపేరు సూచించాలని అప్పటిదాకా నియామకాలు చేపట్టబోమని తేల్చిచెప్పినట్లు తెలిసింది. గతంలో ఉమ్మడి జిల్లా నేతలంతా ఏకాభిప్రాయంతో నడిచారు. ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చిందనే విషయంపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేకంగా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. తాజా పరిస్థితిని గమనించిన ఆ పార్టీలోని సీనియర్లు బుధవారం కేబినెట్ సమావేశం అనంతరం ఉమ్మడి జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.



నిరసన తెలుపుతున్న బాధితులు, కుటుంబ సభ్యులు

ఉద్యోగాల పేరుతో మోసం!

- వైసీపీ నేతలను వెంటనే అరెస్టు చేయాలి
- అక్రమాలపై సిట్‌తో దర్యాప్తు చేయించాలి
- ఒంగోలులో బాధితుల ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 26 : ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ముస్లిం జాగరణ్ మంచ్ రాష్ట్ర కన్వీనర్ షేక్ మహ్మద్ బుజ్జి డిమాండ్ చేశారు. జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరురాలు షేక్ సల్మాసుల్తానా, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు పీఏ బండారు సురేష్‌లు రూ.లక్షలు వసూలు చేసి ఫేక్ జాబ్ లెటర్లు ఇచ్చారని ఆరోపించారు. ఇంకొల్లు మండలం ఇడుపులపాడుకు చెందిన దొంతాల మహేష్‌కు మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో పోస్టు, దొంతాల మనోహర్, కనిగిరికి చెందిన ఒగ్గు వెంకటేశ్వర్లుకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇప్పిస్తామని రూ.23లక్షలను సుల్మాసుల్తానా తన ఫోన్‌పే అకౌంట్‌కు పలుదఫాలుగా జమ చేయించుకున్నారని ఆరోపించారు. కలెక్టర్ పేరుతో ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారని తెలిపారు. విషయం తెలుసుకున్న బాధితులు ప్రకాశం, బాపట్ల ఎస్పీలకు ఫిర్యాదు చేయగా వారిపై కేసు కూడా నమోదు చేశారన్నారు. వారిద్దరితోపాటు మరికొంత మంది కలిసి రూ.2కోట్ల వరకు వసూలు చేశారన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయాలని ఆయన కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు టీడీపీ నాయకుడు ఎస్.సుబ్బారావు గుప్తా, చెరుకూరి ఆదిలక్ష్మిలు సంఘీభావం తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అద్దంకి బస్టాండ్ నుంచి పాత మార్కెట్ సెంటర్, ట్రంకురోడ్డు, చర్చిసెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో పలువురు నిరుద్యోగులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అటవీ సంపదపై అక్రమార్కుల కన్ను

- చెట్లు నరికి దొడ్డిదారిన తరలింపు
- బ్యారన్ యజమానులకు విక్రయం
- పట్టించుకోని అధికారులు

పీసీపల్లి, ఆగస్టు 26: అటవీ సంపద తరలిపోతోంది. కొంతమంది అక్రమార్కులు చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. ఈఏడాది సీజన్‌కు ముందే చెట్లను కొట్టి బ్యారన్‌లకు తరలిస్తున్నారు. కర్రకు డిమాండ్ అధికంగా ఉండడంతో వ్యాపారుల కన్ను అటవీ చెట్లపై పడింది. అటవీ సమీపంలో ఉన్న చెరువులు, పొలాల్లో ఉన్న చెట్లను నరికేందుకు ఆయా గ్రామాల ప్రజలతో చర్చించి దేవస్థానాల అభివృద్ధికి నగదు చెల్లించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఆతరువాత సమీపంలోని అడవిలో ఉన్న చెట్లను సైతం నరికి అక్రమంగా తరలిస్తున్నారు. దాన్ని బ్యారన్ యజమానులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కందుకూరు, వెంకుపాలెం, చెన్నుపాడు, అగ్రహారం, పొన్నలూరు తదితర గ్రామాల్లో పొగాకు అధికంగా సాగు చేస్తారు. పొగాకు కాల్పునకు అవసరమైన కలప అక్కడి రైతులకు అందుబాటులో లేదు. దీంతో ఆయా ప్రాంతాల బ్యారన్ యజమానులు పీసీపల్లి మండలంలోని కర్ర వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పొగాకుకు మంచి ధర పలకడంతో సాగు విస్తీర్ణం పెరగనుంది. దీంతో సీజన్ ఆరంభానికి ముందు నుంచే కర్రకు డిమాండ్ పెరిగింది. బ్యారన్‌కు కర్రను తరలించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతితో ప్రభుత్వానికి చలానా తీసి పర్మిట్ పొందాలి. ప్రస్తుతం తుమ్మ, ఇతర కలప అధిక ధరలు పలుకుతుండడంతో కొంతమంది వ్యాపారుల చూపు అడవిపై పడింది. అటవీ కర్ర అయితే కొనే అవసరం ఉండదని, కేవలం కొట్టుడు కూలి మాత్రమే చెల్లిస్తే అధికంగా సొమ్ము ఆర్జించవచ్చన్న ఆలోచనతో దొరికిన చోటల్లా అటవీ సంపదను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.


అక్రమంగా నరికిన కలప


చెట్టును నరకగా మిగిలి ఉన్న మొదలు

అక్రమ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్‌లు బంద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, ఆగస్టు 26 : దర్శి నగర పంచాయతీలోని అక్రమ లేఅవుట్లలో క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో 'అక్రమ లేఅవుట్లపై చర్యలేవి?' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఇప్పటికే పట్టణంలోని అక్రమ లేఅవుట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆ సర్వే నంబర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు చేయకుండా నిలుపుదల చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సూచించినట్లు పేర్కొన్నారు. ఈ లేఅవుట్లలో ఎలాంటి భవన నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.


ఒంగోలులో ఉత్సాహంగా ఉట్టికొడుతున్న బాలుడు (ఇన్‌సెట్‌లో) కృష్ణుడు వేషధారణలో చిన్నారి

కృష్ణం వందే జగద్గురుం

శ్రీకృష్ణ జన్మాష్టమిని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రతి సంవత్సరం శ్రావణ బహుళ అష్టమిని శ్రీకృష్ణుని జన్మదినంగా భావించి పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది పండుగ సోమవారం వచ్చింది. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు కృష్ణ మందిరాలలో ప్రత్యేక పూజలు, ఉట్టి మహోత్సవాలు నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఒంగోలు నగరంలోని గోపాల్‌నగర్ శ్రీకృష్ణమందిరం, మంగమూరు రోడ్డు రాధా గోవిందాశ్రమం, ఐశ్వర్యనగర్‌లోని శ్రీమురళీకృష్ణ మందిరాల్లో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు జరిగాయి.

- -ఒంగోలు(కల్చరల్)

రిమ్స్‌కు శిశువు

- వైద్యుల పర్యవేక్షణలో పాపాయి
- కేసు పొన్నలూరు నుంచి ఒంగోలు వన్‌టౌన్‌కు బదిలీ


శిశువుతో రిమ్స్ నర్సు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 26 : తల్లి పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన బిడ్డ కొందరి నిర్వాకంతో రాష్ట్రమే దాటింది. అయితే అధికారుల చొరవతో చివరకు రిమ్స్‌కు చేరింది. కన్నతల్లే పుట్టిన బిడ్డను ఆసుపత్రిలోనే అమ్మకానికి పెట్టి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన వారికి విక్రయించింది. ఆమె స్వయంగా అంగన్‌వాడీ కార్యకర్త కావడం చర్చనీయాంశమైంది. అయితే బాలల హక్కుల కమిటీ ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు ఈనెల 25న పొన్నలూరులో జీరో ఎఫ్ఐఆర్‌తో కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం పొన్నలూరు నుంచి కేసును ఒంగోలు వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. పొన్నలూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఆ బిడ్డకు తల్లి కావడంతో ఐసీడీఎస్ శాఖలో కలకలం రేగింది. విచారణ చేపట్టిన పోలీసులు ఖమ్మం జిల్లా కల్లూరులో ఉన్న శిశువును ఒంగోలు తెప్పించారు. జీజీహెచ్(రిమ్స్) ఆసుపత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో పాపను ఉంచారు. ఆ పసికందు తల్లిని, మధ్యవర్తులుగా వ్యవహరించిన పద్మావతి, బ్రహ్మయ్యతోపాటు శిశువును కొనుగోలు చేసిన బాలసుందరరావును ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.


డేవిడ్‌రాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

డేవిడ్‌రాజుకు నివాళి

- హైదరాబాద్ నుంచి ఒంగోలుకు చేరిన భౌతికకాయం
- సందర్శించిన మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు, మాజీలు

- వివరాలు లోపలి పేజీల్లో..



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు అందజేస్తున్న యోగయ్యయాదవ్

నకిలీ స్టాంపు కుంభకోణంపై సమగ్ర విచారణ చేయించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 26 : జిల్లా కేంద్రమైన ఒంగోలులో నకిలీ స్టాంపు పేపర్లతో దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకొని సుమారు రూ. 300 కోట్ల విలువ చేసే భూములను కబ్జాచేశారని బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్ ఫిర్యాదు చేశారు. విజయవాడలోని ఆపార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన వారిధి(ఫిర్యాదుల స్వీకరణ)లో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణ, వారధి కార్యక్రమ కో ఆర్డినేటర్ కిలారు దిలీప్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ భూ దందా వ్యవహారం మొత్తం మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కనుసన్నల్లోనే జరిగిందన్నారు. అప్పటి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసినా నామమాత్రంగా విచారణ చేసి అసలు నేరస్థులను వదిలేసి చిన్నా చితకవారిమీద కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని,అందువల్ల ఈ అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. అలాగే ఒంగోలు-కొత్తపట్నం బీచ్ వద్ద అనేక మంది మత్స్యకారుల కుటుంబాలు చేపల వేట జీవనాధారంగా జీవనం సాగిస్తున్నారని, అందువల్ల కొత్తపట్నంలో మంజూరైన ఫిషింగ్ హార్బర్‌కు నిధులు ఇచ్చి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రామాయపట్నం పోర్టు పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో యోగయ్య యాదవ్‌కోరారు.

నాయకుల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు

నాగులుప్పలపాడు ఆగస్టు 26 : ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా ఊపడంతో కోరుకొన్న చోట పోస్టింగ్ దక్కించుకొనేందుకు వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విద్యా, ఆరోగ్య శాఖల మినహా మిగిలిన అన్ని శాఖల అధికారులకు ప్రస్తుతం వారు పనిచేస్తున్న జిల్లాల పరిధిలోనే బదిలీలు జరగనుండగా మండల పరిధిలోని పలువురు వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే పలువురు టీడీపీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఆదాయం అధికంగా ఉండే గ్రామాలను ఎంపిక చేసుకొన్న అధికారులు వాటిని తమకు కేటాయించేలా సిఫార్సు చేయాలని కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగిన కొందరు అధికారులు, అనేక ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు సైతం కూటమి ప్రభుత్వంలోనూ తమ హవా కొనసాగించేందుకు పావులుకదుపుతున్నట్లు సమాచారం.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్‌ను కలిసిన కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 26 : జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్ పర్సన్ విజయభారతి సయానిని కలెక్టర్ తమీమ్ అన్సారియా మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఒంగోలు వచ్చిన ఆమె స్థానిక ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో కొంత సేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం పలు అంశాలపై ఆమె కలెక్టర్‌తో చర్చించారు.



చైర్‌పర్సన్ విజయభారతిని సన్మానిస్తున్న కలెక్టర్



అభయాంజనేయస్వామి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అభయాంజనేయస్వామి వార్షిక వేడుకల్లో ఎమ్మెల్యే

సంతనూతలపాడు, ఆగస్టు 26: సంతనూతలపాడులోని ఆశ్రమం బజారులోని శ్రీఅభయాంజనేయస్వామి ప్రథమవార్షిక వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అర్చకులు వి.నాగసాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మొదటి టెంకాయను కొట్టి వేడుకలను ప్రారంభించారు. అంజయ్య మాస్టర్ ఆధ్వర్యంలో భజన వేడుకలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఆలయ నిర్వాహకులు చెరుకూరిహరికృష్ణ, టీడీపీ మాజీ అధ్యక్షుడు చెరుకూరి శ్రీను, మన్నం రామారావు, మందాడి సదానందనరావు, ఆళ్లరాము, శ్రీనివాసరావు, టి.నరసింహారావు, శ్రీనివాసరావు, ఆర్.అంకారావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో..

వడియారాజుల శక్తిస్వరూపిణి అంకమ్మతల్లి కొలుపుల కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు, ఆలయకమిటీ అధ్యక్షుడు తన్నీరు శేషుబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతకు ఎమ్మెల్యే బీఎన్ నివాళి

మండలంలోని పేర్నమిట్టకు చెందిన జనసేన నాయకులు ఇంకొల్లు శ్రీమన్నారాయణ (50) సోమవారం వేకువ జామున అనారోగ్యంతో మృతిచెందాడు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జనసేన సమన్వయకర్త కందుకూరిబాబు, రాష్ట్రకార్యదర్శి పి.విజయ్‌బాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు కే.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వరరెడ్డి, విష్ణు, శ్రీనివాసరావు, రాంబాబు, వాసు, టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు నివాళులర్పించారు.



హనుమాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు

హెచ్‌ఐవీపై అవగాహన

నాగులుప్పలపాడు ఆగస్టు 26 : హెచ్‌ఐవీపై బాపట్ల జిల్లా ఎయిడ్స్ నిర్మూలన నియంత్రణ సంస్థ, స్థానిక హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో హనుమాపురం గ్రామంలో డ్వాక్రా మహిళలు, గ్రామస్థులకు సోమవారం అవగాహన కల్పించి చైతన్య పరిచారు. ఆసంస్థ మండల ఓఆర్‌డబ్ల్యూ మల్లేశ్వరి హెచ్‌ఐవీ సంక్రమణ గురించి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం

పెరుగుతున్న వైరల్ జ్వరాల బాధితులు
పురపాలకుల్లో కనిపించని కనీస చర్యలు
వ్యాధుల నిర్మూలనపై ప్రచారం నిల్
పదిరోజులుగా ప్రతి ఇంటిలో ఒకరికి వైరల్ ఫీవర్
సీజనల్ వ్యాధులపై దృష్టిసారించని అధికారులు



చికిత్స పొందుతున్న రోగులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 26 : ప్రజారోగ్యంపై పురపాలక సంఘాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వాతావరణ మార్పులతో ప్రబలనున్న వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా అధికారులు ఆ విషయాన్ని గాలికొదిలేశారు. ఏటా ఇదే సీజన్‌లో మూడు నెలల పాటు మలేరియా అవగాహన మాసోత్సవాలను నిర్వహించాల్సి ఉంది. అయితే కనీస ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించకపోవడంతో పట్టణాలు కంపుకొడుతుండగా మరోవైపు మలేరియా, వైరల్ ఫీవర్‌లతో పిల్లలు, పెద్దలు జ్వరాల బారిన పడుతున్నారు. రోజు రోజుకు జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుండగా కనీస చర్యలపై యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై మర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో మలేరియా మహమ్మారి పొంచి ఉంది. ఈ ఐదు మాసాలు మలేరియా ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. పరిస్థితిని అధిగమించేందుకు ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు వైద్య, ఆరోగ్య శాఖ, గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాల్లో పురపాలక సంఘాలు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాయి. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడం తోపాటు, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు ప్రచారాన్ని నిర్వహిస్తుంటారు. వార్డుల్లో పర్యటించి, నీటి నిల్వలు లేకుండా, ఇళ్లమధ్య మురుగు కనిపించకుండా ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. అంతే కాకుండా నగరంలో ర్యాలీలు, విద్యార్థులకు చైతన్య కలిగించేలా కరపత్రాలు పంపిణీ, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాల్సి ఉండగా పట్టణ ప్రాంతాల్లోనూ, పురపాలక సంఘాల్లో అలాంటి వాతావరణం కనిపించడం లేదు. ప్రత్యేకించి ఒంగోలు మార్కాపురం, చీమకుర్తి, కనిగిరి, గిద్దలూరు, దర్శి మునిసిపాలిటీల్లో మాసోత్సవాల ఊసే కనిపించడం లేదు.

పారిశుధ్య చర్యలు మృగ్యం



వైరల్ జ్వరాలతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళారోగులు

వ్యాధుల సీజన్‌గా పిలవబడే వర్షాకాలంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రోజూ పారిశుధ్య పనులు నిర్వహించడంతో పాటు వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతంలో శుభ్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి. ఇంటి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధులపై ఆవగాహన కల్పించాలి. దాంతోపాటుగా ప్రతి రోజు కాలువల్లో మురుగు తొలగింపు, తడి చెత్త నిల్వ లేకుండా చూడాలి. ఖాళీ ప్రదేశాలలో, కాలువల్లో మురుగునీటిపై వ్యాపించే దోమలను లార్వా దశలోనే అంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మామూలు రోజుల్లో ఎలా ఉన్నప్పటికీ ఈ కాలంలో నీటి నిల్వలపై, ఖాళీ స్థలాల్లో మురుగు నీటిపై గంబూషియా చేపలు విడుదల చేయాలి. వృద్ధి చెందని దోమలను అంతం చేసేందుకు ఎబెట్, పైరిత్రిమ్, మలాథియన్‌తో స్ప్రే, ఫాగింగ్ చేయాలి. వాటితోపాటు ప్రతి వీధిలోనూ చెత్తను తొలగించిన పిదప బ్లీచింగ్ చల్లి, పట్టణాల్లో పరిశుభ్రమైన వాతావరణం కనిపించేలా చూడాలి. కానీ ఇలాంటి పరిస్థితి జిల్లాలోని ఏ పట్టణంలోనూ కనిపించడం లేదు. అంతే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కనీస ప్రచార పత్రాలను సైతం ముద్రించకపోవడం పరిశీలిస్తే అధికారుల తీరు ఏమిటో అర్థం అవుతోంది.

చాపకింద నీరులా మలేరియా వ్యాప్తి

మలేరియా జ్వరం అనేది చాపకింద నీరులా వ్యాపిస్తోంది. నాలుగు రకాలుగా ఉండే ఈ వ్యాధి అనాఫిలిస్ అనే దోమ కాటు వలన వస్తుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకు మలేరియా బాధితులు ఎక్కువగా ఉంటారు. మలేరియా జ్వరంలో మొదటిది ప్లాస్మోడియం వైవాక్స్ (పీవీ), ప్లాస్మోడియం పాల్సీఫారమ్ (పీఎఫ్), ప్లాస్మోడియం ఓవెల్, ప్లాస్మోడియం మలేరియా. వీటిలో అధికంగా సోకేది పీవీ, పీఎఫ్. ఇవి సోకితే రోజు మార్చి రోజు గజగజ వణికించే చలి జ్వరం, తలనొప్పి, చెమటలు పట్టడం, ఒళ్ళు నొప్పులు, రక్తహీనత కనిపిస్తాయి. ఈ జ్వరం సోకిన 10 నుంచి 15 రోజుల్లో రక్త పరీక్షల ద్వారా మలేరియా బయటపడుతుంది.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

● అలరించిన చిన్నారుల వేషధారణలు
● పలు చోట్ల ఉత్సాహంగా ఉట్టికొట్టిన యువత



ఒంగోలు నగరంలోని గోపాలనగర్ కృష్ణ మందిరంలో విశేషలలంకరణలో కృష్ణుడు

ఒంగోలు (కల్చరల్),ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలతో అలరించారు. సంస్కార భారతి సంస్థ, కోటీస్ షాపింగ్ మాల్ సంయుక్త ఆధ్వర్యంలో బాలగోపాలం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 40 మంది చిన్నారులు పాల్గొని బాలకృష్ణుడు, గోపికల వేషధారణలు ప్రదర్శించారు. అదేవిధంగా ఉట్టిమహోత్సవం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్కారభారతి అధ్యక్షుడు పత్తి రంగమన్నార్, కోటీస్ షాపింగ్ మాల్ అధినేత కోటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణుడి చిత్ర పటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జున రావు, ఉపాధ్యక్షులు జిల్లెల్లమూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించి శ్రీకృష్ణుని కీర్తనలు, పద్యాలు ఆలపించారు. కార్యక్రమంలో ఒంగోలు విభాగ్ సంపర్క్ ప్రముఖ్ పందరబోయిన పున్నారావు, పసుమర్తి వెంకటేశ్వర్లు, సాధు శ్రీనివాస గుప్తా, బత్తుల శ్రీనివాస రావు, రామానుజ పెరుమాళ్లు, ధనిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు. పాతమార్కెట్ దగ్గర ఉన్న కేరళ హైస్కూల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులకు గోపికా, కృష్ణుల వేషధారణ పోటీలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో..

నాగులుప్పలపాడు : కృష్ణాష్టమి వేడులను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాలలో సోమవారం శ్రీకృష్ణ మందిరాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పలు గ్రామాలలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీకృష్ణ యాదవ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. చిన్నారుల శ్రీకృష్ణుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేశారు. స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఒమ్మెవరం గ్రామంలో గోకుల్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో భక్తులు వేణుగోపాలస్వామికి పూజలు నిర్వహించారు. యువకులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా ఉట్టికొట్టారు.

చీమకుర్తిలో..

శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలు చీమకుర్తి పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.పట్టణంలోని ఇసుక వాగు సెంటర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో మూలవిరాట్‌ని అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున విచ్చేసి విశేషపూజలు జరిపారు.సామూహిక యంత్రం ఆలయప్రాంగణంలో నిర్వహించిన ఉట్టికొట్టు కార్యక్రమంలో భక్తులు ఆనందోత్సహల మధ్య పాల్గొన్నారు.రాత్రివేళ నగరోత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

హరిహరక్షేత్రంలో...

పట్టణంలోని హరిహరక్షేత్రంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు,సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతిలు పాల్గొన్నారు.ఆలయంలో విశేషపూజలు జరిపారు.ఉట్టికొట్టు వేడుకల్లో పాల్గొన్నారు.



చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులు

డేవిడ్‌రాజుకు నేతల నివాళి

హైదరాబాద్ నుంచి ఒంగోలు చేరిన భౌతికకాయం
మంత్రి స్వామి, ఎమ్మెల్యే బీఎన్, కరణం ఇతర ముఖ్యుల నివాళి

ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ రాజకీయ నేత , జడ్పీ మాజీచైర్మన్ పాలపర్తి డేవిడ్‌రాజుకు వివిధ వర్గాల ప్రజలు ఘనంగా నివాళులు అర్పించారు. గతరాత్రి హైదరాబాద్‌లో కన్నుమూసిన డేవిడ్‌రాజు భౌతికకాయాన్ని సోమవారం మధ్యాహ్నం 12 గటలకు ఒంగోలు తీసుకువచ్చారు. నగరంలోని క్లౌపేట రెండవలైన్‌లో ఉన్న డేవిడ్‌రాజు స్వగృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రాజకీయ, ఇతర రంగాల ప్రజలు, పలువురు ప్రముఖులు తరలివచ్చి నివాళులు అర్పించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి డేవిడ్‌రాజు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే డేవిడ్‌రాజు కుమారుడు విజేష్‌రాజు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, డాక్టర్ బాచిన గరటయ్యలతో పాటు ఈదరహరిబాబు, నారపుశెట్టిపాపారావు, కసుకుర్తి ఆదెన్న, టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, ఒంగోలు మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఏఎంసీ మద్దిపాడు మాజీ చైర్మన్ మండవ రంగారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గతంలో డేవిడ్‌రాజు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సంతనూతలపాడు, వైపాలెం నియోజకవర్గాల నుంచి రాజకీయవర్గాలకు చెందిన అనేక మంది తరలివచ్చి నివాళులు అర్పించారు. రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తదితరులు ఫోన్‌లో డేవిడ్‌రాజు కుమారుడు విజేష్‌రాజును పరామర్శించారు. ఇదిలా ఉండగా డేవిడ్‌రాజు అంత్యక్రియలు మంగళవారం ఆయన స్వగ్రామమైన ఎన్‌జీపాడు మండలం మట్టిగుంటలో జరగనున్నాయి. ఆ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పాల్గొంటారని సమాచారం.



డేవిడ్‌రాజు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న కరణం, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, గరటయ్య తదితరులు

మాగుంట సంతాపం

ఒంగోలు(కలెక్టరేట్) : మాజీ ఎమ్మెల్యే జిల్లా పరిషత్‌మాజీ చైర్మన్ పాలపర్తి డేవిడ్‌రాజు మృతికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. డేవిడ్‌రాజు కాంగ్రెస్, తెలుగుదేశం,వైసీపీ పార్టీల తరుపున ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు అనేక పదవులు నిర్వహించి జిల్లా ప్రజలతో పాటు దళితుల అభ్యున్నతికోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన మృతితీరని లోటని, డేవిడ్‌రాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపాన్ని తెలిపారు.

డివిజన్ స్థాయి సర్దుబాటులో కొందరు టీచర్లకు మినహాయింపు

ఒంగోలు(విద్య),ఆగస్టు 26 : ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి పని సర్దుబాటులో కొందరికి మినహాయింపు ఇచ్చారు. ఇప్పటికే మండల స్థాయిలో టీచర్ల సర్దుబాటు పూర్తయింది. మండల స్థాయిలో మిగులు టీచర్లను అవసరం ఉన్న పాఠశాలల్లోకి మార్చారు. ఇంకా మిగిలి ఉన్న టీచర్లు, ఖాళీలను డివిజన్ స్థాయి సర్దుబాటులో మిగులు టీచర్లను ఇతర మండలాలకు కేటాయిస్తారు. ఇతర మండలాల మిగులు టీచర్లతో ఆయా మండలాల్లో ఖాళీగా మిగిలిపోయిన పోస్టులకు టీచర్లను కేటాయిస్తారు.

డివిజన్ స్థాయిలో టీచర్ల సర్దుబాటులో కొందరు టీచర్లకు మినహాయింపు ఇచ్చారు. అవివాహిత మహిళా టీచర్లు, భార్యభర్తలు ఉద్యోగులైనవారు(స్పౌజ్), వితంతువులు, చటబద్ధంగా విడాకులు పొందిన మహిళా టీచర్లు, కేన్సర్ పేషంట్లు, ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయించుకున్నవారు, అవయవమార్పిడి జరిగిన వారు, న్యూరో సర్జరీ పేషెంట్లు,బోన్‌టీబీ పేషెంట్లు, కిడ్నీమార్పిడి డయాలసిస్ పేషెంట్లు, వెన్నెముక సర్జరీ అయిన వారు, మానసికంగా ఎదుగుదల లేని పిల్లల తల్లిదండ్రులు, జువనైల్ డయాబెటిస్‌తో బాధపడుతున్న పిల్లల తల్లిదండ్రులు, తలసేమియాతో బాధపడుతున్నవారు, హిమోఫిలియా వ్యాధితో బాధపడుతున్నవారు, కండరాల పట్టివేతతో బాధపడుతున్న వారు, పుట్టుకతోనే గుండెలో రంధ్రాలు ఉన్న పిల్లలు వారికి డివిజన్ స్థాయిలో మినహాయింపు ఇచ్చారు. పని సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో వీరికి డివిజన్ స్థాయిలో మినహాయింపు ఇచ్చారు. ఇంకా డివిజన్ స్థాయిలో మినహాయింపు కోరుకునే వారు తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువీకరణ పత్రాలు మండల విద్యాధికారికి సమర్పించి మినహాయింపు పొందాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది

నేడు టీచర్లకు శిక్షణ

ఒంగోలు(విద్య), ఆగస్టు 26 : జిల్లాలోని ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు,స్పెషల్ టీచర్లు,భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లకు మంగళవారం ప్రశస్తయాప్ వినియోగంపై ఆన్‌లైన్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు, సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం, కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ద్వారా పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల్లో ప్రత్యేక అవసరాలు గల వారిని ప్రాథమికంగా గుర్తించేందుకు ప్రశస్త యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ ఓరియంటేషన్‌లో పాల్గొనేందుకు మండల విద్యాధికార్యాలయానికి లింకు పంపించినట్లు తెలిపారు.



ఒంగోలు 1 వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

పొగాకు గరిష్ఠ ధర రూ.358

సంతనూతలపాడు, ఆగస్టు 26 : మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు చిలంకూరు నుంచి 1,540 పొగాకు బేళ్లు రాగా 1,249 బేళ్లు అమ్ముడయ్యాయి. 291 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.358లు పలకగా, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.302.52 వచ్చినట్లు తెలిపారు. వేలంలో 16 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

తర్లుపాడు రైల్వేస్టేషన్‌లో సమస్యల గుర్తింపు

తర్లుపాడు, ఆగస్టు 26: తర్లుపాడు రైల్వే స్టేషన్‌లోని సమస్యలను ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బృందం సభ్యులు సాగర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు పరిశీలించారు. ఎంపీ ఆదేశాల మేరకు తర్లుపాడులోని రైల్వేస్టేషన్‌లోని సమస్యలను గుర్తించేందుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు తర్లుపాడులో నెల కొన్న సమస్యలను వారికి వివరించారు. కరోనాకు ముందు తర్లుపాడులో కాచీగూడ- అమరావతి, డోన్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగేవన్నారు. ప్రస్తుతం ఆ రైళ్లు ఆగక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వారి దృష్టికి తీసుకొచ్చారు. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలో ఉన్న గేటుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. తర్లుపాడు రైల్వేస్టేషన్‌లోని సమస్యలన్నింటిని ఎంపీ మాగుంట దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

పౌష్టికాహారం అందజేత

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు26 : హెచ్‌ఐవీతో బాధపడుతున్న బాధితులకు ప్రతి నెలా లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తూ అండగా నిలుస్తున్నామని సొసైటీ గౌరవాధ్యక్షుడు డి. ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానిక పాత మార్కెట్‌లోని సొసైటీ కార్యాలయంలో సోమవారం పది మంది హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సొసైటీ ద్వారా ఇంకా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ జోసఫ్ శామ్యూల్, కార్యదర్శి సీహెచ్‌వీ రాఘవ, అధ్యక్షుడు సీహెచ్ శీనబాబు తదితరులు ఉన్నారు.

వీఆర్‌కు ముగ్గురు కానిస్టేబుళ్లు

చీమకుర్తి,ఆగస్టు 26 : చీమకుర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు రిపోర్ట్ చేయాలని ఎస్పీ దామోదర్ సోమవారం ఆదేశాలు జారీచేశారు.హెడ్ కానిస్టేబుల్ వెంగళరెడ్డి,కానిస్టేబుళ్లు కొండలు, నారాయణరెడ్డిలను అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ కింద తక్షణమే హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీస్‌స్టేషను నుంచి ఒకేసారి ముగ్గురు సిబ్బందిని వీఆర్‌కు పిలవటంపై పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ వ్యతిరేక వ్యవహారశైలితో ఒకరిని,ఐడీపార్టీ కానిస్టేబుళ్లుగా ఉండే విషయంలో పోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే విషయంలో మరో ఇద్దరిపై ఇంటిలిజెన్స్,స్పెషల్ బ్రాంచ్ నివేదికల ఆధారంగా వీఆర్‌కు పిలిపించినట్లు సమాచారం.ఈ విషయంపై సీఐ సుబ్బారావును వివరణ అడగ్గా పోలీస్‌శాఖ అంతర్గత విచారణ నిమిత్తం ముగ్గురు సిబ్బందిని డీపీవోలో రిపోర్ట్ చేయమన్నారని వివరించారు.



నగదు అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు కడవా రామకృష్ణ

పేద విద్యార్థికి రోటరీక్లబ్ చేయూత

చీమకుర్తి,ఆగస్టు 26 :పేద విద్యార్థి ఉన్నతవిద్యాభ్యాసానికి రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి చేయూతనందించింది. పట్టణలోని చైతన్య భారతి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతన్న విద్యార్థి రాయికింది చరణ్ ఫస్ట్ ఇయర్ ఫీజు పదివేల రూపాయలను రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షుడు కడవా రామకృష్ణ సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సెక్రెటరీ కందుకూరి సుధాకరబాబు,అంబటి వీరారెడ్డి,ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్. సత్యం తదితరులు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్టు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 26 : మండల పరిధిలోని కఠారివారిపాలెంలో పేకాట శిబిరంపై వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి సోమవారం నిర్వహించిన దాడులలో 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నూతన ఎస్సైకు టీడీపీ నేతల సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న కామని నాగశ్రీను, శ్రీధర్

టంగుటూరు, ఆగస్టు 26 : టంగుటూరు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వి.నాగమల్లీశ్వరరావును సోమవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, నాయకుడు కసుకుర్తి శ్రీధర్‌బాబు కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుశ్శాలువా కప్పి సత్కరించారు.


ఆరుగురు జూదరుల అరెస్టు

పొందూరు (టంగుటూరు) ఆగస్టు 26 : మండలంలోని పొందూరులో ఒక ఇంటిలో నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.11,138 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు

మొక్కులు చెల్లించుకున్న భక్తులు

ఆకట్టుకున్న అమ్మవారి పూలబండ్లు


అలంకరణలో పోలేరమ్మ

సింగరాయకొండ, ఆగస్టు 26 : పంచాయతీ పరిధి గోపాల్‌నగర్‌లోని పోలేరమ్మ కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. చివరిరోజైన సోమవారం దేవస్థానంలో అమ్మవారి మూలవిరాట్‌ను రకరకాల పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి పూలబండ్లు కట్టి అమ్మవారిని అందులో ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పోలేరమ్మను దర్శించుకున్నారు.

20 నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

అసోసియేషన్ చైర్మన్ గరటయ్య


మాట్లాడుతున్న డాక్టర్ గరటయ్య

పంగులూరు, ఆగస్టు 26 : పంగులూరులో సెప్టెంబర్ 20, 21, 22 తేదీలలో 34వ రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య ప్రకటించారు. సోమవారం పంగులూరు ఎంఎస్‌ఆర్ అండ్ బీఎస్‌ఎం జూనియర్ కళాశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల బాలికల ఖోఖో జట్ల ఎంపిక జరిగింది. ఎంపిక అనంతరం కళాశాల క్రీడా ప్రాంగణంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ గరటయ్య మాట్లాడుతూ 14 సంవత్సరాల విభాగంలో జరిగే పోటీలో 13 జిల్లాల నుంచి బాల బాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఇక్కడ రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీల నిర్వహణకు దాతలు, పెద్దలు, గ్రామ ప్రజలు, క్రీడాధికారుల సహకారం అభినందనీయమన్నారు.సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, రోటరీ క్లబ్ క్యాంప్ కోఆర్డినేటర్ వీరరాఘవయ్య, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, భవనం కాశీ విశ్వనాథరెడ్డి, పరిషత్ ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీ సుబ్బారావు, కరణం హనుమంతరావు, జాగర్లమూడి సుబ్బారావు, బాచిన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా జట్టు

పంగులూరు, ఆగస్టు 26 : రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలబాలికల ఖోఖో పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక సోమవారం పంగులూరులో జరిగింది. సెప్టెంబరు 20 నుంచి 22 వరకు పంగులూరు ఎంఎస్‌ఆర్ అండ్ బీఎస్‌ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఈ జట్లు పాల్గొంటాయి. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 100 మంది బాలురు, 50 మంది బాలికలు పాల్గొన్నారు. వీరిలో 25 మంది బాలురును, 25 మంది బాలికలను క్రీడా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలురకు ఈ నెల 27 నుంచి పంగులూరు జూనియర్ కళాశాల ప్రాంగణంలో, బాలికలకు జిల్లాలోని కంచర్ల వారిపల్లె ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, పీడీలు కె.హనుమంతరావు, డి.రమాదేవి, జె. శ్రీనివాసులు, ఎం.సౌజన్య, కె.ప్రసాద్, పీఈటీలు వసంత రఘుబాబు, సావిత్రమ్మ, వీరాంజనేయులు, అజయ్ పాల్గొన్నారు. బాలురకు జె.పాల్, డి.లక్ష్మీనారాయణ, బాలికల జట్టుకు కాశీవిశ్వనాథరెడ్డి, పి.శ్రీనివాసరావు శిక్షణ ఇస్తారని తెలిపారు.

రెండో శతాబ్దం నాటి బ్రహ్మీలిపి శాసనం గుర్తింపు


రెండో శతాబ్ధం నాటి శాసనం

త్రిపురాంతకం, ఆగస్టు 26: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద రెండో శతాబ్దానికి చెందిన బ్రహ్మీలిపితో ఉన్న శాసనాన్ని చారిత్రక పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ గుర్తించారు. దక్షిణ రాజగోపుర నిర్మాణానికి గతంలో తవ్వకాలు జరుపుతుండగా బయల్పడిన స్థంభాన్ని ఆయన పరిశీలించారు. దీనిపై ఉన్న లిపి, చిత్రాలను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారికి పంపగా వారు నిర్ధారించారు. శాసనం రెండో శతాబ్దానికి చెందినదిగా దీనిపై బహ్మీలిపి ఉన్నట్లు వారు తెలిపారు. సేతిస అనే గృహస్తుడు ఆరు ముఖాల ఆయక స్థంభం ఆలయానికి బహుమతిగా ఇచ్చినట్లు శాసనంలో ఉన్నట్లు నిర్ధారించారు. ఈ శాసనంపై ఉన్న చక్రం, ఇతర ఆకృతులను బట్టి ఇది బౌద్ధుల కాలం నాటిదని ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపినట్లు శ్రీనివాస ప్రసాద్ వివరించారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

పంట ఉత్పత్తిని నియంత్రించాలి

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

వేలం కేంద్రాల్లో కొనుగోళ్ల పరిశీలన

టంగుటూరు, ఆగస్టు 26 : రైతులు వచ్చే సీజన్‌లో అనుమతి మేరకే పొగాకును పండించాలని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచించారు. పంట నియంత్రణ పాటిస్తేనే గిట్టుబాటు ధరలు లభిస్తాయని చెప్పారు. ఆయన సోమవారం టంగుటూరు, కొండపి వేలం కేంద్రాలను సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. పంట పరిమాణాన్ని స్థిరీకరించాల్సిన అవసరాన్ని వివరించారు. గత, ప్రస్తుత సీజన్‌లో లభిస్తున్న ధరలను చూసి బ్యారన్లు, పొలాలు అధిక కౌళ్లు చెల్లించి తీసుకోవద్దన్నారు. ఎప్పటికప్పుడు బోర్డు అధికారుల సూచనలను పాటిస్తూ నాణ్యమైన పొగాకు పండించి లాభాలు పొందాలని కోరారు. పొగాకు రైతులంతా పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని బ్యారన్‌కు పది మొక్కలు నాటాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈసందర్భంగా వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు రైతులతో కలిసి చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. తొలుత వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎస్‌జీవో జి.సిద్ధరాజు, బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పి వరప్రసాదరావు, రైతు సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, బోర్డు సిబ్బంది, అన్ని కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

కొండపిలో..

కొండపి : పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన కొండపిలో వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. రెండేళ్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తి తగ్గినందున ఇక్కడ మంచి ధరలు లభించాయన్నారు. వచ్చే సీజన్‌లో వివిధ దేశాల్లో ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో అధిక ధరలకు పొలాలు, బ్యారన్లు కౌళ్లకు తీసుకుని నష్టపోవద్దని సూచించారు. సమావేశంలో పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, బొడ్డపాటి బ్రహ్మయ్య, రైతులు, బయ్యర్లు, వేలంకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


సింగరాయకొండలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు


కొండపిలో గోవును పూజిస్తున్న భక్తులు

సింగరాయకొండ, ఆగస్టు 26 : సింగరాయకొండ పంచాయతీ పరిధి కందుకూరురోడ్డు సెంటర్‌లోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించారు. విశేష పూజలు, పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. రాత్రికి స్వామివారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దాసరి యానాదిరావు పాల్గొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్, సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఆవులవారిపాలెంలోని గీతామందిరాల్లోనూ వేడుకలు జరిగాయి. మండలంలోని పాతసింగరాయకొండ, బింగినపల్లి, శానంపూడి, కనుమళ్ల గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా ఉట్టికొట్టారు.

కొండపిలో..

కొండపి : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక కామేపల్లి రోడ్డులోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉన్న కృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గోవులకు సాత్విక ఆహారం అందించారు.

బిట్రగుంటలో..

టంగుటూరు : జరుగుమల్లి మండలం బిట్రగుంటలో సోమవారం జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో టంగుటూరు టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. వీరిలో మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

రెండునెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి

దర్శి, ఆగస్టు 26 : ఈత సరదా యువకుల ప్రాణాలను హరిస్తుంది. దర్శి మండలంలో రెండు నెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి చెందారు. ఉజ్వల భవిష్యత్తుతో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఆశించిన తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. ఆ కుటుంబాలు శోక సముద్రంలో మునిగిపోతున్నాయి. మూడు రోజుల క్రితం కొత్తపల్లి, లక్ష్మీనారాయణపురం, కొర్లమడుగు గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సాగర్ కాల్వలో పడి మృతిచెందారు. తొలిరోజు ఒక మృతదేహం లభించగా, మరుసటి రోజు మిగిలిన రెండు మృతదేహాలను గాలించి వెలికితీశారు. ఈదుర్ఘటనతో ఆమూడు కుటుంబాలు శోకసముద్రంలో మునిగి పోగా, మూడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంతకుముందు జూన్ 13న దర్శి మండలం లూదగిరి కాలనీకి చెందిన బోడే నవీన్, కొనకనమిట్ల మండలం వాగుమడుగుకు చెందిన వి.చందులు శివరాజ్ నగర్ వద్దగల ఎన్‌ఏపీ చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం విదితమే. నవీన్ పుట్టినరోజు సందర్భంగా స్నేహితులను విందుకు పిలిచి తనతోపాటు చదువుకుంటున్న చందును కూడా ఆహ్వానించారు. భోజనాలు పూర్తయిన తరువాత వీరిద్దరూ ఎన్‌ఏపీ చెరువు వద్దకు వెళ్లి ఈతకు దిగి విగతజీవులయ్యారు. ఆ తరువాత జూన్ 30న తూర్పువీరాయపాలెం వాగులో ఏర్పాటు చేసిన కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన దర్శాశి వీరమణికంఠ, అద్దంకి మండలం వేలమూరిపాడుకు చెందిన పులి రామవేంద్ర అక్కాచెల్లెళ్ల కుమారులు. తూర్పువీరాయపాలెంలో జరిగిన ఆంజనేయస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఉదయం బహిర్భూమికి వెళ్లి వాగులో నీటినిల్వ కోసం తీసిన కుంటలో పడి మృతి చెందారు. రెండు నెలల కాలంలో మూడు దుర్ఘటనలో ఏడుగురు విద్యార్థులు నీటిలో మునిగి విగతజీవులయ్యారు. ఆ కుటుంబాల్లో విషాదఛాయలు ఇప్పటికీ ఆరిపోలేదు. మూడురోజుల కిత్రం సాగర్ కాల్వలో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందటం ఆమూడు గ్రామాల్లో ప్రజల్ని కలిచి వేస్తుంది. భవిష్యత్తులో చిన్నారులు ఇలాంటి దుర్ఘటనలకు బలికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసం ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు నీటి వద్ద వద్దకు వెళితే జరిగే ప్రమాదాలు తెలియపరిచి వారిని చైతన్యవంతుల్ని చేస్తే ప్రమాదాలను అరికట్టే వీలుంటుంది..


బాలుని మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు(ఫైల్)

కాపు కాసి.. కారును అడ్డుకొని

ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మార్టూరు, ఆగస్టు 26 : సినీ ఫక్కీలో ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్న కారును పోలీసులు పట్టుకున్నారు. సంఘటన సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మండల పరిధిలో ఒంగోలు వైపు రోడ్ బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. అనంతరం టోల్ ప్లాజా వద్దకు వచ్చిన తూర్పు గోదావరి జిల్లా నల్లచెర్ల స్టేషన్‌కు చెందిన పోలీసులు చేరుకొని ముగ్గురు యువకులతోపాటు కారును అదుపులోకి తీసుకొని గుంటూరు వైపు వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం గుంటూరు వైపు నుంచి ఎర్రకారు ఒంగోలు వైపు వస్తుందని, దానిని అడ్డుకోవాలని మార్టూరు హైవే మొబైల్ వాహనంలోని పోలీసులకు నల్లచెర్ల స్టేషన్ పోలీసుల నుంచి సమాచారం వచ్చినట్లు తెలిసింది. దాంతో అప్రమత్తమైన మొబైల్ పోలీసులు టోల్ ప్లాజా వద్దకు చేరి, గుంటూరు వైపు నుంచి వచ్చే ఎర్రకారు కోసం కాపు కాశారు. అంతేగాకుండా వారు టోల్ ప్లాజాకు అవతలవైపున ముందస్తు జాగ్రత్తగా జె.పంగులూరు మొబైల్ వాహన పోలీసులకు కూడా సమాచారం పంపించారు. దాంతో టోల్ ప్లాజా గేటు వద్ద కారు ఆగగానే పోలీసులు చుట్టుముట్టారు. కారు ముందు, వెనుక మొబైల్ వాహనాలను నిలిపివేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న సీఐ శేషగిరిరావు తన సిబ్బంది, హైవే మొబైల్ వారితో కలిసి కారును, కారులోని యువకులను తనిఖీ చేశారు. అదే సమయానికి నల్లచెర్ల పోలీసులు టోల్ ప్లాజా వద్దకు చేరుకొని ముగ్గురు యువకులతోపాటు కారును అదుపులోకి తీసుకొని వెళ్లిపోయారు.


కారులో ఉన్న ముగ్గురు యువకులు

డబ్బు ఇవ్వలేదని తల్లిపై కొడుకు గొడ్డలితో దాడి

- తీవ్రగాయాలతో వైద్యశాలకు తరలింపు
- రాజుపాలెంలో ఘటన
- నిందితుడి అరెస్టు


తీవ్ర గాయాలతో పడిపోయిన మరియమ్మ

త్రిపురాంతకం, ఆగస్టు 26: డబ్బు ఇవ్వలేదని కన్న తల్లిపై కుమారుడే గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని రాజుపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నార్నెపాటి ఇస్రాయేల్ గత ఎన్నికల ముందు అప్పటి మంత్రి సురేష్‌కు చెందిన కాన్వాయ్ తగిలిన ప్రమాదంలో మృతి చెందాడు. కాగా అప్పటి వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ లక్ష రూపాయలను ఇస్రాయెల్ కుటుంబానికి అందజేశారు. అనంతరం సుమారు నెల రోజుల క్రితం మరో లక్షన్నర రూపాయలను అందజేశాడు. ఆ సొమ్మును ఇస్రాయేల్ నాయనమ్మ మరియమ్మ పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ సొమ్మును ఇస్రాయేల్ సోదరికి వినియోగించాల్సిందిగా సూచించారు. అయితే ఇస్రాయేల్ తండ్రి త్రిపురయ్యకు రెండు పెళ్లిలు. మొదటి భార్య మృతిచెందగా, మొదటి భార్య కుమారుడు ఇస్రాయేల్ కూడా ఈ ప్రమాదంలో మృతి చెందాడు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే చంద్రశేఖర్ అందజేసిన రెండున్నర లక్షల రూపాయలను ఇస్రాయెల్ నాయనమ్మ మరియమ్మకు చెందిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశారు. అప్పటి నుండి నగదు కోసం త్రిపురయ్య తల్లిపై ఒత్తిడి తెస్తున్నాడు. త్రిపురయ్య డబ్బు ఇవ్వకపోవడంతో తల్లి మరియమ్మపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలతో రక్తపు మడుగులో ఉన్న మరియమ్మను బంధువులు ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. త్రిపురయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ ఉపకరణాలు

గిద్దలూరు, ఆగస్టు 26 : పండ్లతోటలు పెంచుకునే రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఉద్యానవన శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాలలో పొలం ఉన్న రైతులకు 90శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9703035081 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

పొలాల్లో సోలార్ ప్యానల్ వైరు చోరీ


ప్యానెళ్లను చూపిస్తున్న బాధిత రైతు

మార్టూరు, ఆగస్టు 26 : మండల పరిధిలో ఇసుకదర్శి గ్రామానికి చెందిన 8 మంది రైతులకు చెందిన పొలాల్లో సోలార్ ప్లేట్లకు చెందిన ప్యానల్ వైర్లను ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకు పోయారు. అంతేగాకుండా విద్యుత్ మోటా ర్లకు ఉన్న కేబుల్ వైరును కూడా కూడా కత్తిరించి తీసుకుపోయారు. దాంతో ఒక్కో రైతుకు 5 నుంచి 7వేల రూపాయలకు పైగా నష్టం జరిగినట్లు రైతులు చెప్తున్నారు. గతంలోనూ ఇలాగే పొలాల్లో చోరీ చేయగా, మరలా కొత్తగా వైర్లు బిగించుకున్నామని, మళ్లీ ఇప్పుడు దొంగతనం జరిగిందని రైతులు వాపోతున్నారు. ఒకే పొలంలో ఇది మూడోసారి అని కొంత మంది రైతులు తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కామేపల్లి సురేంద్ర, మారెళ్ల సుబ్బారావు, వెలగా సుబ్బయ్య, కాకర్ల రామాంజనేయులు, నల్లూరి సుబ్బయ్య తదితర రైతులకు విజ్ఞప్తి చేశారు.

డెంగ్యూతో మహిళ మృతి

వంకాయలపాడు(ఇంకొల్లు), ఆగస్టు 26 : వంకాయలపాడు గ్రామంలో మహిళ డెంగ్యూ జ్వరంతో సోమవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బేతపూడి మరియమ్మ(51) 10 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. తొలుత పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందగా డెంగ్యూగా నిర్ధారించారు. వెంటనే ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సరైన వైద్యం అందకపోవడంతో అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సుమారు రూ.5లక్షల వరకూ ఖర్చు చేసినా ఫలితం లేకపోగా సోమవారం మరియమ్మ మృతి చెందారు.

'వెలిగొండ పూర్తి చేయకుండానే జగన్ మోసం'



మాట్లాడుతున్న లంకా దినకర్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 26: పశ్చిమ ప్రకాశానికి వరప్రదాయిని అయిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే బూటకపు మాటలతో జాతికి అంకితం చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు ప్రచారంతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వైసీపీ ఇటీవల ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిందన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే వైసీపీ ఖాతాలో వేసుకునేందుకు జాతీయ అంకితం చేయటం విడ్డూరం అన్నారు. వైసీపీ హయాంలో జరగని పనులను ఎన్డీఏ కూటమి చేసి నిరూపిస్తుందన్నారు. మార్కాపురం జిల్లా చేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబుకు జిల్లా ఏర్పాటు చేసేందుకు వివరిస్తామన్నారు. మార్కాపురంలోని మెడికల్ కాలేజీ పూర్తి చేసే విధంగా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పూర్తయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. కరువుతో అల్లాడుతున్న ఈ ప్రాంత వాసులు వలసలు వెళ్తున్నారని, ఇటువంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఈ ప్రాంతానికే అందరు వలస వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, శిరసనగండ్ల శ్రీనివాసులు, ఏలూరు రామచంద్రారెడ్డి, శాసనాల సరోజిని, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

- యువత, చిన్నారుల ఆధ్వర్యంలో ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమాలు
- గిద్దలూరులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు



తర్లుపాడులో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తర్లుపాడు, ఆగస్టు 26: తర్లుపాడులో వెలసిన శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కారంపూడి రమణాచార్యులు, సాయిమోహన్‌లు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. బిందెతీర్థం, పంచామృతాభిషేకాలు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. పిన్నిక అశోక్ ఉట్టికొట్టాడు. యువకులు మహిళలు రంగులు చల్లుతూ ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లు పోసి కాయకర్పూరాలు సమర్పించారు. ఉభయదాతలు పెసల జనార్ధన్‌రావు, ధర్మపత్ని గీతాకుమారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్‌రావు, కశ్శెట్టి జగన్, మల్లికార్జునరావు, కాళంగి శ్రీనివాసులు, జవ్వాజి వెంకటేశ్వర్లు, కోలగట్ల నారా యణరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, పుల్లయ్య, గోసు వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

కంభం : మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంభం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, కంభం పట్టణంలోని పట్టాభి రామస్వామి దేవాలయంలో, పెద్దనల్లకాల్వ, తురిమెళ్ల గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించి కోలాటం, ఉట్టికొట్టడం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గిద్దలూరు టౌన్ : కృష్ణాష్టమి వేడుకలు సోమవారం గిద్దలూరు ప్రాంతంలో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రాచర్ల గేటు కూడలిలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో తెల్లవారుజాము నుంచి సుప్రభాతసేవ, ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం, లడ్డూ వేలంపాట నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు ఓ.వెంకటయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, హసనాపురం వెంకటేశ్వర్లు, కడియం శేషగిరి, నంద్యాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



కంభంలో కోలాటం ఆడుతున్న బాలికలు

కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

గిద్దలూరు : ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. 26వ తేదీ సోమవారం నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు పట్టణంలోని విశ్వభారతి హైస్కూలు ఆవరణలో త్రైతసిద్ధాంత కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రబోధ సేవాసమితి అధ్యక్షులు రమేష్ తెలిపారు.

మార్కాపురం వన్‌టౌన్: కృష్ణాష్టమి వేడుకలను మార్కాపురం పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఆలయాలలో భక్తులు పూజలు చేశారు. గాంధీబజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి పురస్కరించుకుని విద్యార్థులు కృష్ణుని విగ్రహానికి పూజలు చేశారు. గోపిక, కృష్ణుల వేషధారణలతో సాంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టారు.





వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అశోక్‌రెడ్డి, మార్కాపురంలో చిన్నారుల సందడి,

రెండో శతాబ్దం నాటి బ్రహ్మీలిపి శాసనం గుర్తింపు



రెండో శతాబ్దం నాటి శాసనం

త్రిపురాంతకం, ఆగస్టు 26: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద రెండో శతాబ్దానికి చెందిన బ్రహ్మీలిపితో ఉన్న శాసనాన్ని చారిత్రక పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ గుర్తించారు. దక్షిణ రాజగోపుర నిర్మాణానికి గతంలో తవ్వకాలు జరుపుతుండగా బయల్పడిన స్థంబాన్ని ఆయన పరిశీలించారు. దీనిపై ఉన్న లిపి, చిత్రాలను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారికి పంపగా వారు నిర్ధారించారు. శాసనం రెండో శతాబ్దానికి చెందినదిగా దీనిపై బహ్మీలిపి ఉన్నట్లు వారు తెలిపారు. సేతిన అనే గృహస్థుడు ఆరు ముఖాల ఆయక స్థంభం ఆలయానికి బహుమతిగా ఇచ్చినట్లు శాసనంలో ఉన్నట్లు నిర్ధారించారు. ఈ శాసనంపై ఉన్న చక్రం, ఇతర ఆకృతలను బట్టి ఇది బౌద్ధుల కాలం నాటిదని ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపినట్లు శ్రీనివాస ప్రసాద్ వివరించారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం, ఆగస్టు 26: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అందరూ సహకరించాలని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి అందరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా గంజాయి, మట్కా తదితరాల సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్య పరిష్కారానికి అందరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, ట్రైనీ ఎస్సై రాజమోహనరావు, అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన వాహనాలు నడిపితే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల, ఆగస్టు 26: ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను ఇష్టారీతిన నడిపితే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై వీ మహేష్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆటోలు, కార్ల డ్రైవర్లకు ఆయన సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానకూడలిలో ఆటోలు, కార్లు ఎక్కడ పడితే అక్కడ నిలపడం, ఆర్‌టీసీ బస్టాం డు వద్ద బస్సులకు అడ్డంగా నిలిపి కేకలు వేయడం, యూనిఫాం, లైసెన్సులు లేకుండా ఆటోలు నడిపి ప్రజలకు, వాహనాల రాకపోకలకు అవరోధం కలిగించడం వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రైటర్ మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు ఇవ్వలేదని తల్లిపై కొడుకు గొడ్డలితో దాడి

- తీవ్రగాయాలతో వైద్యశాలకు తరలింపు
- రాజుపాలెంలో ఘటన
- నిందితుడి అరెస్టు



తీవ్ర గాయాలతో పడిపోయిన మరియమ్మ

త్రిపురాంతకం, ఆగస్టు 26: డబ్బు ఇవ్వలేదని కన్న తల్లిపై కుమారుడే గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని రాజుపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన నార్నెపాటి ఇస్రాయేల్ గత ఎన్నికల ముందు అప్పటి మంత్రి సురేష్‌కు చెందిన కాన్వాయ్ తగిలిన ప్రమాదంలో మృతి చెందాడు. కాగా అప్పటి వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ లక్ష రూపాయలను ఇస్రాయేల్ కుటుంబానికి అందజేశారు. అనంతరం సుమారు నెల రోజుల క్రితం మరో లక్షన్నర రూపాయలను అందజేశాడు. ఆ సొమ్మును ఇస్రాయేల్ నాయనమ్మ మరియమ్మ పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ సొమ్మును ఇస్రాయేల్ సోదిరికి వినియోగించాల్సిందిగా సూచించారు. అయితే ఇస్రాయేల్ తండ్రి త్రిపురయ్యకు రెండు పెళ్లిలు. మొదటి భార్య మృతిచెందగా, మొదటి భార్య కుమారుడు ఇస్రాయేల్ కూడా ఈ ప్రమాదంలో మృతిచెందాడు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే చంద్రశేఖర్ అందజేసిన రెండున్నర లక్షల రూపాయలను ఇస్రాయెల్ నాయనమ్మ మరియమ్మకు చెందిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశారు. అప్పటి నుండి నగదు కోసం త్రిపురయ్య తల్లిపై ఒత్తిడి తెస్తున్నాడు. త్రిపురయ్య డబ్బు ఇవ్వకపోవడంతో తల్లి మరియమ్మపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలతో రక్తపు మడుగులో ఉన్న మరియమ్మను బంధువులు ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. త్రిపురయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో ఎంపీ బృందం సమస్యల గుర్తింపు



సమస్యలు తెలుసుకుంటున్న మాగుంట బృందం

తర్లుపాడు, ఆగస్టు 26: తర్లుపాడు రైల్వే స్టేషన్‌లోని సమస్యలను ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బృందం సాగర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు పరిశీలించారు. ఎంపీ ఆదేశాల మేరకు తర్లుపాడులోని రైల్వేస్టేషన్‌లోని సమస్యలను గుర్తించేందుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు తర్లుపాడులో నెల కొన్న సమస్యలను వారికి వివరిం చారు. కరోనాకు ముందు తర్లు పాడులో కాచీగూడ-అమరావతి, డోన్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగేవన్నారు. ప్రస్తుతం ఆ రైళ్ల ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వారి దృష్టికి తీసుకొచ్చారు. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలో ఉన్న గేటుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. తర్లుపాడు రైల్వేస్టేషన్‌లోని సమస్యలన్నింటిని ఎంపీ మాగుంట దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. సమస్యలు వివరించిన వారిలో నెహ్రూ యూత్ అధ్యక్షులు బి.పుల్లయ్య, శ్రీధర్, సుమంత్, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు తుమ్మలచెరువుకు మంత్రుల రాక

మండలంలోని తుమ్మలచెరువులోని దర్గాలో పూజలు నిర్వహించేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బి.ఎన్.విజయ్‌కుమార్, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీకుమారి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబులు రానున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు వీరంతా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరోసారి దర్గాకు వచ్చి పూజలు నిర్వహిస్తామని మొక్కుకున్నారు. అందులో భాగంగా వీరు తుమ్మలచెరువుకు రానున్నారు.

వెలిగొండ పూర్తి చేయకుండానే జగన్ మోసం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్



మాట్లాడుతున్న లంకాదినకర్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 26: పశ్చిమ ప్రకాశానికి వరప్రదాయిని అయిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే బూటకపు మాటలతో జాతికి అంకితం చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు ప్రచారంతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వైసీపీ ఇటీవల ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిందన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే వైసీపీ ఖాతాలో వేసుకునేందుకు జాతీయ అంకితం చేయటం విడ్డూరం అన్నారు. వైసీపీ హయాంలో జరగని పనులను ఎన్డీఏ కూటమి చేసి నిరూపిస్తుంద న్నారు. మార్కాపురం జిల్లా చేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబుకు జిల్లా ఏర్పాటు చేసేందుకు వివరిస్తామన్నారు. మార్కాపురంలోని మెడికల్ కాలేజీ పూర్తి చేసే విధంగా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. కరువుతో అల్లాడుతున్న ఈ ప్రాంత వాసులు వలసలు వెళ్తున్నారని, ఇటువంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఈ ప్రాంతానికే అందరు వలస వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, శిరసనగండ్ల శ్రీనివాసులు, ఏలూరు రామచంద్రారెడ్డి, శాసనాల సరోజిని, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలను తలపిస్తున్న అంతర్గత వీధులు



శివాలయం వీధిలో సిమెంటురోడ్డు మీద నిలిచిన వర్షపునీరు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 26 : ఎర్రగొండపాలెం మేజరు పంచాయతీలలో పలు వీధుల వెంబడి వర్షం కురిస్తే రోజులు తరబడి నీళ్లు నిల్వ ఉంటున్నాయి. ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో నివాస గృహల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేజరు పంచాయతీ అయినప్పటికి పారిశుద్య లోపం వెంటాడుతోంది. పంచాయతీలోని ఎక్కువ శాతం వార్డులలో సైడుకాల్వల నిర్మించకపోవడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలుస్తోంది. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లపై వర్షంనీటికి, ఇళ్లలోని వాడిక నీరు తోడై పట్టణం దోమలకు ఆవాస కేంద్రంగా మారుతోంది.

- ఎర్రగొండపాలెంలోని రామాలయం వీధి నుంచి అంబేద్కర్ కూడలి వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా లక్షలు ఖర్చు చేసి సైడు కాల్వలు నిర్మించారు. అయినా, లెవల్ లేకపోవడంతో నీరు సక్రమంగా పారడం లేదు. దీనికి తోడు కాలువలపై బడ్డి బంకులు ఏర్పాటు చేయడంతో ఆ వ్యర్థాలతో కాలువలు నిండుతున్నాయి. దీంతో కాలువల్లో పారుదల లేక మురుగు నీరు నిలిచి ఉంటోంది.
- కొలుకుల వెళ్లే రహదారిలో ఇరువైపుల రూ.10 లక్షలతో సైడు కాల్వలు నిర్మించారు. లెవెల్ లేక ఆ కాల్వల్లో మురుగు ముందుకు సాగడం లేదు. రోడ్లు నిర్మాణం, సైడు కాల్వలు నిర్మించే కాంట్రాక్టర్లు అవి ప్రజలకు ఉపయోగపడిన పడకపోయినా, తమ పనికి బిల్లులు వస్తే చాలు అన్నట్లు పనులు ముగించారు. పంచాయతి రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఇంజనీర్లు కూడా వాటాలు తీసుకొని బిల్లులు చేశారు. దీంతో నిధులు వెచ్చించినా సార్థకత లేకుండా పోయింది. జాతీయ రహదారికి ఇరువైపుల 2021లో ఎక్సకవేటర్‌తో కాల్వలు శుభ్రం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాల్వల పూడిక తీయలేదు. దీంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. దోమలు పెరిగి పోయి పిల్లలు పెద్దలు వ్యాధుల బారిన పడుతున్నారు. నెలరోజులుగా మలేరియా, డెంగ్యూ జ్వరాలు పెరిగిపోయి, వైద్యశాలలు చుట్టూ తిరిగిచికిత్సలు పొందుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే డేవిడ్‌రాజు మృతి తీరని లోటు

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు



డేవిడ్‌రాజు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 26 : ఎర్రగొండపాలెం మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు మృతి జిల్లా ప్రజలకు తీరనిలోటని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. సోమవారం ఒంగోలు క్లౌపేట లోని డేవిడ్‌రాజ్ నివాసం లో ఆయన పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. సామాన్య కార్యకర్త నుంచి టీడీపీలో అనేక పదవులు నిర్వహించారని, ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, సంతనూతలపాడు , ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా పదవులు నిర్వహించారన్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ మాబుసాహెబ్, పెద్దారవీడు మండల టీడీపీ మాజీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ రైతు టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి ఉన్నారు.

ఎన్‌టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో

మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు మృతిపట్ల ఎర్రగొండపాలెంలో సోమవారం గాంధీ విగ్రహం ఎదుట డేవిడ్‌రాజు చిత్రం పటం ఉంచి పూలమాలలు వేసి ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షులు చీదెళ్ల నాగేశ్వరరావు, సభ్యులు మాజీ ఎంపీటీసీ ఎం అచ్యుతరావు, డి.బాదరయ్య గౌడ్, సంజీవరెడ్డి, బిజయ్య నాయక్, హనుమంతారావు, ప్రతాప్‌రెడ్డి, సభ్యులు పాల్గొని నివాళులు తెలిపారు.



డేవిడ్‌రాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

అవీ..ఇవీ..

రూ.10వేలు పలికిన కృష్ణాష్టమి లడ్డూ



లడ్డూను సొంతం చేసుకున్న బోనేని వెంకటేశ్వర్లు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 26 : కృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో లడ్డూ వేలంపాట నిర్వహించారు. కొమరోలు మండల టీడీపీ అధ్యక్షులు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోనేని వెంకటేశ్వర్లుయాదవ్ వేలం పాటలో రూ.10వేలకు పాడి లడ్డూను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు ఓ.వెంకటయ్య, నంద్యాల శ్రీనివాసులు, విజయరామరాజు పాల్గొన్నారు.

యోగా గురువు నారాయణరెడ్డికి అవార్డు



అవార్డు అందుకుంటున్న నారాయణరెడ్డి

గిద్దలూరు, ఆగస్టు 26 : ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బీ.ఎస్. నారాయణరెడ్డికి నందమూరి తారక రామారావు నేషనల్ అవార్డు లభించింది. విజయవాడలోని మదర్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ 2వ వార్షికోత్సవం సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు కళాకేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో నారాయణరెడ్డికి నందమూరి తారక రామారావు నేషనల్ అవార్డుతో సన్మానించారు. అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, వివాహాది శుభ కార్యాలలో మిగులు భోజనం అభాగ్యులకు అందించడం, దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న నారాయణరెడ్డిని నిర్వాహకులు అభినందించి సన్మానించారు.

రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ ఉపకరణాలు

గిద్దలూరు, ఆగస్టు 26 : పండ్లతోటలు పెంచుకునే రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఉద్యానవన శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాలలో పొలం ఉన్న రైతులకు 90శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9703035081 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు చేయాలి

- ఆ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎస్ దయాకర్‌రెడ్డి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 26 : జిల్లాలో బీజేపీ సభ్యత్వాలు అత్యధికంగా నమోదు చేయించాలని, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి, జోనల్ ఇన్‌చార్జ్ ఎస్ దయాకర్‌రెడ్డి కోరారు. ఎర్రగొండపాలెంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రజల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకరన్, జిల్లా అధ్యక్షులు పీవీ.శివారెడి కార్యవర్గ సభ్యులు ఎస్ శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జ్ పి.రవిశంకర్, జాతీయ సభ్యురాలు ఎస్ సరోజిని, వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ.నాగేశ్వరరావు, మండల కమిటి అధ్యక్షులు ఎం సూర్యనారాయణ పాల్గొన్నారు..

ఏబీఎం ఆస్తులను కాపాడాలి

- ఎమ్మెల్యేకు బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ నాయకులు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీఎఫ్ఏ ప్రతినిధులు

మార్కాపురం, ఆగస్టు 26: అక్రమ నిర్మాణాలను తొలగించి ఏబీఎం ఆస్తులను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి సోమవారం మార్కాపురం బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అమెరికన్ బాప్టిస్టు మిషన్ ద్వారా స్వాతంత్ర్యానికి పూర్వమే పాఠశాల విద్యనిమిత్తం ఎంబీఎఫ్ఏకు 39.99 ఎకరాల భూమిని అగ్రిమెంటు ద్వారా అప్పగించినట్లు ప్రెసిడెంట్ జె.దేవదానం తెలిపారు. కానీ ఎంబీఎఫ్ఏకు చెందిన కొందరు స్వార్థపరులు పట్టణానికి చెందిన వ్యాపారవేత్తకు అక్రమంగా ఆ భూములను విక్రయించారన్నారు. ఆ వ్యాపారవేత్త అక్రమంగా క్రయ విక్రయాలు చేశాడన్నారు. చివరికి పాఠశాలను కూడా కబ్జా చేసేందుకు చూస్తున్నారన్నారు. ఈ విషయమై హైకోర్టుకు వెళ్లగా అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. కానీ స్థానిక మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ విషయంలో చొరవ తీసుకుని అక్రమాల కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంబీఎఫ్ఏ ప్రతినిధులు ఉన్నారు.

కులాల అంతరాలను తొలగించేందుకు కలిసి పనిచేయాలి

- సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

మార్కాపురం, ఆగస్టు 26: సమాజంలో కులాల మధ్య అంతరాలను తొలగించేందుకు అందరూ కలిసి పనిచేయాలని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక బృందావన్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం సాయంత్రం వివిధ కులాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చేసే వృత్తినిబట్టి ఏర్పడిన కులాలను అందరూ గౌరవించాలన్నారు. ఇంటివరకే కులం గురించి మాట్లాడుకోవాలన్నారు. సమాజంలో అందరూ సమానమనే భావన ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు పరిణామా లను వివరించారు. కార్యక్రమంలో వేదిక నెల్లూరు విభాగ్ ప్రముఖ్ వేముల సుబ్బారావు, పలు కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

గోమాత పూజ



గో పూజలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 26 : స్థానిక మార్కెట్ యార్డులోని గోవులను కృష్ణాష్టమి సందర్భంగా బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ సీఐ కె.సురేష్ పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి


వ్యాపార వర్గాలతో మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు, ఆగస్టు 26: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలకు సహకరించాలని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పట్టణ వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాల్లో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. దుకాణాలకు సంబంధించిన బోర్డులను రోడ్లపై ఉంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్లపై ఉన్న ఆక్రమణలు తొలగించుకోవాలని సూచించారు. అనంతరం పలువురు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, టీడీపీ మైనార్టీ నాయకులు, కారు స్టాండ్ డ్రైవర్లు సీఐ నాయక్‌ను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2 లక్షల 82 వేలు

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 26: మండలంలోని విట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.2 లక్షల 82 వేలు వచ్చిందని ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,15,490, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,540, అన్నదానం విరాళాల ద్వారా రూ.56,506 వచ్చినట్లు తెలిపారు. మహాప్రాకారపు నిర్మానానికి పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామానికి చెందిన పొందుగుల బ్రహ్మారెడ్డి, నారాయణమ్మ దంపతులు రూ.25,116 విరాళం అందజేసినట్టు తెలిపారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

పామూరు, ఆగస్టు 26: ఇంజనీరింగ్ విద్య అభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పి.రమ్యకృష్ణ అనే విద్యార్థినికి మానవత సంస్థ తరుపున రూ.5 వేలు, దాతల సహకారంతో రూ.21 వేలు స్థానిక దివ్యజ్ఞాన సమాజం మందిరంలో సోమవారం సంస్థ అధ్యక్షుడు మెడబలిమి ముసలయ్య అందజేశారు. పీసీపల్లి మండలం పిల్లివారిపల్లె గ్రామానికి చెందిన రమ్యకృష్ణ ఉన్నత విద్యకోసం మానవత సంస్థ ఆర్థికసాయం చేసింది. కార్యక్రమంలో సోమిశెట్టి శ్రీనివాసులు, నేరేళ్ల బాబురావు, టి.రమేష్, పి.తిరుపతిరెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, పి.శివ, ముక్కు తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో సామరస్య వాతావరణం నెలకొల్పాలి


సీఐ ఖాజావలిని సత్కరిస్తున్న యడవల్లి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేతలు

కనిగిరి ఆగస్టు 26: కనిగిరి సర్కిల్ పరిధిలో సామరస్య వాతావరణం నెలకొల్పేలా పోలీసుశాఖ సహకరించాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ ఖాజావలిని సోమవారం టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటంలో పూర్తి సహకారాన్ని అందించాలని సీఐ టీడీపీ నేతలను కోరారు. కనిగిరి ప్రాంతంలో భౌగోళిక అంశాలు, వాటి పరిస్థితులు, శాంతి భద్రతల విషయంపై సీఐ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత టీడీపీ నేతలు సీఐని సన్మానించారు. కార్యక్రమంలో బాలు ఓబుల్‌రెడ్డి, సైకం మాలకొండారెడ్డి, గుడిపాటి ఖాదర్, బొగ్గరపు సద్గురు, సిద్ధాంతి బారాయిమాం, కనిగిరి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ప్రమాద బీమా చెక్కు అందజేత


గురవమ్మకు బీమా చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

వెలిగండ్ల, ఆగస్టు 26: టీడీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఈర్ల గురవయ్య ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ సభ్యత్వం ఉండటంతో ఆ కుటుంబానికి రూ2 లక్షల ఆర్థిక సాయం రాగా, ఆచెక్కును మృతుడు గురవయ్య భార్య చెన్నమ్మకు సోమవారం పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, కర్నాటి భాస్కర్‌రెడ్డి, ఆవుల మాలకొండారెడ్డి, పెద్దిరెడ్డి, పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతంచేయాలి


మాట్లాడుతున్న నరాల శ్రీనివాసరెడ్డి

పామూరు, ఆగస్టు 26: ప్రధాని మోదీ చేతుల మీదుగా వచ్చేనెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి నరాల శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు జె.చిన సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వాల నమోదును సెల్ ద్వారా 8800002024 నెంబర్‌కు మిస్ కాల్ ఇచ్చి నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, కేవీ సుబ్బారావు, పాడే అరవింద్, బి.రాజేష్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో బంగారు నగలు మాయం

కనిగిరి ఆగస్టు 26: యూనియన్ బ్యాంకులో బంగారు నగలు మాయమయ్యాయని మేనేజర్ వెంకట్రావు సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జవహర్‌లాల్ వీధిలోని యూనియన్ (గతంలో ఆంధ్రాబ్యాంకు)లో 428 మంది ఖాతాదారులు బంగారు నగలు తాకట్టు పెట్టారు. ఈమధ్య ఓ ఖాతాదారుడు బ్యాంకులో తాకట్టు పెట్టుకున్న బంగారు నగలు బాకీ చెల్లించి వాటిని తీసుకున్నాడు. ఆ ఆభరణాల్లో బంగారుగాజు ఒకటి తగ్గింది. దీంతో ఖాతాదారుడు బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకు పోయాడు. దీంతో బ్యాంకు మేనేజర్‌కు అనుమానం వచ్చి పైస్థాయి మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకువెళ్ళాడు.

గత రెండు రోజులుగా ప్రత్యేక బృందం బ్యాంకులోని ఖాతాదారులు తాకట్టుపై ఉన్న బంగారు ఆభరణాలను పేర్లవారీగా పరిశీలించారు. వాటిలో 9 మంది ఖాతాదారులకు చెందిన (దాదాపు రూ15లక్షల విలువైన) బంగారు ఆభరణాలు మాయమైనట్లు ధ్రువీకరించారు. ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

- రెండు నెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు(ఫైల్)

దర్శి, ఆగస్టు 26: ఈత సరదా యువకుల ప్రాణాలను హరిస్తుంది. దర్శి మండలంలో రెండు నెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి చెందారు. ఉజ్వల భవిష్యత్తుతో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఆశించిన తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. ఆ కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోతున్నాయి. మూడు రోజుల క్రితం కొత్తపల్లి, లక్ష్మీనారాయణపురం, కొర్లమడుగు గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సాగర్ కాల్వలో పడి మృతిచెందారు. తొలి రోజు ఒక మృతదేహం లభించగా, మరుసటి రోజు మిగిలిన రెండు మృతదేహాలను గాలించి వెలికితీశారు. ఈదుర్ఘటనతో ఆమూడు కుటుంబాలు శోకసముద్రంలో మునిగి పోగా, మూడు గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

అంతకుముందు జూన్ 13న దర్శి మండలం లూధగిరి కాలనీకి చెందిన బోడే నవీన్, కొనకనమిట్ల మండలం వాగుమడుగుకు చెందిన వి.చందులు శివరాజ్ నగర్ వద్దగల ఎన్ఏపీ చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం విధితమే. నవీన్ పుట్టినరోజు సందర్భంగా స్నేహితులను విందుకు పిలిచి తనతోపాటు చదువుకుంటున్న చందును కూడా ఆహ్వానించారు. భోజనాలు పూర్తయిన తరువాత వీరిద్దరు ఎన్ఏపీ చెరువు వద్దకు వెళ్లి ఈతకు దిగి విగతజీవులయ్యారు. ఆతరువాత జూన్ 30న తూర్పువీరాయపాలెం వాగులో ఏర్పాటుచేసిన కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన ధర్నాశి వీరమణికంఠ, అద్దంకి మండలం వేలమూరిపాడుకు చెందిన పులి రాఘవేంద్ర అక్కాచెల్లెళ్ల కుమారులు. తూర్పువీరాయపాలెంలో జరిగిన ఆంజనేయస్వామి ఉత్సవాలల్లో పాల్గొనేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఉదయం బహిర్భూమికి వెళ్లి వాగులో నీటి నిల్వ కోసం తీసిన కుంటలో పడి మృతి చెందారు. రెండు నెలల కాలంలో మూడు దుర్ఘటనలో ఏడుగురు విద్యార్థులు నీటిలో మునిగి విగతజీవులయ్యారు. ఆకుటుంబాల్లో విషాద చాయలు ఇప్పటికీ ఆరిపోలేదు.

మూడురోజుల క్రితం సాగర్ కాల్వలో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందటం ఆమూడు గ్రామాల్లో ప్రజల్ని కలిచి వేస్తుంది. భవిష్యత్తులో చిన్నారులు ఇలాంటి దుర్ఘటనలకు బలికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు నీటి వద్ద వద్దకు వెళితే జరిగే ప్రమాదాలు తెలియపరిచి వారిని చైతన్యవంతుల్ని చేస్తే ప్రమాదాలను అరికట్టే వీలుంటుంది.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


దర్శిలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న నూకసాని బాలాజీ, పాపారావు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్


తాళ్లూరు: గుంటిగంగ సన్నిదిలో ప్రత్యేక అలంకరణలో కృష్ణస్వామి

దర్శి, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక గొర్లగడ్డ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బేళ్ల శ్రీనివాసరావు, దారం సుబ్బారావు, జూపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, ఆగస్టు 26: మండలంలోని పలుగ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గుంటిగంగ సన్నిదిలో కృష్ణాలయానికి భక్తులు అదిసంఖ్యలో తరలి వెళ్లారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కురిచేడులో.. కురిచేడు, ఆగస్టు 26: స్థానిక వాసవీ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ పీఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పది సంవత్సరాలలోపు పిల్లలను కృష్ణుని వేషధారణలో తయారుచేసి పోటీలు నిర్వహించారు. అనంతరం మహిళలచే కోలాట ప్రదర్శన ఏర్పాటుచేశారు. వినుకొండ రోడ్డులో సినిమా హాలు సమీపంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

దొనకొండలో.. దొనకొండ, ఆగస్టు 26: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి ఆశ్రమంలోని వీరప్పయ్య గోశాలలో వేంచేసిన శ్రీకృష్ణుడిని వివిధరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, శ్రీకృష్ణ నిత్యపూజలు, శ్రీకృష్ణ అష్టోత్తర, బాలకృష్ణ స్తోత్రం, సహస్రనామ పూజలు చేశారు. గోశాలలోని గోవులకు గోపూజ నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, ఆగస్టు 26: మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతీ జంగాలపల్లి గ్రామంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధల తో జరుపుకొన్నారు. స్వామి వార్ల శాంతి కల్యాణాన్ని వేద పండితులు విరపు కుమారస్వామి నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు భైరెడ్డి జయరామిరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దారపనేని, భైరెడ్డిలను దేవస్థాన నిర్వాహకులు చెనికల మాలకొండయ్య శాలువతో సన్మానించి శ్రీకృష్ణుని చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో వెంగయ్య, వెంగళరావు, నాగయ్య, మల్లికార్జున, బి.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఎం.గురవయ్య, నాగినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.


దొనకొండలోని ఆనంద ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు


కురిచేడులో జరిగిన కృష్ణాష్టమి వేడుకలు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు

- పారిశుధ్య సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు
- పూడికతీత పనుల చేపట్టిన అధికారులు


ఉప్పురోడ్డులో పూడికతీత పనులను చేపట్టిన మున్సిపల్ సిబ్బంది

కనిగిరి ఆగస్టు 26: కనిగిరి పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను మున్సిపల్ అధికారులు ఆదివారం రాత్రి తొలగించి పూడికతీత పనులకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి ఒంగోలు బస్టాండు నుంచి చెక్‌పోస్టు వరకు, ఒంగోలు బస్టాండు నుంచి ఉప్పురోడ్డు, పామూరు రోడ్డు వెంబడి ఉన్న ఫుట్‌పాత్‌లను ధ్వసం చేసి పూడికతీత పనులను చేపట్టారు. ఇటీవల చెప్పుల బజారు, పామూరు బస్టాండు నుంచి కొత్తూరు వరకు, చర్చి సెంటర్ నుంచి కందు కూరు రోడ్డు డిపోవరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగించారు. కనిగిరి డివిజన్ కేంద్రంగా రూపాంతరం చెందినప్పటికి ఇప్పటికీ గ్రామ స్థాయి అభివృద్ధే జరిగింది.

పట్టణంలో ఎక్కడ చూసినా ఆక్రమణలతో రోడ్డు కుంచించుకుపోవటంతో పాటు భారీ డ్రైనేజీపై ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించారు. దీంతో డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి పారిశుధ్య సమస్య వేధిస్తుంది. చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి మురుగుతో పాటు చెత్తాచెదారం వస్తుండటంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారానికి ఎ మ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శ్రీకారం చుట్టారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి అవసరమైన మున్సిపాల్టీ నిధులు వినియోగానికి అనుమతులు కల్పించారు. దీంతో దశా బ్దాలకాలంగా అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్య సమస్య పరిష్కారం కానుంది.

డేవిడ్‌రాజుకు నేతల నివాళి

- హైదరాబాద్ నుంచి ఒంగోలు చేరిన భౌతికకాయం
- మంత్రి స్వామి, ఎమ్మెల్యే బీఎన్, కరణం ఇతర ముఖ్యుల నివాళి


డేవిడ్‌రాజు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న కరణం, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, గరటయ్య తదితరులు

ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ రాజకీయ నేత , జడ్పీ మాజీచైర్మన్ పాలపర్తి డేవిడ్‌రాజుకు వివిధ వర్గాల ప్రజలు ఘనంగా నివాళులు అర్పించారు. గతరాత్రి హైదరాబాద్‌లో కన్నుమూసిన డేవిడ్‌రాజు భౌతికకాయాన్ని సోమవారం మధ్యాహ్నం 12 గటలకు ఒంగోలు తీసుకువచ్చారు. నగరంలోని క్లౌపేట రెండవలైన్‌లో ఉన్న డేవిడ్‌రాజు స్వగృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రాజకీయ, ఇతర రంగాల ప్రజలు, పలువురు ప్రముఖులు తరలివచ్చి నివాళులు అర్పించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి డేవిడ్‌రాజు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే డేవిడ్‌రాజు కుమారుడు విజేష్‌రాజు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, డాక్టర్ బాచిన గరటయ్యలతో పాటు ఈ దరహరిబాబు, నారపుశెట్టిపాపారావు, కసుకుర్తి అదెన్న, టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, ఒంగోలు మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఏఎంసీ మద్దిపాడు మాజీ చైర్మన్ మండవ రంగారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గతంలో డేవిడ్‌రాజు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సంతనూతలపాడు, వైపాలెం నియోజక వర్గాల నుంచి రాజకీయవర్గాలకు చెందిన అనేక మంది తరలివచ్చి నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తదితరులు ఫోన్‌లో డేవిడ్‌రాజు కుమారుడు విజేష్‌రాజును పరామర్శించారు. ఇదిలా ఉండగా డేవిడ్‌రాజు అంత్యక్రియలు మంగళవారం ఆయన స్వగ్రామమైన ఎన్‌జీపాడు మండలం మట్టిగుంటలో జరగనున్నాయి. ఆ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పాల్గొంటారని సమాచారం.

మాగుంట సంతాపం

ఒంగోలు(కలెక్టరేట్) : మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్‌మాజీ చైర్మన్ పాలపర్తి డేవిడ్‌రాజు మృతికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. డేవిడ్‌రాజు కాంగ్రెస్, తెలుగుదేశం,వైసీపీ పార్టీల తరుపున ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు అనేక పదవులు నిర్వహించి జిల్లా ప్రజలతో పాటు దళితుల అభ్యున్నతికోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన మృతితీరని లోటని, డేవిడ్‌రాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.


వైద్య సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న పీర్ల మస్తాన్‌వలి, ఇస్కాన్ శ్రీధర్, తదితరులు

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి!

కనిగిరి ఆగస్టు 26: మదర్ థెరిస్సా సేవలు మరువలేనివని ఇస్కాన్ దేవాలయాల డైరెక్టర్ గుత్తి శ్రీధర్ అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయటమే కాకుండా వారికి ఎన్నో సేవలు, సపర్యలు చేసిన మానవతామూర్తి మదర్ థెరిస్సా అని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్న నర్సులచే కేకును కట్‌చేయించారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు పీర్ల మస్తాన్‌వలి అందించిన సహకారంతో ఆసుపత్రిలోని వైద్యసిబ్బంది, నర్సులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ మదర్ సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు పసుపులేటి అరుణోదర్, రసూల్, విజయరాజు, చమిడిశెట్టి (బొట్టు) శ్రీను, ఆసుపత్రి సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం, చెరుకూరి చిన్న, వాగిచర్ల వెంకటేశ్వర్లు, గుడ్‌హెల్ప్ రమేష్, పాతకోట రవి, ఉప్పుటూరి గురుస్వామి, అబ్దుల్ సమాద్, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో.. దొనకొండ, ఆగస్టు 26: మదర్ థెరిస్సా సేవలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ప్రభు చారిటబుల్ డవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ ఆదిమూలపు ప్రభుదాస్ కోరారు. మదర్ థెరిస్సా జయంతిని సోమవారం ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లోని పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కె.ఐజక్‌డయాన్, ఎగ్గోని గురవయ్య, ఎగ్గోని రవికుమార్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు!


మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు, ఆగస్టు 26: మాదక ద్రవ్యాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని తాళ్లూరు, శివరాంపురం గ్రామాల్లో సోమవారం విజిబుల్ పోలిసింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వంటి వ్యసనాలకు పిల్లలు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. గ్రామాల్లో మాదకద్రవ్య విక్రయాలు జరుగుతుంటే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించినట్టు ఎస్సై మల్లికార్జునరావు చెప్పారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్ వాడాలన్నారు.

నేడు టీచర్లకు శిక్షణ

ఒంగోలు(విద్య), ఆగస్టు 26 : జిల్లాలోని ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు,స్పెషల్ టీచర్లు,భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లకు మంగళవారం ప్రశస్తయాప్ వినియోగంపై ఆన్‌లైన్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు, సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం, కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ద్వారా పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల్లో ప్రత్యేక అవసరాలు గల వారిని ప్రాథమికంగా గుర్తించేందుకు ప్రశస్త్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ ఓరియంటేషన్‌లో పాల్గొనేందుకు మండల విద్యాధికార్యాలయానికి లింకు పంపించినట్లు తెలిపారు.





సచివాలయాలు అస్తవ్యస్తం!

- గాడి తప్పిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ
- సమయ పాలన పాటించని ఉద్యోగులు
- అందరూ ఒక్కటై డుమ్మా కొడుతున్న వైనం
- ఉదయం 10.30లోపు సగం కూడా లేని హాజరు
- విధులు, బాధ్యతలు లేని విధానంతో ఇష్టారాజ్యం
- పర్యవేక్షణ లేని చోట్ల మరింత దారుణంగా పరిస్థితి
- తనిఖీల్లో షాకుకు గురవుతున్న ఎమ్మెల్యేలు, అధికారులు

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఇటీవల తన నియోజకవర్గం పరిధిలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో ఒకరిద్దరు తప్ప మిగిలిన ఉద్యోగులు ఎవరూ కనిపించలేదు. ఇలా ఒక సచివాలయం కాదు.. మూడు డివిజన్లలోని సచివాలయాల్లో అదే పరిస్థితి ఆమెకు ఎదురయింది. ఒక్కో డివిజన్ పరిధిలో 50 మంది ఉద్యోగులు వుంటారని, వారెవరూ తమకు అందుబాటులో వుండడం లేదని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన ఆమె వెంటనే ఉద్యోగులను పిలిపించి తీవ్ర హెచ్చరికలు చేశారు.

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని సచివాలయాలను పరిశీలించడానికి వెళ్లిన ఒక అధికారి షాక్‌కు గురయ్యారు. తనిఖీకి వెళ్లిన అధికారికి సచివాలయంలో ఉద్యోగులు ఎవరూ కనిపించలేదు. పైపెచ్చు ఆ సచివాలయంలో కుక్కలు పడుకుని వున్నాయి. దీంతో ఆగ్రహానికి గురైన సదరు అధికారి ఉద్యోగులను పిలిచి మందలించారు. - ఇవి ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒకటి రెండు ఘటనలు మాత్ర మే. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో ఇదే పరిస్థితి అన్ని చోట్లా కనిపిస్తోంది.

పల్నాడు జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా వుంది. ఆ జిల్లాలో మాచర్ల, వినుకొండ, గురజాల మండలా ల్లోని సచివాలయాల్లో ఉద్యోగులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతు న్నారు. ఆయా నియోజక వర్గాల్లో నమోదయ్యే ఉద్యోగుల హాజరులో ఉదయం పదిన్నరలోపు నమో దయ్యే హాజరు సగానికంటే తక్కువగా ఉంటోంది. బాపట్ల జిల్లాలో రేపల్లె నియో జకవర్గం లోని తీరప్రాంత గ్రామాల్లో, చీరాల డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఉద్యోగులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు.

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన నుంచి సచివాలయ వ్యవస్థపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. గ్రామ స్వరాజ్యాన్ని దెబ్బతీసే వ్యవస్థగా, చేతికి వుండే నిరర్థకమైన 'ఆరో వేలు'గా విమర్శలు ఎదుర్కొంటున్న ఆ వ్యవస్థ కాలం గడిచే కొద్దీ మరింత దిగజారిపోతూ వుంది. ప్రజలకు అందుబాటులో వుండాలని లక్షల మంది ఉద్యోగులను నియమించి ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో వుండడం లేదన్న విమర్శలను ఎదుర్కొంటోంది. సచివాలయాల్లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు సగం మంది కూడా సకాలంలో విధులకు హాజరు కాకపోవడం, ప్రజలకు అందుబాటులో వుండకపోవడమే అందుకు కారణంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బయటకు కనిపించని ఎన్నో అంశాలు, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. సచివాలయాల తనిఖీలకు వెళ్లిన స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు షాకుల మీద షాకులు తగులు తున్నాయి. ఉద్యోగులు హాజరు కావడం లేదని, తమకు అందుబాటులో వుండడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో అందుతున్నాయి.

ఒక అవగాహనతో వ్యవహారం

గ్రామ సచివాలయాల్లో మారు మూల ప్రాంతాల్లో వుండే సచివాలయాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. సచివాలయ బాధ్యతలు నిర్వర్తించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కొందరు తోటి ఉద్యోగులతో ఒక అవగాహనకు వచ్చి విధులకు డుమ్మా కొడుతున్నారు. తమ వద్ద నున్న డివైజుల ద్వారా హాజరు నమోదు చేసి ఆఫీసుకు రాకుండానే చెక్కేస్తున్నారు. అధికారులు ఎవరైనా వచ్చినప్పుడు ఫీల్డ్ విజిట్లో వున్నట్లు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎంపీడీవో, ఎండీవోలు తనిఖీలు చేయడానికి వీలుగా లేని సచివాలయాల్లో పరిస్థితి ఆందోళనకర స్థాయిలో వుంది. కాగా వార్డు సచివాలయాల్లో పరిస్థితి మరింత దారుణంగా వుంది. నగరాలు, పట్టణాల్లో వున్నా అక్కడ విధులకు డుమ్మా కొట్టేస్తున్నారు. నగరం, పట్టణంలో వుండే సచివాలయాలన్నింటిపైనా అజమాయిషీ కమిషనర్‌దే కావడంతో పర్యవేక్షణ లోపాలు తలెత్తుతున్నాయి. దీనిని ఆసరా చేసుకుని ఉద్యోగులు విధులకు ఎగనామం పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

మాతృశాఖ పేరుతో డుమ్మా!



సచివాలయ వ్యవస్థలో మొత్తం 12 శాఖలకు చెందిన ఉద్యోగులు వుంటారు. గ్రామ కార్యదర్శి, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మినహా మిగిలిన ఉద్యోగులంతా వివిధ శాఖలతో సమన్వయ బాధ్యతలు నిర్వర్తించాల్సి వుంటుంది. వెల్ఫేర్ అసిస్టెంటు సాంఘిక సంక్షేమ శాఖకు, వీఆర్వో, సర్వే అసిస్టెంటు రెవెన్యూ శాఖకు, అగ్రికల్చర్, ఫిషరీస్, హార్టీకల్చర్ అసిస్టెంటు ఉద్యోగులు వ్యవసాయ, మత్స్య, ఉద్యానవన శాఖ, మహిళా పోలీసులు హోమ్ శాఖతో అనుబంధంలో వుంటారు. ఇలా ఉద్యోగులంతా ఆయా శాఖలతో అనుబంధంలో వుండడంతో మాతృశాఖల అధికారులు వారిని తమ అవసరాలకోసం వాడుకోవడం ప్రారంభించారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో చాలా మంది ఉద్యోగులు సంబంధిత శాఖల ఉన్నతాధికారుల సేవకులుగా మారిపోయారు. దాన్ని అడ్డం పెట్టుకుని ఏకంగా సచివాలయ విధులకే డుమ్మా కొట్టే పరిస్థితి ఏర్పడింది. ఇలా గడిచిన ఐదేళ్లలో సచివాలయ వ్యవస్థ అనేక రకాలుగా దెబ్బతినిపోయింది. ఫలితంగా ఉద్యోగులు తమ బాధ్యతలకు దూరంగా మిగిలిపోయారు. దీనిని తక్షణం సరిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. లేకుంటే ఇది నిరర్థకమైన ఆరోవేలుగా మిగిలిపోయే ప్రమాదం వుంది.


నిరుపయోగంగా బయోమెట్రిక్ విధానం



గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానాన్ని గత ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రతి రోజూ స్పందన కార్యక్రమానికి హాజరు కావాలనే పేరుతో కొన్నాళ్లపాటు మూడు పూటలా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. దీంతో కొన్నాళ్లపాటు ఉద్యోగులు నిరంతరం సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో వున్నారు. కానీ బయోమెట్రిక్ విధానంతో సంబంధం లేకుండా మూడు పూటలా హాజరు వున్నవారికి, లేని వారికి ఒకే విధంగా గత ప్రభుత్వం వేతనాలు ఇవ్వడంతో ఉద్యోగులు అసలు విషయం గ్రహించారు. వేతన బిల్లులు సమర్పించే సమయంలో బయోమెట్రిక్ హాజరు కాకుండా, మాన్యువల్‌గా ఇచ్చే హాజరునే ప్రామాణికంగా తీసుకోవడంతో వేతనాలకు, బయోమెట్రిక్ హాజరుకు సంబంధం లేదని గ్రహించి ఉద్యోగులు మెల్లమెల్లగా హాజరుకు డుమ్మా కొట్టడం మొదలుపెట్టారు. కానీ గత ప్రభుత్వం దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బయోమెట్రిక్ విధానం పూర్తిగా నిరర్థకంగా మారిపోయింది. రోజులో ఏదో ఒక సమయంలో బయోమెట్రిక్ హాజరు పడితే అదే హాజరుగా పరిగణించి మ్యాన్యువల్ హాజరు పట్టీలో నమోదు చేసి చక్కగా వేతనాలు పొందుతున్నారు.

విధులు, బాధ్యతలు లేని విధానమే కారణం

గత ప్రభుత్వం హడావుడిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఉద్యోగుల విధులు, బాధ్యతలు ఏమిటనేది నిర్ణయించి నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకుండా వారిని ఉద్యోగ బాధ్యతల్లో నియమించింది. దీంతో ఉద్యోగాల్లో చేరిన వారికి ఏం చేయాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. మీ సేవ ద్వారా అందించే సేవలు అందించే పని కేటాయించారు. దాదాపు 543 రకాల సేవలు అందించాలని గత ప్రభుత్వం సూచించినా అవి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఉద్యోగులు కేవలం నాలుగైదు సంక్షేమ పథకాల బాధ్యతలకు మాత్రమే పరిమితమైపోయారు. వాటికి కూడా వలంటీర్లను నియమించడంతో, వారిపై అజమాయిషీ చేయడమే తమ విధి అనుకునే పరిస్థితికి ఉద్యోగులు గురయ్యారు. సంస్థాగతంగా నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకపోవడంతో లక్షలాది మంది ఉద్యోగుల సేవలు వృధా అయిపోయాయి. ప్రస్తుతం 543 రకాల సేవలకు గానూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, 1బీ అడంగల్, పాసు పుస్తకాల జారీ సేవలు వంటి నాలుగైదు సేవలు మాత్రమే అందుబాటులో వున్నాయి. దీంతో ఉద్యోగులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకుని ఉద్యోగులు మొత్తంగా విధులకు డుమ్మా కొడుతున్నారు.



సైబర్ వల



- గ్రామస్తులే లక్ష్యంగా మోసాలు
- పిల్లలపై కేసులంటూ పోలీస్ అధికారి డీపీతో కాల్స్
- బంగారం పంపిస్తామంటూ మోసం
- బంధువునంటూ వసూళ్లు

అద్దంకి, ఆగస్టు 26 : సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి అమాయకులు విలవిలలాడుతున్నారు. రకరకాల ఆశలు చూపి అమాయకుల బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. పోలీసుల డీపీలతో కేసులంటూ బెదిరిస్తూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ప్రజలను బెంబేలెత్తేలా చేస్తున్నాయి. అద్దంకి పట్టణంలో స్థిరపడ్డ ముండ్లమూరు మండలం మారెళ్లకు చెందిన సుబ్బయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి నాలుగు రోజులు కిందట ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. వరుసలు కలిపి అర్జంట్‌గా రూ.50వేల నగదు అవసరమని, ఇటీవలనే అమెరికా నుంచి వచ్చానని, తన ఫోన్ నెంబర్ బ్లాక్ కావడంతో వేరే నెంబర్ నుంచి చేస్తున్నానని, వెంటనే ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించాలని కోరాడు. దీంతో సుబ్బయ్య రూ.50వేలు ఫోన్ పే ద్వారా పంపారు. ఆ తరువాత ఫోన్ చేస్తుంటే నెంబర్ పనిచేయడంలేదని చెప్తుండడంతో విచారించగా మోసపోయినట్లు గుర్తించారు. ఆరా తీయగా మరో రియల్ ఎస్టేట్ వ్యాపారికి కూడా ఇదే తరహాలో డబ్బులు అడిగినట్లు గుర్తించారు. బాధితుడు సుబ్బయ్య మారెళ్ల వెళ్లి విచారించగా గుర్తు తెలియని యువకుడు ఓ షాప్ వద్దకు వచ్చి ఫోన్‌పే ద్వారా డబ్బులు కొట్టించుకొని కమీషన్ పోను మిగిలిన డబ్బులు తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై సుబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బల్లికురవ మండలం కొణిదెనలో రెండు నెలల కిందట ఓ యువతికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి అనాథగా పరిచయం చేసుకున్నాడు. మాటలు కలిపి చెల్లెలితో సమానమని చెప్పాడు. బంగారం, ఐ ఫోన్ ఇవ్వాలనుకుంటున్నాని అడ్రస్ వివరాలు చెపితే లండన్ నుంచి పార్సిల్ పంపిస్తానని నమ్మబలికాడు. నిజమని నమ్మిన యువతి అన్ని వివరాలు చెప్పింది. పంపిస్తున్నట్లు చెప్పిన బంగారం, ఐ ఫోన్ ఫొటోలు కూడా పెట్టారు. పార్సిల్‌ను ఎయిర్‌పోర్టులో పట్టుకున్నారని ఒక సారి, కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సి వచ్చిందని మరో సారి ఫోన్‌లు వచ్చాయి. ఇలా రెండు విడతలుగా లక్షా 65 వేలు జమ చేసింది. మరో రెండు సార్లు తనకు తెలియకుండానే మరో రూ.65వేలు వేరే ఖాతాకు నగదు జమ అయ్యాయి. బ్యాంక్ కాల్ సెంటర్ నుంచి మెసేజ్‌లు వచ్చిన తరువాత మోసపోయినట్లు గుర్తించింది. ఈ తరువాత ఆ ఫోన్ నెంబర్ పనిచేయడం లేదు. ఈ విషయమై యువతి బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పోలీస్ అధికారి డీపీతో..

ఇటీవల కాలంలో కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు పోలీస్ అధికారి డీపీ ఉన్న ఫోన్ నెంబర్ నుంచి కాల్స్ వస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి విద్యార్థి పేరు చెప్పి తండ్రి పేరుతో పిలిచి మీ అబ్బాయి గ్యాంగ్‌రేప్‌లో ఉన్నాడని, గంజాయి స్మగ్లింగ్‌లో ఉన్నాడని ఏదో ఒక పెద్ద కేసులో ఇరుక్కున్నాడని బయట పడాలంటే రూ.5 లక్షలు బ్యాంక్ ఖాతాకు జమ చేయాలని ఆ వ్యక్తి డిమాండ్ చేస్తున్నాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తీరా తమ కుమారు లకు ఫోన్ చేసి చెప్పిన తరువాత తమ పిల్లలు కళాశాలలోనే ఉన్నారని నిర్ధారించుకున్న తరువాత ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇలా సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో రెచ్చిపోయి అమాయకులను వలలో వేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు.

అసైన్డ్ దొంగల్లో వణుకు..!

ఐదేళ్లలో నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై కసరత్తు
22ఏ భూముల రిజిస్ట్రేషన్‌లపై కూడా నివేదికలు


పందిళ్లపల్లి సమీపంలో పరాధీనమైన అసైన్డ్ భూమి

- త్వరలోనే రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్న ప్రభుత్వం
- వెలుగులోకి రానున్న మరిన్ని భూ అక్రమాలు

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు కేటాయించిన భూమి మీద వారికే యాజమాన్య హక్కులు కల్పిస్తున్నామనే ముసుగులో వైసీపీ ప్రభుత్వం భారీ భూ దందాకు పాల్పడింది. చివరి రెండు సంవత్సరాలలో అయితే ఆకాశమే హద్దుగా వైసీపీ నేతలు చెలరేగిపోయారు. గత ప్రభుత్వం తెచ్చిన అసైన్డ్ భూముల చట్ట సవరణ సొంతపార్టీ నేతలకు భూ లబ్ధి చేకూర్చడానికే అన్న విధంగా తయారయింది. ఈ అడ్డగోలు భూసంతర్పణలపై అప్పట్లోనే వందల సంఖ్యల ఫిర్యాదులు జిల్లా అధికారులకు అందాయి. అధికారం అండతో వాటిని తొక్కిపెట్టి పబ్బం గడుపుకున్నారు. కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో జరిగిన భూ దోపిడీని నిగ్గు తేల్చాల్సిందేననే పట్టుదలతో ఉంది. ఐదేళ్లలో నిషేధిత జాబితా(22ఏ) నుంచి తొలగించిన భూముల వివరాలతో పాటు వాటి రిజిస్ట్రేషన్ వివరాలను సమగ్రంగా అందించాలని ప్రభుత్వం ఇప్పటికే యంత్రాంగాన్ని ఆదేశించింది. తాజాగా ఫ్రీహోల్డ్ భూములపై రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో వీటిపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. ఇదే అంశం మీద ఇప్పటికే రెవెన్యూ విభాగంతో కలెక్టర్, జేసీ పలు దఫాలుగా సమావేశమయ్యారు. త్వరలోనే పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి అధికారులు సమాయత్తమవుతున్నారు. అసైన్డ్ భూములతో పాటు చుక్కల భూముల విషయంలో జరిగిన అడ్డగోలు రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఎక్కడయితే ఎక్కువ శాతం అసైన్డ్ భూమి ఫ్రీహోల్డ్ చేయబడిందో ఆ రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి అభ్యంతరాలు ఉంటే స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

3,804 ఎకరాలు నిషేధిత జాబితా నుంచి తొలగింపు

2003కు ముందు ప్రభుత్వం దగ్గర నుంచి భూమి పొందిన పేదలు యాజమాన్య హక్కులు పొందడానికి అర్హులుగా గత ప్రభుత్వం నిర్వచించి సంబంధిత భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ చట్ట సవరణను అనుసరించి జిల్లాలో 3,804 ఎకరాల వరకు భూమిని ఫ్రీహోల్డ్ చేశారు. వాస్తవానికి నిజంగా పేదలకే ఈ చట్ట సవరణ ఉపయోగపడి ఉంటే మేలు జరిగేది. కానీ దీనిని అడ్డం పెట్టుకుని వైసీపీ నేతలే చాలా వరకు సదరు భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నట్లు తెలుస్తోంది. ఇలా తొలగించిన భూమిని ఒరిజినల్ అసైనీ పేరు మీదనే యాజమాన్య హక్కు కోసం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడా నిబంధనలకు తిలోదకాలిచ్చి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది. నిషేధిత జాబితా నుంచి తొలగించిన వాటిలో ఇప్పటికే 300 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ అసైనీ పేరు మీద కాకుండా వేరే పేర్లు మీద జరిగినట్లు అధికారుల పరిశీలనలో బహిర్గతమవుతోంది. 2003కు ముందు అసైన్డ్ చట్ట సవరణ ఎన్నికలకు ఏడాదిన్నర ముందు వైసీపీ తెచ్చింది. అంతకుముందు కూడా 22ఏ భూముల విషయంలో వైసీపీ నేతలు ఇష్టారీతిన అవకతవకలకు పాల్పడ్డారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా..

గుంటూరు జిల్లాలో అసైన్డ్ చట్ట సవరణ ద్వారా 939ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారు. 2003కు ముందు పేదలకు పంచిన ప్రభుత్వ భూమిని జిల్లా వ్యాప్తంగా 9,412 ఎకరాలుగా రికార్డుల్లో ఉంది. ఇదే విధంగా పల్నాడు జిల్లాలో 45,234 ఎకరాలకు గాను 4,192 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేసిన భూ వివరాలతో పాటు పరాధీనమైన అసైన్డ్ భూముల వివరాలను కూడా సమగ్రంగా సేకరించడంతో వైసీపీ భూకబ్జాదారుల్లో ఆందోళన నెలకొంది.

అన్యాక్రాంతం విషయంలో పోటీ..

బాపట్ల, చీరాల పరిధిలో దాదాపు 70,000 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇందులో ఇప్పటి వరకు పేదలకు పంచింది సుమారు 40,000 ఎకరాలుగా గత ప్రభుత్వమే అధికారికంగా వెల్లడించింది. ఇందులో 20,000 ఎకరాల వరకు 2003కు ముందు పేదలకు కేటాయించిందే. వైసీపీ తెచ్చిన అసైన్డ్ చట్టసవరణ ప్రకారం ఈ భూమంతా యాజమాన్య హక్కుల గొడుకు కిందకు రావాల్సి ఉంది. కానీ అలాంటిదేమి జరగకపోగా వైసీపీ నేతలకు మాత్రం అది వరంగా మారింది. పేదలకు ఇచ్చిన భూముల్లో 80 శాతం బడాబాబుల చేతుల్లోనే ఉండగా, గడచిన ఐదేళ్లలో దాదాపు పదివేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఇష్టారీతిన వైసీపీ నేతలు అన్యాక్రాంతం చేసేశారు.

రీ సర్వేలో భాగంగా..

గతంలో చేపట్టిన రీసర్వేలోనే అనేక భూ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి సమీపంలో 450 ఎకరాల భూమి పరాధీనమైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 300 ఎకరాల వరకు పేదలకు కేటాయించిన అసైన్డ్ భూమి కాగా, మిగిలినది ప్రభుత్వ భూమిగా అప్పట్లో యంత్రాంగం ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చింది. ఈ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో వారందరికీ అప్పటి జేసీ నోటీసులు జారీ చేశారు. అప్పట్లో వైసీపీలోనే ఉన్న ఓ నేత ఆధీనంలోనే ఆ భూములన్నీ ఉండడంతో నోటీసులు మినహా చర్యల విషయంలో ముందడుగు పడలేదు. ఇవే కాకుండా సూర్యలంక సముద్ర తీరంలో అసైన్డ్ భూముల్లో రిసార్టుల నిర్మాణం చేసిన వారికి కూడా గతంలోనే అధికారులు నోటీసులు ఇచ్చి ఉన్నారు. వీరంతా కూడా వైసీపీ నేతలో వారి అనుచరులో కావడంతో చర్యల విషయంలో కదలిక లేకుండా పోయింది.

మిర్చి రైతుకు.. ధరల మంట

- రోజు రోజుకూ దిగజారుతున్న ధరలు
- పెరుగుతున్న కోల్డ్ స్టోరేజీ అద్దెలు
- పెరిగిన కౌలు ధరలు
- పెట్టుబడుల కోసం తెగనమ్మాల్సిన పరిస్థితి

చీరాల, ఆగస్టు 26 : మిర్చి రైతుకు ధరల మంట కన్నీరు తెప్పిస్తోంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో, ధర వస్తుందనే ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిలవ ఉంచారు. అయినా గత నెలలో ఉన్న ధరలకన్నా ప్రస్తుత ధరలు క్వింటాకు రకాన్ని బట్టి రూ.4వేల నుంచి రూ.6వేల వరకు దిగజారాయి. ఒక వైపు కోల్డ్ స్టోరేజీ అద్దెలు పెరుగుతుండగా, మిర్చి ధర ఏమో నానాటికీ దిగజారుతోంది. చీరాల, పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో ఈ ఏడాది మిరప సాగుకు సాగుదారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రకాన్ని బట్టి క్వింటా రూ.4వేల నుంచి రూ.6వేల వరకు ధరలు తగ్గాయి. అందులో ప్రధానంగా తేజ, నాటు రకాలు ఉన్నాయి. ఇక బాడిగ రకం ఏకంగా క్వింటాకు రూ.15వేలకు తగ్గింది. దీంతో సాగుదారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



ఇదిలా ఉంటే వైట్‌బర్లీ ధరలు గణనీయంగా ఉండడంతో కౌలు ధరలు పెరిగాయి. ఆ ప్రభావం మిర్చి సాగు చేసే పొలాలపై కూడా పడింది. మిర్చి సాగుచేసే పొలాలకు ప్రస్తుతం ఎకరా రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర ఉంది. అది చెల్లించే స్తోమత లేక, ప్రత్యామ్నాయ పైర్ల సాగుకు అనుకూలత లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు మిర్చి ధరలు దిగజారుతున్నా, కౌలు ధరలు పెరగడంతో కౌలు రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఈ ఏడాది సాగుకాలం సమీపిస్తోంది. దీంతో పెట్టుబడులకు, నిల్వ సరుకును విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో పంట నష్టాన్ని ప్రత్యక్షంగా చూశారు. మునిగిన మిర్చి పైరును పీకేస్తున్న రైతులకు తక్షణసాయంగా అక్కడికక్కడే రూ.2లక్షలు అందజేశారు. ప్రస్తుతం గిట్టుబాటు ధరల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని మిర్చి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రిమ్స్‌కు శిశువు

పొన్నలూరులో కేసు నమోదు.. డాక్టర్ల పర్యవేక్షణలో పాపాయి

విచారణ చేపట్టిన పోలీసులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 26: తల్లి పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన బిడ్డ కొందరి నిర్వాకంతో రాష్ట్రమే దాటింది. అయితే అధికారుల చొరవతో చివరకు రిమ్స్‌కు చేరింది. కన్నతల్లే పుట్టినబిడ్డను ఆసుపత్రిలోనే అమ్మకానికి పెట్టి, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన వారికి విక్రయించింది. ఆమె స్వయంగా అంగన్‌వాడీ కార్యకర్త కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే బాలల హక్కుల కమిటీ ఫిర్యాదు మేరకు స్పందించిన ఈనెల 25న పోలీసులు పొన్నలూరులో జీరో ఎఫ్ఐఆర్‌తో కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం పొన్నలూరు నుంచి కేసును ఒంగోలు వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. పొన్నలూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఆ బిడ్డకు తల్లి కావడంతో ఐసీడీఎస్ శాఖలో కలకలం రేగింది. విచారణ చేపట్టిన పోలీసులు ఖమ్మం జిల్లా కల్లూరులో ఉన్న శిశువును తెప్పించారు. జీజీహెచ్(రిమ్స్) ఆసుపత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో పాపను ఉంచారు. అదేవిధంగా కన్నతల్లి, మధ్యవర్తులుగా వ్యవహరించిన పద్మవతి, బ్రహ్మయ్యతోపాటుగా శిశువును కొనుగోలు చేసిన బాలసుందరరావును ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

20 నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

అసోసియేషన్ చైర్మన్ గరటయ్య



మాట్లాడుతున్న డాక్టర్ గరటయ్య

పంగులూరు, ఆగస్టు 26 : పంగులూరులో సెప్టెంబర్ 20, 21, 22 తేదీలలో 34వ రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య ప్రకటించారు. సోమవారం పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల బాలికల ఖోఖో జట్ల ఎంపిక జరిగింది. ఎంపిక అనంతరం కళాశాల క్రీడా ప్రాంగణంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ గరటయ్య మాట్లాడుతూ 14 సంవత్సరాల విభాగంలో జరిగే పోటీలో 13 జిల్లాల నుంచి బాల బాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఇక్కడ రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీల నిర్వహణకు దాతలు, పెద్దలు, గ్రామ ప్రజలు, క్రీడాధికారుల సహకారం అభినందనీయమన్నారు.సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, రోటరీ క్లబ్ క్యాంప్ కోఆర్డినేటర్ వీరరాఘవయ్య, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, భవనం కాశీ విశ్వనాథరెడ్డి, పరిషత్ ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీ సుబ్బారావు, కరణం హనుమంతరావు, జాగర్లమూడి సుబ్బారావు, బాచిన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఫారసు లేఖల కోసం బారులు

పారదర్శకంగా చేయాలంటున్న ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపేట(చీరాల), ఆగస్టు 26 : నిబంధనల మేరకు బదిలీలకు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు తమకు జరిగే స్థానచలనంలో అనుకూలమైన చోటుకు బదిలీ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సిఫారసు లేఖల కోసం సోమవారం పెద్ద సంఖ్యలో ఉద్యోగులు టీడీపీ కార్యాలయం వద్ద బారులుతీరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య అవకాశం ఉన్నంత మేర ఎవరికీ ఇబ్బంది లేకుండా పలు సూచనలు చేస్తూ బదిలీకి సంబంధించిన సిఫారసు లేఖలను అందించారు. కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగం ఎక్కడ అనేది చూడకుండా, పనిచేసే చోట ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పారదర్శంగా పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. వచ్చినవారు అసంతృప్తి చెందకుండా వీలైనంత వరకు నిబంధనలకు లోబడి సంబంధీకులకు బదిలీ సిఫారసు లేఖలను అందజేశారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

పంట ఉత్పత్తిని నియంత్రించాలి

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

వేలం కేంద్రాల్లో కొనుగోళ్ల పరిశీలన

టంగుటూరు, ఆగస్టు 26 : రైతులు వచ్చే సీజన్‌లో అనుమతి మేరకే పొగాకును పండించాలని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచించారు. పంట నియంత్రణ పాటిస్తేనే గిట్టుబాటు ధరలు లభిస్తాయని చెప్పారు. ఆయన సోమవారం టంగుటూరు, కొండపి వేలం కేంద్రాలను సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. పంట పరిమాణాన్ని స్థిరీకరించాల్సిన అవసరాన్ని వివరించారు. గత, ప్రస్తుత సీజన్‌లో లభిస్తున్న ధరలను చూసి బ్యారన్లు, పొలాలు అధిక కౌళ్లు చెల్లించి తీసుకోవద్దన్నారు. ఎప్పటికప్పుడు బోర్డు అధికారుల సూచనలను పాటిస్తూ నాణ్యమైన పొగాకు పండించి లాభాలు పొందాలని కోరారు. పొగాకు రైతులంతా పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని బ్యారన్‌కు పది మొక్కలు నాటాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈసందర్భంగా వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు రైతులతో కలిసి చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. తొలుత వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎస్‌జీవో జి.సిద్ధరాజు, బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పి వరప్రసాదరావు, రైతు సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, బోర్డు సిబ్బంది, అన్ని కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన కొండపిలో వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. రెండేళ్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తి తగ్గినందున ఇక్కడ మంచి ధరలు లభించాయన్నారు. వచ్చే సీజన్‌లో వివిధ దేశాల్లో ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో అధిక ధరలకు పొలాలు, బ్యారన్లు కౌళ్లకు తీసుకుని నష్టపోవద్దని సూచించారు.

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

రెండునెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి

దర్శి, ఆగస్టు 26 : ఈత సరదా యువకుల ప్రాణాలను హరిస్తుంది. దర్శి మండలంలో రెండు నెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి చెందారు. ఉజ్వల భవిష్యత్తుతో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఆశించిన తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. ఆ కుటుంబాలు శోక సముద్రంలో మునిగిపోతున్నాయి. మూడురోజుల క్రితం కొత్తపల్లి,లక్ష్మీనారాయణపురం, కొర్లమడుగు గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సాగర్ కాల్వలో పడి మృతిచెందారు. తొలిరోజు ఒక మృతదేహం లభించగా, మరుసటి రోజు మిగిలిన రెండుమృతదేహాలను గాలించి వెలికితీశారు.ఈదుర్ఘటనతో ఆమూడు కుటుంబాలు శోకసముద్రంలో మునిగి పోగా, మూడు గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.అంతకుముందు జూన్ 13న దర్శి మండలం లూథగిరి కాలనీకి చెందిన బోడే నవీన్, కొనకనమిట్ల మండలం వాగుమడుగుకు చెందిన వి.చందులు శివరాజ్ నగర్ వద్దగల ఎన్ఏపీ చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం విదితమే. నవీన్ పుట్టినరోజు సందర్భంగా స్నేహితులను విందుకు పిలిచి తనతోపాటు చదువుకుంటున్న చందును కూడా ఆహ్వానించారు. భోజనాలు పూర్తయిన తరువాత వీరిద్దరూ ఎన్ఏపీ చెరువు వద్దకు వెళ్లి ఈతకు దిగి విగతజీవులయ్యారు. ఆ తరువాత జూన్ 30న తూర్పువీరాయపాలెం వాగులో ఏర్పాటు చేసిన కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన దర్నాశి వీరమణికంఠ, అద్దంకి మండలం వేలమూరిపాడుకు చెందిన పులి రాఘవేంద్ర అక్కాచెల్లెళ్ల కుమారులు. తూర్పువీరాయపాలెంలో జరిగిన ఆంజనేయస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఉదయం బహిర్భూమికి వెళ్లి వాగులో నీటి నిల్వ కోసం తీసిన కుంటలో పడి మృతి చెందారు. రెండు నెలలకాలంలో మూడు దుర్ఘటనలో ఏడుగురు విద్యార్థులు నీటిలో మునిగి విగతజీవులయ్యారు. ఆ కుటుంబాల్లో విషాదచాయలు ఇప్పటికీ ఆరిపోలేదు. మూడురోజుల కిత్రం సాగర్ కాల్వలో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందటం ఆమూడు గ్రామాల్లో ప్రజల్ని కలిచి వేస్తుంది. భవిష్యత్తులో చిన్నారులు ఇలాంటి దుర్ఘటనలకు బలికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు నీటి వద్ద వద్దకు వెళితే జరిగే ప్రమాదాలు తెలియపరిచి వారిని చైతన్యవంతుల్ని చేస్తే ప్రమాదాలను అరికట్టే వీలుంటుంది..

బదిలీల హైరానా..!



కీలక శాఖల్లో మార్పులకు ప్రభుత్వం ఆదేశం

ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం ఆరాటం

కూటమి నేతల ద్వారా సిఫార్సు లేఖల కోసం ఒత్తిళ్లు

కోరుకున్న స్థానాల కోసం కొందరు పైరవీలు

వైసీపీతో అంటకాగిన వారిలో ఆందోళన

నెలాఖరుకు ముగియనున్న ప్రక్రియ

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో కీలకశాఖల్లో పనిచేస్తున్న వారు అనుకూలమైన స్థానాల కోసం వేట ప్రారంభించారు. పోస్టింగ్‌లలో అధికారపార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ప్రాధాన్యం ఉండటంతో అత్యధిక శాతం మంది ఉద్యోగులు టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నేతల ఆశీస్సుల కోసం ఆరాటపడుతున్నారు. కూటమి పార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నేతల ద్వారా వారిపై ఒత్తిళ్లు పెంచుతున్నారు. సిఫార్సుల లేఖలు పొందేందుకు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు గతంలో తమకు పరిచయం ఉన్న టీడీపీ నేతలు, పైస్థాయి అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. మరి కొందరు స్థానిక నేతలను వివిధ రూపాలలో ఆకర్షించి పైరవీలు కూడా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేసమయంలో ఐదేళ్లుగా వైసీపీ నేతలతో అంటకాగిన ఉద్యోగులు హైరానా పడుతున్నారు. ఎలాగోలా టీడీపీ ఎమ్మెల్యేలను కలిసేందుకు మార్గాలను వెతుకుంటున్నారు.

ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల తర్వాత ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 31లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. అభ్యర్థన విధానంలో స్థానచలనానికి అవకాశం ఇచ్చింది. మండల స్థాయిలో కీలకమైన రెవెన్యూలోని డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, అలాగే ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఈలతోపాటు గ్రామస్థాయిలోని వీఆర్వో, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది బదిలీలపై వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ ముఖ్య నేతలు దృష్టిసారించారు. అలాంటి వారు జిల్లాలో వందల సంఖ్యలోనే ఉన్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులు వారికి నచ్చినచోట పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

15 కీలక శాఖల్లో బదిలీలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పాలనను గాడిలో పెట్టడంపై దృష్టిసారించింది. తొలుత కీలకమైన ఐఏఎస్, ఐపీఎస్ తర్వాత డీఎస్పీల బదిలీలు చేపట్టింది. ప్రస్తుతం మండల, గ్రామ, పట్టణ స్థాయిలోని వివిధ శాఖల ఉద్యోగుల బదిలీలపై దృష్టిసారించింది. ఇప్పటికే తహసీల్దార్లు, సీఐ, ఎస్ఐల నియామకాలు దాదాపు ఒక కొలిక్కి వచ్చాయి. తాజాగా 15 కీలక శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామ, వార్డు సచివాలయాలు, రిజిస్ట్రేషన్, దేవదాయ, పరిశ్రమలు, పౌరసరఫరాల వంటి శాఖలతోపాటు అన్ని ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగులు బదిలీలు కానున్నారు. ఈనెల 19 నుంచి 31లోపు ప్రక్రియ పూర్తికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఒకే పట్టణం లేదా గ్రామంలో ఐదేళ్లు పనిచేసిన వారు విధిగా బదిలీ కావాల్సి ఉంది. మిగిలిన వారు జీరో సర్వీసుతోనూ కావాలనుకొంటే బదిలీ కోరుకోవచ్చు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇంచుమించు ఆయాశాఖల్లో అందరూ బదిలీ అయ్యే అవకాశం ఉంది.

కొందరు ముందస్తుగానే లేఖలు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రస్తుతం జిల్లాలో ఏప్రాంతంలో పనిచేస్తున్న వారు అక్కడే లేదా పొరుగు నియోజకవర్గాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకోసం అధికారపార్టీ నేతలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. బదిలీలలో అధికారపార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యం ఉంటుందన్నది బహిరంగ సత్యం. దీంతో వారిని ప్రసన్నం చేసుకొని సిఫార్సు లేఖలు పొందేందుకు పోటీపడుతున్నారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో జిల్లావ్యాప్తంగా సిఫార్సుల లేఖల కోసం వచ్చిన ఉద్యోగులతో జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధుల గృహాలు, కార్యాలయాల వద్ద రద్దీ నెలకొంది. బదిలీలు ఉంటాయని గ్రహించి నెలక్రితమే కొందరు ఉద్యోగులు కీలక నేతల వద్ద హామీలు, తదనుగుణంగా లేఖలు కూడా తీసుకొన్నారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ పూర్తికి గడువు సమీపిస్తుండటంతో అధికారపార్టీ ప్రజాప్రతినిధులపై ఒత్తిడి మరింత పెరిగింది. తమకు అనుకూలంగా వ్యవహరించే ఉద్యోగుల పోస్టింగుల కోసం కూటమి పార్టీలకు చెందిన మండల, గ్రామస్థాయి నేతలు కూడా తమ అధినాయకులపై ఒత్తిళ్లు పెంచారు.

కుదరని ఏకాభిప్రాయం

నలుగురు జిల్లా అధికారుల పోస్టులపై తర్జనభర్జన

అధికారపార్టీ నేతల తీరుపై ఆరా తీస్తున్న అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో అధికారుల బదిలీల వ్యవహారంపై అధికార తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిదులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ప్రధానంగా మూడు, నాలుగు శాఖల జిల్లా అధికారుల నియామకం విషయంలో ప్రతిష్ఠంభన నెలకొంది. రాష్ట్రంలో అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ వేగవంతమైన విషయం తెలిసిందే. కిందిస్థాయిలో ముఖ్యమైన అధికారుల బదిలీలు జరిగి వివిధ శాఖల ఉద్యోగుల బదిలీల వ్యవహారం ప్రస్తుతం నడుస్తోంది. కిందిస్థాయిలో పోలీసు, రెవెన్యూ ముఖ్య అధికారుల నియామకంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక పంథాను అనుసరిస్తోంది. పోలీసు శాఖలో డీఎస్పీల నియామకాన్ని పైనుంచే నిర్వహించారు. సీఐల నియామకంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు సూచించిన వారిపై కూడా ప్రత్యేక పరిశీలన చేసి సరైన వారు కాకపోతే వేరేవారిని నియమించారు. ఆర్డీవోలు, డీఎస్పీల విషయంలో ఎమ్మెల్యేలు చెప్పినవి విన్నారే తప్పా అధిష్ఠానం అనుకున్న వారికే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక కలెక్టర్, ఎస్పీలది అయితే అధిష్ఠానమే ఎంపిక చేసింది. కొన్ని గంటల ముందు ఆ విషయాన్ని జిల్లా మంత్రికి మాత్రమే సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రకాశం జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యే ఇన్‌చార్జులు సమావేశమై నియోజకవర్గ స్థాయిలో ఎవరికి వారు చూసుకోవాలని, జిల్లాస్థాయి అధికారుల బదిలీలపై ఉమ్మడిగా మాట్లాడుకొని ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

నాలుగు, ఐదు శాఖలపై సమస్య

కాగా జిల్లాస్థాయిలోని ఆయా శాఖల అధికారుల నియామకానికి సంబంధించి వస్తే అధికారపార్టీ నేతలు పూర్తిస్థాయిలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ప్రధానంగా జడ్పీ సీఈవో, డీపీవో, విద్యుత్ శాఖ ఎస్ఈ, మైనింగ్ డీడీ, ఏడీ, డ్వామా పీడీ తదితర అధికారుల నియామకం విషయంలో నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. తొలుత జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల సంతకాలతో కొన్ని పోస్టులకు సిఫార్సు లేఖలను తయారుచేశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న ఒక ఎమ్మెల్యే సదరు సిఫార్సు లేఖలపై సంతకం పెట్టి మిగిలిన వారి వద్దకు పంపగా వారు ఆ లేఖలపై సంతకాలు చేశారు. అయితే అందులో మంత్రి స్వామి సంతకం లేకపోవటం విశేషం. అయితే ఆరంభంలో ఒకటి రెండు శాఖల అధికారుల విషయంలో సదరు అధికారి మంత్రి స్వామిని కలవకపోయినా సీనియర్ నాయకుడు ఫోన్ చేయటంతో ఆయన కూడా ప్రత్యేకంగా సిఫార్సు లేఖలు ఇచ్చారు. అయితే చివరకు వచ్చేసరికి మంత్రి సిఫార్సు లేకుండానే ఆయా శాఖల అధికారులను నియమించాలని ఆయా మంత్రులకు లేఖలు పంపారు. మంత్రి సంతకం లేకపోవటంతో కొన్ని శాఖల వారు ఆ సిఫార్సులను పక్కనపెట్టారు. తదనంతరం మంత్రి వైపు నుంచి సీఈవో, డీపీవో, మైనింగ్ శాఖ అధికారుల నియామకానికి సంబంధించి వేరే అధికారుల పేర్లు సూచిస్తూ లేఖలు ఆయా శాఖలకు వెళ్లాయి. ఉదాహరణకు డీపీవోగా పశ్చిమప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే సిఫార్సుతో ఒక అధికారి పేరును తొలుత సూచించారు. అయితే మంత్రి స్వామి కొండపి నియోజకవర్గం నుంచి సింగయ్య అనే అధికారి పేరు సూచించారు. ఉన్నతాధికారులు తొలుత ఎమ్మెల్యే సూచించిన అధికారి పేరును తిరస్కరించినట్లు తెలిసింది. తాజాగా కలెక్టర్ జోక్యం చేసుకొని ముఖ్యమైన శాఖ అయినందున తమకు సమర్థవంతమైన అధికారి కావాలని డీపీవో విషయాన్ని వదిలేయాలని ఇటు మంత్రిని కొందరు సీనియర్ నాయకులను కోరినట్లు తెలిసింది. అయితే సీనియర్ ఎమ్మెల్యే ఆ ప్రతిపాదన అంగీకరించకపోవటంతో సమస్య ఎదురైంది. జడ్పీ సీఈవోగా మంత్రి సిఫార్సు లేకుండా ఒక పేరు ఎమ్మెల్యేలు సూచించగా మంత్రి ఉన్నతస్థాయిలో నాయకుల సిఫార్సుతో మరోపేరు సూచించారు. జడ్పీ పాలకమండలి వైసీపీ చేతిలో ఉండటంతో ఉన్నతస్థాయిలో ఆలోచించి ఒక అధికారిని మంత్రి సూచించగా ఎమ్మెల్యేలు ఇంకో అధికారిని సూచించటంతో సమస్య ఉత్పన్నమైంది. డ్వామా పీడీ విషయంలో ఒక ఎమ్మెల్యే ఒకరిని సూచించగా అత్యధికులు ఆ అధికారిని తీవ్రంగా వ్యతిరేకించారు. మైనింగ్ అధికారుల విషయంలోను జిల్లా ఎమ్మెల్యేల నుంచి ఒకటి, రెండు పేర్లు అధిష్ఠానంకు చేరాయి. విద్యుత్ శాఖకు కట్టా వెంకటేశ్వర్లు అనే అధికారి నియామకానికి అందరూ సిఫార్సు చేశారు. అయితే అతనికి పదోన్నతి లేకుండా ఇన్‌చార్జి ఇవ్వాలా వద్దా అనే విషయంలో సీఎం సూచన ప్రకారం నడుస్తానని మంత్రి రవికుమార్ తెలిపినట్లు తెలిసింది. ఈలోపు ఒకరిద్దరు నాయకులు ప్రస్తుత ఎస్ఈనే కొనసాగించాలని సూచించటంతో మిగిలిన వారు వారి నిర్ణయాన్ని వ్యతిరేకించినట్లు సమాచారం.

ఆరా తీస్తున్న అధిష్ఠానం

కాగా జిల్లాస్థాయి అధికారుల బదిలీల విషయంలో జిల్లా నేతల మధ్య ఏకాభిప్రాయం ఎందుకు లభించలేదనే విషయంపై టీడీపీ అధిష్ఠానంతో పాటు సీఎంవో అధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లా నేతల సూచించిన ప్రతి అధికారి పనితీరుపై సీఎంవో అధికారులు పరిశీలన చేస్తున్నారు. కొన్ని శాఖల మంత్రులు అయితే మీరందరూ ఏకాభిప్రాయంతో ఒకపేరు సూచించాలని అప్పటిదాకా నియామకాలు జరపబోమని తేల్చిచెప్పినట్లు తెలిసింది. గతంలో ఉమ్మడి జిల్లా నేతలంతా ఏకాభిప్రాయంతో నడిచారు. ఇప్పుడు తాజా పరిస్థితి ఎందుకు వచ్చిందనే విషయంపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేకంగా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఉద్యోగాల పేరుతో మోసం!

వైసీపీ నేతలను వెంటనే అరెస్టు చేయాలి

అక్రమాలపై సిట్ దర్యాప్తు చేయించాలి

కలెక్టరేట్ ఎదుట బాధితుల ర్యాలీ, ధర్నా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 26: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ముస్లిం జాగరణ్‌మంచ్ రాష్ట్ర కన్వీనర్ షేక్ మహ్మద్ బుజ్జి డిమాండ్ చేశారు. జాగరణ్‌మంచ్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా చేశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరురాలు షేక్ సల్మాసుల్తానా, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు పీఏ బండారు సురేష్‌ల అక్రమాలపై సిట్ దర్యాప్తు చేయించాలని కోరారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని జిల్లావ్యాప్తంగా పలువురు వద్ద లక్షలు వసూలు చేసి, ఫేక్ జాబ్ లెటర్లు సృష్టించారని ఆరోపించారు. ఇంకొల్లు మండలం ఇడుపులపాడుకు చెందిన దొంతాల మహేష్‌కు మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో పోస్టు, దొంతాల మనోహర్, కనిగిరికి చెందిన ఒగ్గు వెంకటేశ్వర్లుకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.23లక్షలను సల్మాసుల్తానా తన ఫోన్‌పే అకౌంట్‌కు పలుదఫాలుగా వేయించుకున్నారని ఆరోపించారు. కలెక్టర్ పేరుతో ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారని తెలిపారు. అవి ఫేక్ అని తెలియడంతో ప్రకాశం, బాపట్ల ఎస్పీలకు ఫిర్యాదు చేయగా వారిపై కేసు కూడా నమోదు చేశారన్నారు. వారితో మరికొంత మంది కలిసి రూ.2కోట్ల వరకు వసూలు చేశారన్నారు. డబ్బులు తిరిగి అడుగుతున్నారని బాధితులను బెదిరిస్తున్నారని, వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు టీడీపీ నాయకుడు ఎస్.సుబ్బారావు గుప్తా, చెరుకూరి ఆదిలక్ష్మిలు సంఘీభావం తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అద్దంకి బస్టాండ్ నుంచి పాత మార్కెట్ సెంటర్, ట్రంకురోడ్డు, చర్చిసెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో పలువురు నిరుద్యోగులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

అటవీ సంపదపై అక్రమార్కుల కన్ను

చెట్లు నరికి దొడ్డిదారిన తరలింపు

బ్యారన్ యజమానులకు విక్రయం

పట్టించుకోని అధికారులు



తరలించేందుకు సిద్ధంగా ఉన్న అటవీ కర్ర



చెట్లను నరకగా మోడుబారిన సిరిమాను మొదలు

పీసీపల్లి, ఆగస్టు 26: అటవీ సంపద తరలిపోతోంది. కొంతమంది అక్రమార్కులు చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. ఈఏడాది సీజన్‌కు ముందే చెట్లను నరకుతూ బ్యారన్‌లకు తరలిస్తున్నారు. కర్రకు డిమాండ్ అధికంగా ఉండడంతో వ్యాపారుల కన్ను అటవీ చెట్లపై పడింది. అటవీ సమీపంలో ఉన్న చెరువులు, పొలాల్లో ఉన్న చెట్లను నరికేందుకు ఆయా గ్రామాల ప్రజలతో చర్చించి దేవస్థానాల అభివృద్ధికి నగదు చెల్లించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఆతరువాత చెరువులు, పొలాల్లో చెట్లను కొట్టుకునేందుకు ఒప్పందం చేసుకున్న వ్యాపారులు సమీపంలోని అడవిలో ఉన్న చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారు. తరలించిన కర్రను బ్యారన్ యజమానులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కందుకూరు, వెంకుపాలెం, చెన్నుపాడు, అగ్రహారం, పొన్నలూరు తది తర గ్రామాల్లో పొగాకు అధికంగా సాగుచేస్తారు. పొగాకు కాల్పునకు అవ సరమైన కలప అక్కడి రైతులకు అందుబాటులో లేదు. దీంతో ఆయా ప్రాంతాల బ్యారన్ యజమానులు పీసీపల్లి మండలంలోని కర్ర వ్యాపారు లను ఆశ్రయిస్తున్నారు. ఈఏడాది పొగాకు మంచి ధర పలకడంతో సాగు విస్తీర్ణం అధికంగా పెరగనుంది. దీంతో సీజన్ ఆరంభానికి ముందు నుం చే కర్రకు డిమాండ్ పెరిగింది. బ్యారన్‌కు కర్రను తరలించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతితో ప్రభుత్వానికి చలానా తీసి పర్మిట్‌ల ద్వారా తుమ్మ, చిల్ల తదితర కలపను వ్యాపారులు విక్రయించేవారు. ప్రస్తుతం తుమ్మ, తదితర కలప అధిక ధరలు పలుకుతుండడంతో కొంత మంది వ్యాపారుల చూపు అడవిపై పడింది. అటవీ కర్ర అయితే కొనే అవసరం ఉండదని, కేవలం కొట్టుడు కూలీ మాత్రమే చెల్లిస్తే అధికంగా సొమ్ము ఆర్జించ వచ్చునన్న ఆలోచనతో దొరికిన చోటల్లా అటవీ సంపదను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారు లు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ సంపదను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అక్రమ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్‌ల నిలిపివేత

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


దర్శి, ఆగస్టు 26 : దర్శి నగర పంచాయతీలోని అక్రమ లేఅవుట్లలో క్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో అక్రమ లేఅవుట్లపై చర్యలేవీ? శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇప్పటికే పట్టణంలోని అక్రమ లేఅవట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆ సర్వే నెంబర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు చేయకుండా నిలుపుదల చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సూచించినట్లు పేర్కొన్నారు. ఈ లేఅవుట్లలో ఎలాంటి భవన నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామన్నారు.

తక్కెళ్లపాడు గ్రామస్థులకు ఎక్కిళ్లు!

- రూ.50లక్షలతో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన పైలెట్ ప్రాజెక్ట్
- ఏళ్లుగా నిలిచిపోయిన నీటి సరఫరా
- జమ్ము, చిల్లకంపతో మూసుకుపోయిన చెరువు
- నిరుపయోగంగా ఫిల్టర్ బెడ్
- ఇంటింటికీ తాగునీరందని దుస్థితి



నీటినిల్వ కోసం నిర్మితమైన మంచినీటి చెరువు దుస్థితి



రక్షిత మంచినీటి ట్యాంక్



ఏళ్ల తరబడి ఇసుక మార్పిడికి నోచుకోని రెండో ఫిల్టర్ బెడ్



నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్

పంగులూరు, ఆగస్టు 26 : ఇంటింటికీ నీరందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పైలెట్ ప్రాజెక్ట్ మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. దీంతో తక్కెళ్లపాడు గ్రామస్థులకు ఎక్కిళ్లు తప్పడం లేదు. గ్రామంలో బోర్లు, బావుల ద్వారా లభించే ఉప్పు నీటితోనే ప్రజలు నీటి అవసరాలను తీర్చుకునే దుస్థితి నెలకొంది. నాటి పాలకులు గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చాలనే లక్ష్యంతో 2003లో రూ.50లక్షల వ్యయంతో చేపట్టిన (రక్షిత మంచినీటి పథకం) పైలెట్ ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారింది. సుమారు 17వందల జనాభా ఉన్న తూర్పు తక్కెళ్లపాడు ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు ఆ నాటి తెలుగుదేశం ప్రభుత్వం రూపకల్పన చేసిన పైలెట్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు రూ.50లక్షల నిధులు మంజూరు చేయగా, నీటి నిల్వసామర్థ్యం కోసం అవసరమైన చెరువు నిర్మాణానికి ప్రముఖ వేద పండితులు దివంగత శ్రీశైలనాథన్ అయ్యంగార్ కుటుంబ సభ్యులు 20 ఎకరాల సాగు భూమిని ఉచితంగా సమకూర్చారు. నీటి నిల్వ కోసం చెరువు నిర్మాణంతో పాటు గ్రామంలో ఇంటింటికీ మంచినీటిని అందించేందుకు పైప్ లైన్ ఏర్పాటు, లక్ష లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల నీటి ట్యాంక్, ఫిల్టర్ బెడ్‌లను నిర్మించి కొళాయిలను ఏర్పాటు చేసి నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్ట్ నిర్వహణకు కమిటీని నియమించి కొన్ని సంవత్సరాలు నీటి సరఫరా సజావుగా సాగించారు. అనంతరం గ్రామంలో పైప్‌లైన్ పాడైందని కొళాయిల దగ్గర ప్రజలు నీటిని పట్టుకునే విషయంలో గొడవలు పడుతున్నారంటూ నీటి సరఫరా నిలిపివేశారు. ట్యాంక్ దగ్గరకు వచ్చి ప్రజలు నీటిని పట్టుకునేందుకు వీలుగా రక్షిత మంచినీటి ట్యాంక్ వద్ద ప్రత్యేకంగా ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. ఇది సజావుగా జరగని పరిస్థితిలో ప్రజలకు తాగు నీరైనా అందించాలనే ఉద్దేశంతో ఈ పథాన్ని ఆర్వో ప్లాంట్‌కు పరిమితం చేశారు. ఆర్వో ప్లాంట్ ద్వారా అందించే నీటి విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే ఆరోపణలు వినిపస్తున్నాయి.

కలగా మిగిలిన ఇంటింటికీ నీటి సరఫరా

ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో ప్రజల నీటి అవసరాలు తీర్చాలని మంజూరు చేసిన పైలెట్ ప్రాజెక్ట్ నిర్వహణ అటకెక్కింది. దాతలు చెరువు కోసం ఇచ్చిన పదుల ఎకరాల భూమిలో నిర్మితమైన చెరువు మరమ్మతులకు నోచుకోని దుస్థితి ఏర్పడింది. పూడిక, జమ్ము, చిల్లకంపతో మూసుకు పోయిన చెరువులో నీటినిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. రక్షిత మంచి నీటి కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్ జమ్ముతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. ఉన్న రెండో ఫిల్టర్ బెడ్‌లో ఎన్నో ఏళ్లుగా ఇసుక మార్చక పోవడంతో నీరు సరిగా ఫిల్టర్ కావడం లేదు. గత కొన్నేళ్లుగా నీటి అవసరాలు తీరక ఇబ్బంది పడుతున్నామని, తమ మొర ఎవరూ ఆలకించడంలేదని, సమస్యను ప్రభుత్వం గుర్తించాలని ప్రజలు వేడుకుంటున్నారు. తమ నీటి అవసరాలు తీరేలా చెరువులో పూడిక, జమ్ము తొలగించి నీటి నిల్వలు పెంచాలని, గ్రామంలో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఫిల్టర్ బెడ్లకు తగిన మరమ్మతులు చేపట్టి ఇంటింటికీ రక్షిత మంచి నీటి సరఫరా జరిగేలా ప్రభు త్వం తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చెక్కులను కమిషనర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అన్న క్యాంటీన్‌కు దాతల సాయం అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 26 : పేదల పాలిట అన్నపూర్ణగా సీఎం చంద్రబాబు ఆశీస్సులతో కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌కు దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఇప్పటి వరకు అన్న క్యాంటీన్‌కు చెక్కుల రూపేణా పలువురు అందజేసిన సుమారు రూ.5లక్షలను ఎమ్మెల్యే కొండయ్య, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ పెళ్లిరోజు, పుట్టినరోజుల లాంటి ప్రత్యేక సమయాలలో దాతలు అన్న క్యాంటీన్‌లో భోజనాల ఏర్పాటుకు సహకారం అందించే విధంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు దాతలు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్టు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 26 : మండల పరిధిలోని కఠారివారిపాలెంలో పేకాట శిబిరంపై వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి సోమవారం నిర్వహించిన దాడులలో 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

డెంగ్యూతో మహిళ మృతి



వంకాయలపాడు(ఇంకొల్లు), ఆగస్టు 26 : వంకాయలపాడు గ్రామంలో మహిళ డెంగ్యూ జ్వరంతో సోమవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బేతపూడి మరియమ్మ(51) 10 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. తొలుత పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందగా డెంగ్యూగా నిర్ధారించారు. వెంటనే ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సరైన వైద్యం అందకపోవడంతో అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సుమారు రూ.5లక్షల వరకూ ఖర్చు చేసినా ఫలితం లేకపోగా సోమవారం మరియమ్మ మృతి చెందారు.

పారిశుధ్యం అధ్వానం

ఇదిలావుండగా వంకాయలపాడులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఎక్కడ మురుగు అక్కడే నిలిచి కంపుకొడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వంకాయలపాడు ఎస్సీ కాలనీలో పెద్ద సంఖ్యలో జ్వరాలతో బాధపడుతున్నారని, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.



నారాయణం దంపతులను సత్కరిస్తున్న మిత్రమండలి, ట్రస్ట్ సభ్యులు

అవధానంలో అందెవేసిన చేయి నారాయణంది

అద్దంకిటౌన్, ఆగస్టు 26 : అవధాన క్రీడలో అందెవేసిన చేయి నారాయణం బాలసుబ్రహ్మణ్యందని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్ట్ సహకారంతో గత మూడు రోజులుగా జరుగుతున్న నారాయణం బాలసుబ్రహ్మణ్యం 4వ శతావధానం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన పురస్కార సభకు డాక్టర్ దేవపాలన అధ్యక్షతన వహించారు. అవధానం ఒక పద్య క్రీడ అని, అందులో ఆరితేరిన అవధాని, పుంభావ సరస్వతి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అనంతరం ట్రస్ట్ తరపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజలు శతావధాని బాలసుబ్రహ్మణ్యం దంపతులకును ఘనంగా సత్కారించి, పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు పోలూరి వెంకట శివరామ ప్రసాద్, వారణాసి రఘురామశర్మ, గాడేపల్లి దివాకర్ దత్తు, మురళి సుధాకరరావు, పాలపర్తి జ్యోతిష్మతి, డీవీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామీణులకు ప్రయోజనం కలిగేలా సర్వీసులు

ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహనరావు



హైదరాబాద్ సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎం

అద్దంకి, ఆగస్టు 26 : గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. పమిడిపాడు నుంచి బీహెచ్ఈఎల్‌కు ప్రత్యేకంగా నడుపుతున్న బస్ సర్వీసును సోమవారం రాత్రి అద్దంకిలో డీఎం రామ్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ అద్దంకి డిపో నుంచి కొరిశపాడు, పంగులూరు మండలాలలోని పలు గ్రామాలను కలుపుతూ హైదరాబాద్‌కు ఒక బస్ సర్వీసు మాత్రమే నడుస్తుండగా, సోమవారం నుంచి అదనంగా మరో సర్వీసును నడుపుతున్నట్లు తెలిపారు. చందలూరులో రాత్రి 9గంటలకు బయలుదేరి పంగులూరు, ముప్పవరం, అద్దంకి మీదుగా ఒక సర్వీసు, పమిడిపాడులో రాత్రి 9-20 గంటలకు బయలుదేరి రావినూతల, మేదరమెట్ల, అద్దంకి మీదుగా మరో సర్వీసు నడుస్తాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అద్దంకి నుంచి బెంగళూరు, బ్రహ్మంగారి మఠం, చెన్నైకు కొత్త సర్వీసులు, హైదరాబాద్‌కు మరో సర్వీసు, శ్రీశైలంకు మరో సర్వీసు, ఒంగోలుకు రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఒంగోలుకు 2 పల్లెవెలుగు బస్సులు అదనంగా అవసరం ఉన్న విషయాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ మహబూబి, సీఆర్‌పీ కొండలు పాల్గొన్నారు.

కాపు కాసి.. కారును అడ్డుకొని

ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



టోల్ ప్లాజా వద్ద పోలీసుల అదుపులో ఉన్న ఎర్రకారు

మార్టూరు, ఆగస్టు 26 : సినీ ఫక్కీలో ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్న కారును పోలీసులు పట్టుకున్నారు. సంఘటన సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మండల పరిధిలో ఒంగోలు వైపు రోడ్ బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. అనంతరం టోల్ ప్లాజా వద్దకు వచ్చిన తూర్పు గోదావరి జిల్లా నల్లచెర్ల స్టేషన్‌కు చెందిన పోలీసులు చేరుకొని ముగ్గురు యువకులతోపాటు కారును అదుపులోకి తీసుకొని గుంటూరు వైపు వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం గుంటూరు వైపు నుంచి ఎర్రకారు ఒంగోలు వైపు వస్తుందని, దానిని అడ్డుకోవాలని మార్టూరు హైవే మొబైల్ వాహనంలోని పోలీసులకు నల్లచెర్ల స్టేషన్ పోలీసుల నుంచి సమాచారం వచ్చినట్లు తెలిసింది. దాంతో అప్రమత్తమైన మొబైల్ పోలీసులు టోల్ ప్లాజా వద్దకు చేరి, గుంటూరు వైపు నుంచి వచ్చే ఎర్రకారు కోసం కాపు కాశారు. అంతేగాకుండా వారు టోల్ ప్లాజాకు అవతలవైపున ముందస్తు జాగ్రత్తగా జె.పంగులూరు మొబైల్ వాహన పోలీసులకు కూడా సమాచారం పంపించారు. దాంతో టోల్ ప్లాజా గేటు వద్ద కారు ఆగగానే పోలీసులు చుట్టుముట్టారు. కారు ముందు, వెనుక మొబైల్ వాహనాలను నిలపివేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న సీఐ శేషగిరిరావు తన సిబ్బంది, హైవే మొబైల్ వారితో కలిసి కారును, కారులోని యువకులను తనిఖీ చేశారు. అదే సమయానికి నల్లచెర్ల పోలీసులు టోల్ ప్లాజా వద్దకు చేరుకొని ముగ్గురు యువకులతోపాటు కారును అదుపులోకి తీసుకొని వెళ్లిపోయారు.



కారులో ఉన్న ముగ్గురు యువకులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు





అద్దంకిలో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు.. ఉట్టి కొడుతున్న చిన్నారులు

అద్దంకి, ఆగస్టు 26 : కృష్ణాష్టమి వేడుకలను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలో నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో కృష్ణ మందిరంల ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, స్థానికులు పాల్గొన్నారు. పట్టణంలోని హరిహర గోకులంలో వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కృష్ణుడు గోపిక వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులకు వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఆదినారాయణ, ఐతా రాజా, డిస్ట్రిక్ ఆఫీసర్ చిన్ని మురళీకృష్ణ, వనితా క్లబ్ అధ్యక్షులు విజయలక్ష్మి, అంజలి, గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు పాల్గొన్నారు. మండలంలోని శింగరకొండపాలెంలో కృష్ణుని విగ్రహం వద్ద గ్రామస్థులు పూజలు నిర్వహించారు.

బల్లికురవ : బల్లికురవ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కొణిదెన గ్రామంలో యజ్ఞం నారాయణ మెమోరియల్ ఆధ్వర్యంలో గోవులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా ముక్తేశ్వరం, కొప్పరపాడు, మల్లయ్యపాలెం, నక్క బొక్కలపాడు తదితర గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు కన్నుల పండుగగా చేశారు.

ఇంకొల్లు : కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కృష్ణనగర్‌లోని కృష్ణమందిరంలో మహిళలు ప్రతేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. శ్రీవరలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు తరుపున సుబ్బయ్య కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిత్రలేఖనం, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

పర్చూరు : శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నాయి. కృష్ణాష్టమి పండుగ సందర్భంగా శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారులకు ఆలయ కమిటీ వారు బహుమతులను అందజేశారు. ఆలయంలో గోవులకు పూజలు చేశారు. కార్యక్రమంలో రావువారి ప్రసాద్, కృష్ణంశెట్టి జగదీష్, అర్చకులు బృందావనం సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పడమర బజారున శ్రీకృష్ణా యూత్ ఆధ్వర్యంలో యువకులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం యువకులు ఆట, పాటలతో సంబరాలు చేశారు. వలపర్ల గ్రామంలో నేతాజీ విద్యాలయంలో బాలికలు శ్రీకృష్ణుడు, రాధాగోపిక వేషధారణలో అలరించారు.



గో పూజ చేస్తున్న భక్తులు



షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న హరిబాబు, బాబూరావు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

అద్దంకిటౌన్, ఆగస్టు 26 : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలల్లో భాగంగా అద్దంకి డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు సోమవారం స్థానిక శింగరకొండ వద్ద గల ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ముందుగా నిర్వహించిన షటిల్ పోటీలను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పూనాటి హరిబాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం బాబురావు ప్రారంభించారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాటాలు చేయడంతో పాటు సామాజిక సంస్కృతిక కార్యక్రమాల్లో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయడం కోసం స్వర్ణోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. డివిజన్ స్థాయిలో గెలుపొందిన టీమ్‌లు సెప్టెంబర్ 1వ తేదీన బాపట్లలో జరిగే జిల్లా స్థాయి పోటీలలోను, అక్కడ గెలుపొందిన వారు గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా షటిల్‌తో పాటు క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్, రన్నింగ్, చెస్, కబాడీ వంటి పలు రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి బేతాళ పూర్ణచంద్రరావు, అధ్యక్షుడు ఈ రామారావు, గంగాధర్, శ్రీనవాసరావు, హనుమంతరావు, రామాంజనేయులు, రాజశేఖర్, బ్రహ్మజి పాల్గొన్నారు.



బాలికల ఖోఖో జట్టుకు ఎంపిక చేసిన క్రీడాకారిణులు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

పంగులూరు, ఆగస్టు 26 : రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలబాలికల ఖోఖో పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక సోమవారం పంగులూరులో జరిగింది. సెప్టెంబరు 20 నుంచి 22 వరకు పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఈ జట్లు పాల్గొంటాయి. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 100 మంది బాలురు, 50 మంది బాలికలు పాల్గొన్నారు. వీరిలో 25 మంది బాలురును, 25 మంది బాలికలను క్రీడా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలురకు ఈ నెల 27 నుంచి పంగులూరు జూనియర్ కళాశాల ప్రాంగణంలో, బాలికలకు జిల్లాలోని కంచర్లవారిపల్లె ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, పీడీలు కె.హనుమంతరావు, డి.రమాదేవి, జె. శ్రీనివాసులు, ఎం.సౌజన్య, కె.ప్రసాద్, పీఈటీలు వసంత రఘుబాబు, సావిత్రమ్మ, వీరాంజనేయులు, అజయ్ పాల్గొన్నారు. బాలురకు జె.పాల్, డి.లక్ష్మీనారాయణ, బాలికల జట్టుకు కాశీవిశ్వనాథరెడ్డి, పి.శ్రీనివాసరావు శిక్షణ ఇస్తారని తెలిపారు.

ఏపీపీయూఎస్ఎంఏ జిల్లా నూతన కార్యకర్గం ఏకగ్రీవం



చీరాల : నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యకవర్గం



పర్చూరు : నూతన కార్యవర్గ ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 26 : ఏపీపీయూఎస్ఎంఏ (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజిమెంట్స్ అసోసియేషన్) జిల్లా నూతన కార్యకర్గంను స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిర్ణీత నిబంధనల మేరకు రాష్ట్ర ఎలక్షన్ ఆఫీసర్స్‌గా బాధ్యతలు నిర్వహించినవారు ఏకగ్రీవంగా ఎంపిక జరగటంపట్ల అభినందించారు. సంఘ జిల్లా గౌరవ అధ్యక్షునిగా టి.విజయ్‌కుమార్(ఆదర్శ స్కూల్స్, ఇంకొల్లు), జిల్లా అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వర్లు(ఎంవీ)(శ్రీ గౌతమి స్కూల్స్, చీరాల), వైస్ ప్రెసిడెంట్‌గా అంజిరెడ్డి మన బాలభారతి స్కూల్స్(సంతమాగులూరు అడ్డరోడ్డు, అద్దంకి), జనరల్ సెక్రటరీగా ఎస్.రవిశంకర్(రైన్‌బో స్కూల్, రేపల్లె), జాయింట్ సెక్రటరీగా బ్రహ్మం(మహాత్మాగాంధీ స్కూల్, అద్దంకి), కోశాధికారిగా వి. నాగేశ్వరరావు(సిద్ధార్థ స్కూల్, బట్టిప్రోలు), ఇసి మెంబర్స్‌గా హయగ్రీవాచారి (బాలభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, గూడవల్లి,రేపల్లె), రామకృష్ణ (గీతాంజలి స్కూల్, ఈపురుపాలెం, చీరాల)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా అడుగులు వేస్తూ మెరుగైన ఫలితాలు సాధిద్దామన్నారు. అలానే అసోసియేషన్ తరపున ఉమ్మడి అవసరాలు, సమస్యల పరిష్కారానికి ఎప్పుడు సమష్టిగా ముందడుగు వేద్దామని తీర్మానించారు. ఎలక్షన్ ఆఫీసర్స్‌గా బాధ్యతలు నిర్వహించిన సంఘ బాధ్యులు, తోటి కరస్పాండెట్స్ సంఘీయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దన్యవాదాలు తెలిపారు.

అపుస్మా అధ్యక్షునిగా రాము

పర్చూరు : అపుస్మా పర్చూరు నియోజకవర్గ అధ్యక్షునిగా పర్చూరు మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన తేళ్ల వెంకట రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు అధ్యక్షతన పర్చూరులో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా కృష్ణంశెట్టి రామకోటేశ్వరావు, కార్యదర్శిగా చిలుకూరి శ్రీధర్‌రావు, కోశాధికారిగా శ్రీనివాసరావు, సభ్యులుగా ఆంజనేయులు, లక్ష్మయ్య చౌదరి, ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

పొలాల్లో సోలార్ ప్యానల్ వైర్లు చోరీ



మాయమైన ప్యానెల్‌ను చూపుతున్న రైతు

మార్టూరు, ఆగస్టు 26 : మండల పరిధిలో ఇసుకదర్శి గ్రామానికి చెందిన 8 మంది రైతులకు చెందిన పొలాల్లో సోలార్ ప్లేట్లకు చెందిన ప్యానల్ వైర్లను ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకు పోయారు. అంతేగాకుండా విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైరును కూడా కూడా కత్తిరించి తీసుకుపోయారు. దాంతో ఒక్కో రైతుకు 5 నుంచి 7వేల రూపాయలకు పైగా నష్టం జరిగినట్లు రైతులు చెప్తున్నారు. గతంలోనూ ఇలాగే పొలాల్లో చోరీ చేయగా, మరలా కొత్తగా వైర్లు బిగించుకున్నామని, మళ్లీ ఇప్పుడు దొంగతనం జరిగిందని రైతులు వాపోతున్నారు. ఒకే పొలంలో ఇది మూడోసారి అని కొంతమంది రైతులు తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కామేపల్లి సురేంద్ర, మారెళ్ల సుబ్బారావు, వెలగా సుబ్బయ్య, కాకర్ల రామాంజనేయులు, నల్లూరి సుబ్బయ్య తదితర రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కొత్తపేట(చీరాల), ఆగస్టు 26 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను డ్రైవర్‌తో సహా 216 జాతీయ రహదారిలో సోమవారం ఎక్సైజ్ సీఐ కర్ణ, సిబ్బందితో కలసి పట్టుకున్నారు. ట్రాక్టరు, డ్రైవర్‌ను టూటౌన్ పోలీసులకు అప్పగించామని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తారని సీఐ తెలిపారు.

వరి సాగుకు సాగర్ నీరివ్వాలి

పంగులూరు, ఆగస్టు 26 : సాగర్ ఆయకట్టు కుడి కాలువ పరిధిలో వరి సాగుకు నీరందించాలని రైతు సంఘం ప్రతినిధులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, తలపనేని రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఆయకట్టు కుడి కాలువ పరిధిలో ఆరుతడి పంటలకే నీరు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తిగా నీటితో నిండిపోయి నీరంతా సముద్రం పాలవుతుందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తిగా నిండిపోయాయని, సాగు నీటికి, తాగునీ టికి ఈ సంవత్సరం ఎలాంటి ఇబ్బంది ఉండబోదని రైతులు భావిస్తున్నా రన్నారు. ప్రభుత్వం మాగాణి సాగుకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై ధర్నా

మార్టూరు, ఆగస్టు 26 : మండలంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజాలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ బాధ్యుడు బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ నెల కొందట కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వరుసగా ఐదు రోజులు ప్లాజా వద్ద ధర్నా చేపట్టామన్నారు. దాంతో ఇద్దరు ఉద్యోగులలో ఒకరిని మహారాష్ట్రకు బదిలీ చేసి, మరొకరిని విధుల నుంచి తొలగించారన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ప్లాజా మేనేజర్ కిరణ్ కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీహెచ్ మజుందార్, కందిమళ్ల రామకోటేశ్వరరావు, తల్లపనేని రామారావు, రాంబాబు, కృష్ణమూర్తి, మార్టూరు, యద్దనపూడి, జె.పంగులూరు మండలాల రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమ్మ ఆశ్రమంలో కుట్టు శిక్షణ ప్రారంభం

మార్టూరు, ఆగస్టు 26 : అమ్మ ఆశ్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి కుటుంబాలలోని మహిళలకు ఆసరాగా ఆశ్రమంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షురాలు షేక్ హబీజూన్ మాట్లాడుతూ 45 రోజులు మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తామన్నారు. మొదటిరోజు 20 మంది మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో జాష్టి అనూరాధ, గుంటుపల్లి చందు పాల్గొన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, షేక్ కాజాహుస్సేన్ పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట మోహనరావు

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

మంగళవారం, 27 ఆగస్టు 2024

భక్తిశ్రద్ధలతో 'కృష్ణాష్టమి'

ఆలయాలకు పోటెత్తిన భక్తులు





నెల్లూరు : ఫత్తేఖాన్‌పేటలో ఉట్టి కొడుతున్న యువకుడు

ఇస్కాన్ మందిరంలో జగన్నాథుడి అలంకారం

ఇస్కాన్‌లో కృష్ణుడి వేషధారణలో చిన్నారి

జయ జనార్దనా..!

తలపై కిరీటం, దానిపై నెమలి ఈక, మెడలో హారాలు, చేతిలో పిల్లనగ్రోవి, తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టుతో పాలబుగ్గల చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. భక్తుల కోలాటం ఆకట్టుకోగా, ఉట్టి మహోత్సవం ఉత్సాహంగా సాగింది. 'హే కృష్ణా ముకుందా మురారీ.. జై కృష్ణ.. జై జై కృష్ణా' నామస్మరణలతో జగన్నాథుడి మందిరాలు హోరెత్తిపోయాయి. తొలుత ఆలయాల్లో ఉదయం స్వామివారికి అభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరణలు, విశేష పూజలు, సాయంత్రం పల్లకీ సేవలు జరిగాయి. నెల్లూరులోని ఇస్కాన్ మందిరానికి భక్తజనం పోటెత్తారు. వేణుగోపాలుడి ఆలయంలో దేవేరులతో కలిసి స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుల కల్యాణం కనులపండువగా జరిగింది. రాత్రి శేషవాహనం కొలువుదీరిన ఉత్సవర్లు భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు.

- నెల్లూరు (సాంస్కృతికం)








నెల్లూరు : వేణుగోపాలుడికి, దేవేరులకు ఊంజల్‌సేవ

రాపూరు : పెద్ద శేష వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

ఇసుక దోపిడీ నిజమే!

- రూ.వందల కోట్ల ఖనిజాన్ని మింగిన ఘనులు
- పెన్నా గర్భంలో విచ్చలవిడిగా తవ్వకాలు
- మైనింగ్ అధికారుల విచారణలో బట్టబయలు
- 18 ప్రాంతాల్లో పూర్తయిన విచారణ
- శాటిలైట్ ఇమేజ్‌తో పోల్చేందుకు ఆదేశాలు

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగింది నిజమేనని మైనింగ్ అధికారుల విచారణలో తేటతెల్లమైంది. పెన్నా నదీ గర్భంలో ఎక్కడపడితే అక్కడ.. ఎలా పడితే అలా.. విచ్చలవిడిగా తవ్వకాలు జరిపారని నిర్ధారణ అయ్యింది. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను అనధికారికంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారని గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమ ఇసుక వ్యాపారం విలువ రూ.వందల కోట్లలో ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ మేరకు మైనింగ్ అధికారులు నివేదికలు తయారు చేశారు. మరోవైపు ఇసుక తవ్వకాలకు అనుమతులపై ఏసీబీ అధికారులు మైనింగ్ శాఖ కార్యాలయంలో విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు.



ఇందుకూరుపేట మండలం పల్లిపాడు వద్ద పెన్నా నదిలో అక్రమ తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంతలు

నెల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో జిల్లాలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. పెన్నా నదితో పాటు మన్నేరు వాగులో 18 చోట్ల ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణకు ఉత్తర్వులు ఇచ్చింది. కోవూరు నియోజకవర్గంలోని వేగూరులో 137 ఎకరాలు, ముదివర్తి-1లో 46.4 ఎకరాలు, ముదివర్తి-2లో 44.4, ముదివర్తి-3లో 8.77, ముదివర్తి-4లో 21.22, పల్లిపాడులో 22, పల్లిపాడు-2లో 4.22, లేగుంటపాడులో 7.41, కోడూరుపాడులో 7.66, వెంకటేశ్వపురంలో 4.72, మినగల్లులో 45.45, గొల్లకందుకూరులో 41.5, విరువూరులో 55.8, సూరాయపాలెంలో 63, నెల్లూరులో 4.36, కందుకూరు నియోజకవర్గంలోని మనేటి కోటలో 4.51, రాళ్లపాడులో 5.75, కలవాళ్లలో 0.78 ఎకరాల్లో అక్రమంగా తవ్వకాలు జరిగినట్లు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ ఆదేశాలతో జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసకుమార్ నేతృత్వంలో మైనింగ్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. దాదాపు నెల రోజుల పాటు ఈ తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లో పరిశీలన జరిపారు. గుంతలను కొలతలు తీశారు. ఆ తర్వాత ఏ ప్రాంతంలో ఏ మేరకు తవ్వకాలు జరిగాయి..? అన్న లెక్కలు వేశారు. ప్రతిచోటా భారీగానే ఇసుకను అక్రమంగా తవ్వి తరలించినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

- **త్వరలోనే కేసులు..?**

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల అక్రమ తవ్వకాలు జరిపినందుకు జేపీ, ప్రతిమ సంస్థలపై ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. ఇప్పుడు అదే క్రమంలో జిల్లాలోనూ కేసుల నమోదుకు సిద్ధమవుతోంది. అయితే అధికారులు ఇచ్చిన నివేదికను మరింత బలపరిచేందుకు శాటిలైట్ ఇమేజస్‌తో (ఫొటోలు) కూడా విచారణ చేయాలని తాజాగా ఆదేశాలిచ్చింది. ఈ ఇమేజస్ ద్వారా ఎప్పుడు ఏ స్థాయిలో ఇసుక తవ్వకాలు జరిపారన్నది తెలిసిపోతుంది. కాగా అక్రమ తవ్వకాలు నిజమని తేలడంతో తాజాగా రికార్డుల పరిశీలనకు ప్రభుత్వం ఏసీబీకి ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలోనే గడిచిన మూడు రోజులుగా ఏసీబీ అధికారులు నెల్లూరులోని మైనింగ్ శాఖ కార్యాలయంలో గత ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలకు ఇచ్చిన అనుమతులకు సంబంధించి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియంతా పూర్తయి ఆధారాలన్నీ పక్కాగా సిద్ధమయ్యాక అక్రమార్కులపై సీరియస్ యాక్షన్‌కు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ విచారణపై మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాలతో 18 ప్రాంతాల్లో విచారణ పూర్తి చేసినట్లు చెప్పారు. అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపినట్లు నిర్ధారణ అయ్యిందని, ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. తాజాగా శాటిలైట్ ఇమేజస్‌తో విచారణ జరపాలని ఆదేశాలు వచ్చినట్లు వెల్లడించారు.

'మైనింగ్'లో ఏసీబీ సోదాలు

- మూడు రోజులుగా ప్రతి ఫైలూ తనిఖీ

నెల్లూరు (క్రైం) : మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల బృందం మూడు రోజులుగా విస్తృత సోదాలు చేస్తోంది. ఏసీబీ డీఎస్పీ శిరీష ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రతి ఫైల్‌నూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత ప్రభుత్వంలో అమల్లోకి వచ్చిన ఇసుక పాలసీలో కేటాయించిన రీచ్‌లు, తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు, పాయింట్ల వద్ద ఇసుక రవాణా ఇలా ప్రతి అంశానికి సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కేటాయించిన అనుమతులు, తవ్వకాలలో నిబంధనలు ఉల్లంఘించడం, అనుమతులు లేని మైనింగ్ ప్రాంతాలకు సంబంధించిన అన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగానే జిల్లాలోనూ ఈ తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తుంది.



వన మహోత్సవానికి సర్వం సన్నద్ధం

- 30న విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం
- నెల్లూరు నగరవనంలో ప్రారంభ సభ
- 20 రకాల మొక్కలను సిద్ధం చేసిన అటవీ శాఖ
- డిసెంబరులోగా 30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 26 : రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన వన మహోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా అటవీ శాఖ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. నెల్లూరు శివార్లలోని కొత్తురు సమీపంలో ఉన్న నగరవనంలో వన మహోత్సవం ప్రారంభ కార్యక్రమం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం నాడు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల సమక్షంలో వన మహోత్సవం జరపనున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటేందుకు కదిలి రావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతోపాటు డిసెంబరులోగా జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటేందుకు అటవీ శాఖ కార్యాచరణ రూపొందించింది.



'వన మహోత్సవం' కోసం అటవీ శాఖ సిద్ధం చేసిన మొక్కలు

జిల్లా టార్గెట్ 30 లక్షలు

అటవీ శాఖలోని టెరిటోరియల్, సోషల్‌ఫారెస్ట్ తోపాటు హార్టికల్చర్, సెరీ కల్చర్, డ్వామా, విద్యాశాఖ ఇలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ఈ వన మహోత్సవంలో భాగం కానున్నారు. అయితే ఏ శాఖ వారు ఎన్ని మొక్కలు నాటాలన్న దానిపై కలెక్టర్ ఆదేశాల మేరకు మొక్కలను అందజేయనున్నారు. ఇందుకు అవసరమైన మొక్కలను నర్సరీలు, వీఎస్‌ఎస్‌ల్లో సిద్ధం చేసి ఉంచారు. అదే విధంగా ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్ కార్డు నకలును నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న సోషల్‌ఫారెస్ట్ కార్యాలయంలో అందజేసి మొక్కలను ఉచితంగా పొందవచ్చు.

20 రకాలు

వన మహోత్సవం కోసం దాదాపు 20 రకాల మొక్కలను ఇప్పటికే జిల్లా అటవీ శాఖ అధికారులు సిద్ధం చేశారు. ఇందులో ప్రధానంగా ఎర్రచందనం, టేకు, రావి, మర్రి, నారేపి, నెమలినార, తెల్లమద్ది, నేరేడు, వేప, చిందుగ, రోజ్‌ఉడ్, ఉసిరి, జామ, కరివేపాకు, దానిమ్మ, బొప్పాయి, మునగ తదితర మొక్కలను సిద్ధం చేసి ఉంచారు.

ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాలి



వన మహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి. జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. అప్పుడే పెట్టుకొన్న టార్గెట్ పూర్తి చేయగలం. జిల్లావ్యాప్తంగా నర్సరీలు, వీఎస్‌ఎస్‌ల్లో దాదాపు 20 రకాల మొక్కలను సిద్ధం చేసి ఉంచాము. టెరిటోరియల్ విభాగంలో 4లక్షల మొక్కలతోపాటు పలు విభాగాల్లో 30 లక్షల మొక్కలను సిద్ధం చేస్తున్నాము. కార్తీక మాసం నుంచి డిసెంబరులోగా జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటాలని టార్గెట్ పెట్టుకొన్నాము.

- ఏ. చంద్రశేఖర్, డీఎఫ్‌వో

నాటి వైభవం.. నేడు ఏదీ?

- ప్రాభవం కోల్పోతున్న చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం
- లాంఫాంకు అప్పగించినా ప్రయోగం ఫెయిల్
- జంగిల్ క్లియరెన్స్‌కే రూ.కోట్ల వ్యయం



నిరుపయోగంగా ఉన్న చినపవని వ్యవసాయ క్షేత్రం భూములు

రాష్ట్రంలోనే వరి విత్తనాభివృద్ధి క్షేత్రంగా ఓ వెలుగు వెలిగిన చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం నేడు నిరుపయోగంగా మారింది. అధిక దిగుబడులనిచ్చే పలు నూతన వరి వంగడాల రూపకల్పనకు కేంద్రంగా నిలవడమేకాక ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వరిసాగు అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన చినపవని క్షేత్రం నేడు ప్రాభవం కోల్పోయింది. 1994లో పోటెత్తిన వరదకు రాళ్లపాడు రిజర్వాయరు తెగిపోవటంతో ఈ క్షేత్రానికి గ్రహణం పట్టింది. తదనంతరం అనేక రూపాంతరాలు చెందినా రైతులకు ఉపయోగపడే పరిస్థితి లేకుండా పోయింది. ఇక్కడ పరిశోధనల పేరుతో రూ. కోట్లు ఆవిరైపోతున్నా ఒక్క నూతన వంగడాన్ని కూడా అభివృద్ధి చేసింది లేదు.

కందుకూరు, ఆగస్టు 26 : రాళ్లపాడు రిజర్వాయరు 1994లో తెగిపోయిన తర్వాత ఇక్కడ వరిసాగుకు అవకాశం లేకుండా పోవటంతో ఈ క్షేత్రంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో పదేళ్లపాటు ఈ క్షేత్రం బీడుగా మారింది. 2005లో అప్పటి ఎమ్మెల్యే మహీధరరెడ్డి ఈ క్షేత్రాన్ని పునరుద్ధరించాలన్న లక్ష్యంతో రూ.కోట్లు మంజూరు చేయించి చేసిన ప్రయత్నం విఫలమైంది. తగినంతమంది అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది నియామకం జరగకపోవటంతో రెండు, మూడేళ్లకు ఒకసారి రూ. లక్షలు వెచ్చించి జంగిల్ క్లియరెన్స్ జరుగుతూనే ఉంది. తూతూమంత్రంగా వరిసాగు చేసి వదిలేయటం పరిపాటిగా మారింది. రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా వరిసాగుకు తగినంత నీటిసరఫరా కాని పరిస్థితిలో 2017లో ఎమ్మెల్యే పోతుల రామారావు ఈ క్షేత్రాన్ని పప్పుదినుసులు, తృణధాన్యాల అభివృద్ధి కేంద్రంగా మార్పు చేయించి లాంఫాంకు అప్పగించేలా కృషి చేశారు. లాంఫాం చేతిలో ఇన్ని వందల ఎకరాల సారవంతమైన భూములను పెడితే పరిస్థితి షరా మామూలే అన్న చందంగా మారింది. చినపవని క్షేత్రానికి ఉన్న 543 ఎకరాల్లో 413 ఎకరాలను లాంఫాంకు అప్పగించారు. కేపీఎస్‌ఎం రోడ్డుకు తూర్పున ఉన్న మరో 130 ఎకరాలను అలాగే ఉంచారు. 2019లో ఈ భూములను లాం ఫాంకు అప్పగించినా వారు కూడా రెండు సార్లు జంగిల్ క్లియరెన్స్ చేశారే తప్ప ఇంతవరకు ప్రయోగాలు చేసింది లేదు. వాస్తవానికి లాంఫాం ఆధ్వర్యంలో పప్పు ధాన్యాలు, నూనెగింజలతోపాటు కొర్రలు, అరికెలు, సామలు తదితర తృణ ధాన్యాలలో అధిక దిగుబడుల దిశగా, నూతన వం గడాల రూపకల్పన దిశగా ప్రయోగాలు జరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఆయా పంటల సాగులో వినూత్న పద్ధతులు, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించటం, నూతన వంగడాలను రైతులకు పరిచయం చేయటం లాంటి పనులను లాంఫాం బాధ్యతాయుతంగా నిర్వహిస్తుందని ఆశించారు. అయితే లాంఫాం ఇక్కడ ఒక శాస్త్రవేత్తను, ఓ రికార్డు అసిస్టెంట్‌ను, ఒక ఏఈవోను శాశ్వత ప్రాతిపదికన నియమించి, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు అటెండర్లను కాంట్రాక్టు బేసిస్‌లో నియమించింది. వారు మొక్కుబడిగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఐదేళ్లుగా ఇదే తంతు నడుస్తున్నది.

కేవీకేతో సమన్వయం చేసుకోవాలి

కందుకూరులో ప్రస్తుతం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శాస్త్రవేత్తలు తగినంతమంది ఉన్నారు. వారు రైతు లకు అందు బాటు లో ఉంటూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా రు. అయితే సీటీఆర్ఐలో వారికి కేటాయించిన ఎర్రనేలల్లో అన్నిరకాల పంటల సాగుకు, పరిశోధనలకు అవకాశం లేకపోవటం ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో చినపవని వద్ద ఉన్న సారవంతమైన భూముల్లో లాంఫాం శాస్త్రవేత్తలతో పాటు కేవీకే శాస్త్రవేత్తలు కూడా సమన్వయంతో పరిశోధనలు సాగించేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

ఎక్సైజ్‌లోకి సెబ్!

- విలీనం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు
- అతి త్వరలో ఉత్తర్వులు?
- మద్యం పాలసీపై పలు రాష్ట్రాల్లో అధ్యయనం
- ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రంలోనూ కొత్త పాలసీ



నెల్లూరు (క్రైం), ఆగస్టు 26 : ఎన్నో అవినీతి ఆరోపణలను మూట గట్టుకున్న సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అతి కొద్దిరోజుల్లోనే కనుమరుగు కానుంది. కూటమి ప్రభుత్వ ఎక్సైజ్‌శాఖలో విలీనం చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌ను రెండు విభాగాలుగా విడగొట్టి 70 శాతం సిబ్బందిని సెబ్‌కు కేటాయించారు. అలాగే పోలీసుశాఖ నుంచి 30 శాతం సిబ్బందిని కలుపుకొని పూర్తిస్థాయిలో సెబ్‌ను 2020లో గత వైసీపీ సర్కారు ఏర్పాటు చేసింది. మద్యం అక్రమ రవాణాతోపాటు గంజాయి, ఎర్ర చందనం, ఇసుక, మట్టి, గుట్కా, పేకాట ఇలా అన్నింటిపై సెబ్ తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టవచ్చని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, విధించిన లక్ష్యాలను మాత్రం సెబ్ అధికారులు అందుకోలేకపోయారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టాక నూతన మద్యం పాలసీ వైపు వేగంగా అడుగులు వేసింది. ఈ క్రమంలో సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేయాలా!? వద్దా!? అన్న అంశంపై ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళ నాడు, కేరళ రాష్ట్రాలకు కమిటీలను పంపి అక్కడి మద్యం పాల సీ విధానాలు, లోటుపాట్లను అధ్యయనం చేయాలని సూచించింది. దీంతో 19 మంది కమిటీ సభ్యులు ఆయా రాష్ట్రాల్లో మద్యం పాలసీలను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందచేశారు. దీంతో సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 28వ తేదీన పూర్తిస్థాయిలో ఉత్తర్వులు విడుదల కానున్నట్లు సమాచారం.

- **ఎన్నెన్నో ఆరోపణలు**

2020లో సెబ్ ఏర్పడినప్పటి నుంచి అనేక ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. సెబ్‌కు ఎస్పీ బాస్‌గా ఉండగా, అదనపు ఎస్పీ స్థాయి అధికారిని జేడీగా నియమించారు. జిల్లావ్యాప్తంగా 10 సెబ్ స్టేషన్లు ఉండగా, జేడీ ప్రత్యేక బృందం తనిఖీల్లో పాల్గొనేవారు. ఎక్కువగా జేడీ బృందం మాత్రమే తనిఖీలు ముమ్మరం చేసి మద్యం, గంజాయి, ఇసుక, గుట్కా, పేకాట వంటి స్థావరాలపై దాడులు నిర్వహించి, బాధ్యులను అరెస్టు చేసేవారు. మరి ఆయా ప్రాంతాల్లో ఉన్న సెబ్ స్టేషన్లలోని అధికారులు ఎందుకు విధులు నిర్వహించడం లేదన్న ప్రశ్నలు అనేకం వ్యక్తమయ్యాయి. సెబ్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పూర్తిగా అవినీతికి అలవాటు పడిపోయారని, ఇసుక, మట్టి మాఫియా, గుట్కా కేంద్రాలు, గంజాయి విక్రయదారుల నుంచి మామూళ్లు వసూలు చేసేవారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. స్థానిక నాయకులతోనూ మిలాఖత్ అయి సెబ్ లక్ష్యానికి తూట్లు పొడిచారన్న విమర్శలనూ మూటగట్టుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నాయకులు మద్యం డంప్‌లు చేస్తున్నారని సెబ్‌కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు దీంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడంతో వారు దాడులు చేశారని నాయకులు ఆరోపించారు. ఇలా చెప్పుకుంటూపోతే సెబ్‌పైన వచ్చినన్ని ఆరోపణలు ఏ శాఖపైనా రాలేదు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కృష్ణం వందే జగద్గురుమ్ !

● వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు ● కిక్కిరిసిన ఆలయాలు ● కోలాటాలు, ఉట్టి మహోత్సవాలు

జిల్లావ్యాప్తంగా ఉన్న కృష్ణమందిరాలు, వైష్ణవాలయాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఉట్టి మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు తల్లులు తమ చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషధారణలు వేసి జన్మాష్టమిని జరుపుకున్నారు.



లింగసముద్రం : రాధాకృష్ణుల విగ్రహాలకు పూజ చేస్తున్న ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, తదితరులు



అల్లూరు : గీతాశ్రమంలో గోపూజ చేస్తున్న నిర్వాహకులు



కలిగిరి: కృష్ణుడి వేషధారణలో బాలుడు, ఉదయగిరి, వరికుంటపాడులో ప్రత్యేక అలంకరణలో గోవర్ధన గిరిధారి



వింజమూరు : కృష్ణుడి చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

కావలిటౌన్, ఆగస్టు 26: కృష్ణాష్టమి వేడుకలు సోమవారం కావలిలో వైభవంగా జరిగాయి. పాతూరు కృష్ణమందిరం, రైల్వేరోడ్డులోని గీతా మందిరం, వెంగళరావునగర్‌లోని కృష్ణమందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. పాతూరు కృష్ణమందిరంలో వ్యవస్థాపక ధర్మకర్త బొంతా శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో ఉదయం స్వామివారిని ప్రత్యేక పూలంగి సేవ, అభిషేకాలు, గోపూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు ఉట్టి కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కావలి రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉన్న కృష్ణ మందిరాలు, రామాలయాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేసి స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

లింగసముద్రం : కృష్ణాష్టమిని మండలంలోని పలు గ్రామాల ప్రజలు వైభవంగా నిర్వహించారు. లింగసముద్రంలోని గోపాలనగర్‌లో గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, కల్లగుంట ప్రసాద్, కల్లగుంట శివ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు పలువురు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.అలాగే రాధాకృష్ణుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కలిగిరి : మండలంలో సోమవారం కృష్ణాష్టమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలువురు తల్లులు తమ చిన్నారులకు కృష్ణుడి వేషం వేయించి పెద్దల చేత ఆశీర్వచనాలు ఇప్పించారు. ఇంటిల్లిపాది కలిసి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అల్లూరు : కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఉదయం మండలంలోని వైష్ణవాలయాల్లో ప్రారంభమయ్యాయి. అల్లూరు వేణుగోపాలస్వామి ఆలయం, గీతాశ్రమంతోపాటు పలు ఆలయాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. గీతాశ్రమంలో ఉదయం శ్రీకృష్ణ నామ జప పారాయణ హోమం గోమాత పూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కరిణి వద్ద సాయంత్రం ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాలుడి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఉదయగిరి రూరల్ : మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. నేలటూరు, సున్నంవారిచింతల, గండిపాళెం, ఉదయగిరి, అప్పసముద్రం, కృష్ణారెడ్డిపల్లి, జీ.చెర్లోపల్లి, అయ్యవారిపల్లి, గుడినరవ, ఆర్లపడియ, కుర్రపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.పలువురు తమ చిన్నారులకు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలు వేయించారు.



జలదంకిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

దుత్తలూరు : సెంటర్‌లో త్రైత సిద్ధాంత వారి ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమిని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి అందులో స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

వరికుంటపాడు : మండలంలోని గువ్వాడిలో కృష్ణాష్టమిని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం కన్నయ్య పవళింపు సేవతోపాటు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అల్పాహారం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వింజమూరు : పటణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఉన్న కృష్ణ మందిరంలో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఉభయకర్తగా బైనబోయిన వెంకటేశ్వర్లుయాదవ్ వ్యవహరించారు. శంకర్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్మకూరు : శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో యాదవ వీధిలోని కృష్ణ మందిరం, టెంకాయతోపులోని రాధాకృష్ణుల మందిరంలో ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. పచ్చిపాల మోహన్ ఇంటి వద్ద నుంచి ఉభయ కలశం, పూజా సామగ్రి, పట్టువస్త్రాలతో మంగళవాయిద్యాల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా యాదవ వీధిలోని కృష్ణమందిరానికి చేరుకున్నారు. వేడుకగా వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. టెంకాయతోపులో రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. అలాగే మండలంలోని చెర్లోయడవల్లి, బట్టేపాడు, తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సంగం : స్థానిక తూర్పువీధిలోని కృష్ణమందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక శివాజీ సెంటర్‌లో కక్కిరాల భవిక్ అనే ఆరు నెలల చిన్నారి చిన్నికృష్ణుడి వేషధారణ ఆకట్టుకుంది.

ఏఎస్ పేట : స్థానిక కృష్ణ మందిరంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

బిట్రగుంట : మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బోగోలు యాదవపాలెంలో కొలువైఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు వేదగిరి శ్యాంసుందరాచార్యులు, వెంకటాచార్యులు వేణుగోపాలుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నూకసాని శ్రీనివాసులుయాదవ్-రాజ్యలక్ష్మీ, పూర్ణచంద్రరావు-మమత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సంతానగోపాలకృష్ణుడి ఆలయం, చెంచులక్ష్మీపురం, నాగులవరం, ఎస్సీపాలెం, జువ్వలదిన్నె గ్రామాల్లోని కోదండరామాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందుకూరు : శ్రీకృష్ణజన్మాష్టమిని పట్టణంలోను, పరిసర గ్రామాలలోను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. మరికొన్నిచోట్ల యువకులు ఉట్టికొట్టే వేడుకల్లో పాల్గొన్నారు. కాళిదాసువారివీధిలోని చిన్నికృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. పట్టణంలోని తూర్పుయాదవపాలెంలో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు.

జలదంకి : కృష్ణాష్టమిని మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జలదంకి యాదవబజారులోని కృష్ణమందిరంలో వైభవంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు పాల్గొని సందడి చేశారు. స్థానిక శ్రీసాయి స్కూల్స్ కరస్పాండెంట్ బత్తిన అయ్యలరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.



కావలి : గీతామందిరంలో ప్రత్యేక అలంకారంలో కృష్ణభగవానుడు, ఆత్మకూరు : యాదవవీధిలో రుక్మిణి సమేత శ్రీకృష్ణుడి కల్యాణం



సంగం : కృష్ణమందిరంలో పూల అలంకరణ, ఏఎస్ పేట : కృష్ణమందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



బిట్రగుంట : భక్తుల పూజలు అందుకుంటున్న వేణుగోపాలస్వామి



కందుకూరులో ఉట్టి కొడుతున్న యువకులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



కలిశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

సంగం, ఆగస్టు 26: మండలంలోని దువ్వూరు నడిబొడ్డున అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహ వచనం, తదితర పూజలు జరిగాయి. మంగళవారం బాలాంజనేయస్వామి గ్రామోత్సవం, 28న విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంభాభిషేకం తదితర పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 26: మండలంలోని భైరవరంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్సీ, ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, గొల్లపల్లి మోహన్‌రావు, పందిటి అంబేద్కర్, బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ మొక్కలు తొలగించకుంటే చర్యలు



ఆక్రమణకు గురైన భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో జనార్దన్

కలువాయి, ఆగస్టు 26: మండలంలోని మాదన్నగారిపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రాత్రికి రాత్రి నాటిన నిమ్మ మొక్కలను మంగళవారం సాయంత్రం లోపు తొలగించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారులను హెచ్చరించినట్లు వీఆర్వో జనార్దన్ తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైన విషయం ప్రతికల్లో రావడంతో సోమవారం ఆయన భూములను పరిశీలించి బోర్డు ఏర్పాటు చేశారు.

బీద లక్ష్మానంద్‌కు అబ్దుల్‌కలాం పురస్కారం



పురస్కారం అందుకున్న బీద లక్ష్మానంద్

కావలి, ఆగస్టు26: డివిజన్‌లో విశేషసేవలందిస్తున్న ప్రముఖ రక్తదాన చైతన్యకర్త బీద లక్ష్మానంద్‌కు ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయసేవా పురస్కారాన్ని అందచేశారు. విజయవాడకు చెందిన మదర్ సర్వీసెస్ సొసైటీ రెండో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అక్కినేని నాగేశ్వరరావు కళాక్షేత్రంలో సంస్థ అధ్యక్షుడు మల్లాది ప్రసాద్‌రావు చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత మాట్లాడుతూ తన సేవలు గుర్తించిన విజయవాడ మదర్‌సర్వీస్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు.

రియల్టర్లు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాల ఆధారాలివిగో..

● వాస్తవం కాదని నిరూపిస్తారా ? ● కావలి టీడీపీ నాయకులు

కావలి, ఆగస్టు26: స్థానిక రియల్టర్లు 123 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నారని, అందుకు తగిన ఆధారాలను టీడీపీ నేతలు వెల్లడించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, నాయకులు దావులూరు దేవకుమార్, దేవకొండ శ్రీనివాసులు మాట్లాడారు. ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి జాతీయ జెండా ఐకానిక్ వద్ద చర్చకు సిద్ధమా ? అని వారు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డికి, వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. ఆక్రమణలు వాస్తవం కాదని నిరూపిస్తే మీరు విధించే ఎలాంటి శిక్షకైనా సిద్ధమన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ విషయంలో మాజీ ఎమ్మెల్యే ఉలిక్కిపడుతుండటం చూస్తే, ఆ అక్రమాల్లో ఆయనకు వాటా ఉందనే అనుమానం నిజమని అర్థమవుతోందన్నారు. కొత్త అధికారులు వచ్చాక వైసీపీ అవినీతి, అక్రమాల బండారం బయటకు వస్తోందన్నారు. టీడీపీపై అనవసర విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మొగిలి కల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పొట్లూరు శ్రీనివాసులు, ఏగూరి చంద్రశేఖర్, అర్షియాబేగం, రహీం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తైక్వాండో పోటీల్లో కందుకూరు క్రీడాకారులకు పతకాలు

కందుకూరు, ఆగస్టు 26: విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏషియన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కందుకూరు క్రీడాకారులు పలు పతకాలు సాధించారని మాస్టర్ హఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు కందుకూరు నుంచి ఐదుగురు క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ఇద్దరు బంగారు పతకాలు, ఇద్దరు కాంస్య పతకాలు, ఒకరు రజితపతకం సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఐటీఎఫ్‌యూ ఇండియన్ గ్రాండ్‌మాస్టర్ బీవీ రమణయ్య, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, డాక్టర్ జహంగీర్‌లు అభినందించారని ఆయన తెలిపారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో గాండ్‌మాస్టర్, కోచ్ తదితరులు

తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

జిల్లా స్థాయి తైక్వాండో సీనియర్ బాలబాలికల ఎంపిక, ఖేలో ఇండియా తైక్వాండో పోటీలు స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో సోమవారం జరిగాయి.తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 80 మంది బాలబాలికలు హాజరయ్యారు. వివిధ విభాగాల్లో ఐదుగురు క్రీడాకారులు బంగారుపతకాలు సాధించారు. చీరాలకు చెందిన వి. వినీత, పి. భానురేఖ, జి. శివనాగసాయిలు, కందుకూరుకు చెందిన ఎస్కే మసూద్, ఎస్కే సాహిద్‌లు బంగారు పతకాలు సాధించారని, వీరంతా ఈనెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

కందుకూరు, ఆగస్టు 26: బీజేపీ సభ్యత్వ నమోదు ను విజయవంతంగా చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడు కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామంలోనై బీజేపీ కమిటీ ఏర్పడేలా కృషిచేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టమనేని హరిబాబు, బెల్లంకొండ మాల్యాద్రి నాయుడు, జొన్నాదుల సురేష్, రామవయ్య, చుండి మురళీధర్, బొర్రా కోటేశ్వరరావు, జగన్నాథం వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

సంగం, ఆగస్టు 26: స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఆటో డ్రైవర్లకు సీఐ వేమారెడ్డి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఆటో ఎక్కితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఐ నాగార్జునరెడ్డి ఉన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

కావలిటౌన్, ఆగస్టు 26: పట్టణంలోని 36వ వార్డు చెరువుకట్ట గిరిజన సంఘంలో చెడిపోయిన బోరు వద్ద గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ఆందోళన చేపట్టారు. మహిళల ఆందోళనకు సీపీఎం సంఘీభావం తెలిపింది. సీపీఎం పట్టణ కార్యదర్శి పీ పెంచలయ్య మాట్లాడుతూ గిరిజన సంఘంలో బోరు చెడిపోయి రెండునెలలైనా ఇప్పటికీ బాగుచేయలేదన్నారు. తాగునీటి వసతి లేకపోతే ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. పాలకులు ఎన్నికల హామీలు అమలు చేయాలని, ప్రత్యేకంగా పేదలు, గిరిజనుల నివసించే ప్రాంతాల పట్ల దృష్టి పెట్టాలన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

గుడ్లూరు, ఆగస్టు 26 : స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకు రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం మండల సీపీఎం శాఖ డిమాండ్ చేసింది. సీనియర్ నాయకులు మద్దిశెట్టి జాలయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సమావేశంలో ఆపార్టీ నాయకులు మాట్లాడారు. గుడ్లూరులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెయిన్ బజార్‌కు ఇరువైపులా కొందరు వ్యాపారులు ఆక్రమణలతో ముందుకు రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతుందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జీ వెంకటేశ్వర్లు, దామా కృష్ణయ్య, జీ స్టాలిన్, కొట్టే వెంకయ్య, ఎం. వెంకటేశ్వర్లు, నేలటూరి తిరుపాలు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

అల్లూరు, ఆగస్టు 26 : ఎస్ఐగా కోట్ర కిషోర్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి వీఆర్‌కు బదిలీ కాగా, కండలేరు ఎస్ఐగా పనిచేస్తున్న కిషోర్ బాబు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదన్నారు.

దుత్తలూరులో...

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 26: దుత్తలూరు ఎస్ఐగా సోమవారం పీ.ఆదిలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఉమాశంకర్‌ను కలిగిరి ఎస్ఐగా బదిలీ చేయగా, జలదంకి ఎస్ఐగా ఉన్న ఆదిలక్ష్మిని ఇక్కడికి బదిలీ చేశారు. సమిష్టి సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

రేపటి నుంచి స్వీయమదింపు పరీక్షలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 26: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 28 నుంచి వచ్చేనెల 4 వరకు 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వీయమదింపు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్ వలి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రశ్నపత్రాలతో మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలన్నారు. 1 నుంచి 5వ తరగతుల వరకు ప్రశ్నపత్రాలు స్కూల్‌కాంప్లెక్సుల నుంచి ఏరోజుకారోజు ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలని, 6 నుంచి 10వ తరగతుల ప్రశ్నపత్రాలు ఎంఈవో కార్యాలయం నుంచి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రశ్నపత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయుల సర్దుబాటు

వింజమూరు, ఆగస్టు 26 : మండలంలో ఈనెల 19న జరిగిన మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటును ఎంఈవో ఇష్టారాజ్యంగా చేశారని ఏపీటీఎఫ్ (1938) జిల్లా గౌరవాధ్యక్షుడు వీ శివకోటారెడ్డి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జడ్.మోహన్‌రెడ్డి, పీ కొండారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లకు మాత్రమే సర్దుబాటు జరగ్గా, ఓ గణిత ఉపాధ్యాయుడు జడ్పీహెచ్ఎస్ వింజమూరుకు అంగీకారం తెలిపారు. ఒక ఎంటీఎస్ ఉపాధ్యాయుడు లాస్ ఆఫ్ పే సెలవులో ఉండి, కౌన్సెలింగ్ గైర్హాజరై డివిజనల్ లెవల్‌కి ఆప్షన్ ఇచ్చారని పేర్కొన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల సమక్షంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌ను అవహేళన చేస్తూ జిల్లాలోఎక్కడ జరగని విధంగా రాత్రికిరాత్రే ఆ ఉపాధ్యాయుడిని గుండెమడకలలో నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిబంధనలను తూట్లు పొడవడం జరిగిందన్నారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిబంధనల మేరకు సర్దుబాటులో మార్పులు చేయాలని వారు డిమాండ్ చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 26 : మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరు వాగు, పెదపవని సమీపంలోని ఉప్పుటేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఎస్సై బాజీబాబు, సిబ్బంది దాడి చేసి నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని, డ్రైవర్లను, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేడదిబ్బలతో పొంచి ఉన్న వ్యాధులు

వరికుంటపాడు, ఆగస్టు 26: మండలంలోని గువ్వాడి గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు రోగకారకాలుగా ఉన్నాయి. సమీపంలోనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉన్నా, కొంతమంది రహదారి పక్కనే పేడదిబ్బలు వేశారు.దీంతో అటువైపుగా వెళ్లే ప్రజలతోపాటు వాహనదారులు ప్రతినిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పేడదిబ్బలు తొలగించాల్సి ఉంది.



రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు